UNIVERSAL LIBRARY
OU_204286
UNIVERSAL LIBRARY

OUP—391—29-4-72—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. Accession No.

Author

Title

This book should be returned on or before the date last marked below.

కందుకూరి వీరేశలింగము

సత్యరాజా పూర్వదేశ యాత్రలు.

ద్వితీయ భాగము.

లండాద్వీపము.

సత్యరాజా పూర్వదేశ యాత్రలు.

ద్వితీయభాగము—లంకాద్వీపము.

మొదటి ప్రకరణము.

ఆఁడుమళయాళములో నాకు సిద్ధుఁ డనుగ్రహించిన పసరు యొక్క మహిమచేత నడవవలసిన ప్రయాసములేక మనోవేగమున గగనమార్గమునఁబోయి క్షణకాలములో నేను లంకాద్వీపమున వాలితినని చెప్పియున్నానుగదా! హనుమద్దేవుని తరువాత నీకలికాలములో మన పెద్దలెవ్వరును పురాణములలోఁ దక్క దర్శింపనోచుకోని లంకాద్వీపమును వాయుపథమునఁ బోయి చేరఁగలుగుటకు మన భరతఖండవాసులలో నెల్ల నేనే ప్రథముఁడ నగుటచేత, ఇంతటి ఘన కార్యమును నిర్వహించిన యాయుత్తమోత్తమదినమును మహాపుణ్య దినమునుగా భావించి యేటేట మీ రుత్సవముచేసికొనక మానరన్న దృఢవిశ్వాసమునుబట్టి నేనక్కడ నడుగిడినదినమును మీకు సరిగా త్రుటిలవలతో చెప్పుచున్నాను. సావధానచిత్తులరై గ్రహింపుఁడు. నే నా దేశములో కుడికాలు మోపినపుణ్యకాలము హూణశకము ౧౮౮౩ వ సంవత్సరము మార్చినెల ౨౩ వ తేదీ మధ్యాహ్నము మూఁడుగంటల రెండుమినిట్లు నాలుగుసెకనుల ముప్పాతికమీఁద మూఁడువీసములకాలము. నేనా దేశమునందు వాలెడునప్పుడు సహితము మన దేశమందలి కాలజ్ఞులు తప్పుపట్టుట కవకాశము లేకుండ

త్రోవలోనే యెడమకాలుముడుచుకొని కుడికాలొక్కటియే భూమి మీఁదఁ బెట్టినాను. హూణపంచాంగములు లేని యాదేశములో సంవత్సరమును మాసమును తిథియు సరిగా నెట్లు తెలిసికోఁ గలిగితి వని సూక్ష్మబుద్ధి లేనివారు కొందఱడుగవచ్చును. అఁడుమళయాళ దేశములో మూఁడు సంవత్సరముల రెండుమాసముల పందొమ్మిది దినము లుండుటచేత దానినిబట్టి లెక్కవేసి చూడఁగా, నేనక్కడ ప్రవేశించినదినము సరిగా నేనిప్పుడు చెప్పినదే యయినట్టు తేలినది. అంతేకాక లంకానగరమునందు జ్యోతిశ్శాస్త్ర విద్వాంసు లనేకు లున్నందున వారి నాశ్రయించి తరువాత కొంతకాలమునకు వారిచేత వేయించిన లెక్కను బట్టికూడ రెండుమూఁడుదినము లెక్కువ తక్కువగా నేను జెప్పిన తిథి సరియైనట్టు సిద్ధాంతమయినది. ఆ రెండుమూఁడు దినముల వ్యత్యాసమును లంకాద్వీపమునకును మనదేశమునకును గల కాలవ్యత్యాసమువలనను జ్యోతిశ్శాస్త్ర సిద్ధాంత భేదములవలనను వచ్చినదగుటచేత మీ రాయల్ప భేదమును పాటింపక కర్మానుష్ఠానమునకు నేను చెప్పిన దినమే సిద్ధాంతము చేసికొనుఁడు. శాలివాహన శకాది హిందూశకముల నన్నింటిని విడిచిపెట్టి హూణశకప్రకారముగా సంవత్సర పరిగణన మేలచేసితివని కొందఱుబుద్ధిమంతులు శంక చేయవచ్చును. దానికిని సమాధానమువినుఁడు. ఇప్పుడు మన భరత ఖండమునం దంతటను వ్యాపించియున్న యింగ్లీషుపాఠశాలల మహాత్మ్యమువలన ముఖ్య పట్టణములయం దెల్లవారును తెలుఁగు సంవత్సరములును తెలుఁగు తిథులును మఱచి యున్నారనియు, ఇప్పుడించుమించుగా కలినిషిద్ధముగా నంగీకరింపఁబడుచున్న సంధ్యావందనమును జేయుఛాందసు లక్కడక్కడఁ గొందఱున్నను వారుసహితము "అస్మిన్ వర్తమాన వ్యావహారిక హూణమానేన ౧౮౮౩ సంవత్సరే, మార్చిమాసే ౦౩ తిథౌ" అని సంధ్యావందనములో నింగ్లీషుతిథు

లనే వాడుచున్నారనియు, నేనక్కడి జ్యోతిష్కులవలననే యెఱిగిన వాఁడ నగుటచేత మీకు సుబోధమగుటకయి యింగ్లీషు తిథులను వాడితినేకాని నాకు తెలియకకాదు. ఈకలికాలమునందు సహితము జ్యోతిషమిట్లు ప్రత్యక్ష నిదర్శనముగా నున్నదికదా! లంకాద్వీపమునందు జ్యోతిశ్శాస్త్రమే ప్రబలియుండని పక్షమున, ద్వీపాంతరమునందేకాకినయియున్న నేను దూరదేశమునందలి మీస్థితిగతుల నెఱుఁగక తిథి మాస సంవత్సరాదులను మీకు సురవగాహముగునట్లు శాస్త్రానుకూలమైన ప్రకారముగా తెలిపియుందును. నాకింతటి దివ్యజ్ఞానము ప్రసాదించిన యోజ్యోతిశ్శాస్త్రరాజమా! నీకు పదివేల నమస్కారములు. పశ్చిమ ఖండమునుండి హూణులు తెచ్చి విడుచుటచేత నిప్పుడు భరతఖండమునం దెల్ల యెడలను పిశాచములవలె సంచరించుచున్న ప్రకృతిశాస్త్రములకు భయపడక నీవు మాదేశము నెప్పుడును విడువక మావారి హృదయపీఠముల నధిష్ఠించి రాజ్యము చేయుచుందును. సంధ్యావందన విసర్జనకథనముచేత శాస్త్రోల్లంఘనము చేసినట్లు పామరులు భావింతురన్న భీతిచేత జ్యోతిశ్శాస్త్రమునుబట్టి నేనెఱిఁగిన యీసత్యమును మనవారు కొందఱు పయికొప్పుకోక పోయినను, మనస్సులలో నయిన సత్యమును గ్రహించి జ్యోతిషమును మునుపటికంటె నెక్కువగా గౌరవింతురని నమ్ముచున్నాను.

నేను లంకాద్వీపమును జేరినతరువాత నెటుపోదునాయని యాలోచించుచు క్షణకాల మొక మఱ్ఱిచెట్టు నీడను గూర్చున్నాను. మఱ్ఱిచెట్టని చెప్పఁగానే యది మనదేశపుమఱ్ఱిచెట్టు వంటిదే యని మీరనుకోవచ్చును. కాని యది యాకారమునందు మన మఱ్ఱిచెట్లనే పోలినను పరిమాణమునందు మాత్రము శతగుణము లధికమైనదిగా నున్నది. దాని యాకులు మనదేశమునందలి తామరాకు లంత లేసి యున్నవి; దానిపండ్లు పెద్దతాటికాయలంతలేసి యున్నవి; చిన్న

యూడలు నాకౌఁగిటి కడగినవి కావు; కొమ్మలారంభమైన మ్రానిప్ర కాండముయొక్క యెత్తినూఱడుగుల కంటె హెచ్చుగానున్నది; మ్రానియొక్క కైవారము సరిగా కొలవలేదుగాని నూఱడుగులకంటె నెక్కువగానే యున్నట్లు తోఁచినది; కొమ్మలు రెండుమూఁడు యోజనములదూరము వ్యాపించియున్నవి. చెట్టెంతయెత్తుండునోయని యాకాశమువంకఁ జూచితినిగాని నాదృష్టి వ్యాపించినంతవఱకు కొన కనఁబడలేదు. పయివంకఁ జూచుచుండఁగా నొక కాకి కొమ్మలలోఁ గూరుచుండి కావుమని కూసినది. ఉఱుమువలెనున్న దానికూఁత వినఁబడఁగానే నాగుండెలు పగిలిపోయినవి; దాని రూపమును జూచినను నాభయము తక్కువకాలేదు. అది రూపమునందు గేదెదూడంత యున్నది. దానినిజూచి యేపక్షినన్నుగ నెత్తుకొనిపోవునోయనిభయపడి ప్రాణరక్షణార్థమయి యొక యూడచాటునకుఁ బోయితిని. ఆవంక చూడఁగానే యూడమీఁదఁ బ్రాఁకుచు రెండు కండచీమలు నాకంటఁబడినవి. అవి మనదేశమునందలి యెలుకలంతలేసి యున్నవి. అవి కుట్టినపక్షమున యేనుఁగువంటి దృఢకాయుఁడు సహితము నిమిషములో పీనుఁగగుటకు సందేహముండదు. శివు నాజ్ఞలేనిది చీమకుట్టదన్న లోకోక్తి యథార్థముగా నేను సమీపమునకుఁ బోయినను నన్నొక చీమయు కుట్టలేదు. అయినను వానిదర్శనమువలన నైనభీతిచేతనే నాదేహమంతయు గాలిలోఁబెట్టిన దీపమువలె కంపింప మొదలుపెట్టినది. అప్పటి నాదురవస్థ నేమని చెప్పుకొనను! దుత్తూరపణీ పసరు కొంచె మక్కడ దొరకినపక్షమున మరల కాలికి రాచుకొని శీఘ్రముగా స్వదేశముచేరి ప్రాణరక్షణము చేసికొనవలెనన్న బుద్ధి పుట్టినది. నే నేవైపునఁ జూడ్కినిగిడ్చినను దుత్తూరపణీ యొక్కమొక్కయినను చుట్టుపట్ల నెక్కడను చూపుమేర దూరములో నాదృష్టికి గోచరముగాలేదు. అప్పుడు మనపూర్వులు మహాబుద్ధిమంతులయి దూర

దేశయాత్రలు నిషేధించిన దూరదృష్టియొక్క మహిమ నామనస్సునకు బోధపడి వారిసర్వజ్ఞత స్పష్టపడినది. ఆహా ! మనపూర్వులను బోలిన ధీమంతు లిప్పుడున్నవారిలోను ముందు పుట్టఁబోవువారిలోను కూడ నుండరు. ఇప్పుడు మనపెద్దలబుద్ధిని మెచ్చుకొనుచు వారి యందు పూజ్యతాబుద్ధి కలవాఁడనయి నాభాగ్యమింతేయని యెంచుకొని, పెద్దలు నిషేధించిన ద్వీపాంతరయానమునకు పూనినపాపఫల మనుభవింపక తీఱదని నిశ్చయము చేసికొని, వడవడ వడఁకుచు ప్రాణములమీఁది యాశ వదలుకొని ఈశ్వరనామస్మరణము చేసికొనుచు, చెట్టుక్రింద నిలువఁబడి యుంటిని. ఇట్లుండఁగా గాలిచేత మఱ్ఱిపండొకటి నాకాలిసమీపమున రాలి కుండపగిలినట్లు బల్లున పగిలినది. ఈశ్వరకటాక్షముచేత పండు కొంచెము దూరముగా పడినదికాని నానెత్తిమీఁదనే పడినపక్షమున తల రెండు వ్రక్కలయి మీకీవృత్తాంతమును చెప్పువారు లేక నేనిపాటికి స్వర్గలోకమున బ్రాతకాపునయి యుండియుందును. ఈనాయాపదల కన్నిటికిని హూణులు చేసిన భూగోళశాస్త్రము మూలము. వారిశాస్త్రములను వేనిని నమ్మినవాఁడనయినను వారు దేశములను తిరిగి చూచివచ్చి సత్యము వ్రాసినారన్న విశ్వాసముచేత లంక యనఁగా నాకు చెప్పినట్లు సింహళద్వీపమనియు, అక్కడ మనవంటి మనుష్యులే యున్నారనియు, వారు వ్రాసిన వ్రాఁతలు నమ్మి భ్రమపడి సాహసపోయి యీయాపదలను తెచ్చుకొన్నాను. కాని సత్యమునకు లంకయనఁగా సింహళద్వీపము కాదు సుండీ. అదివేఱు; ఇదివేఱు. ఈరెంటికినిగల భేదమునుగూర్చి మీకు ముందు ప్రకరణమునందుఁ దెలిపెదను. మహారణ్యమధ్యమున నేనిట్లు భయభ్రాంతుఁడనయి యున్న సమయములో గోరుచుట్టుమీఁద రోఁటిపోటు పడ్డట్లు మఱియొకవిపత్తుకూడ సంప్రాప్తమైనది. దిగ్భ్రమనొంది నేను దిక్కులు చూచుచుండగా నిరువదిముప్పది యడుగుల యెత్తు

గల నల్లని దిగంబరపురుషవిగ్రహ మొకటి నావంక నడిచి రా నారంభించెను. ఆ ఘోరరూపము నాకంటఁబడఁగానే పురాణములలో వర్ణింపఁబడిన రాక్షసుల రూపములును కథలును స్మరణకువచ్చి యది తప్పక రాక్షసదేశమనియు, ఆక్రూర రాక్షసుని నాఁటిసాయంకాలభోజనమునకు నేనే ప్రథమకబళము నగుదుననియు తోఁచి నామనస్సులో నానావిధములైన యూహలుత్పన్నములు కానారంభించినవి. నేను కన్నులెత్తి యా వికృతవిగ్రహమువంకఁజూచునప్పటికి ముందుగా పెద్దగోడుగంతయున్న యాభీకరముఖమునందు నిప్పుబంతులవలెనున్న వెలగపండ్లంతలేసి మిడిగుడ్లు రెండు నిప్పులుగ్రక్కుచుఁ గానఁబడినవి; అటుతరువాత మొసలినోరంత నోటిలో పులికోఱలను మించియున్న తెల్లని వ్రేలెడేసిముసిపండ్లు భయంకరముగాఁ గానఁబడి నాదృష్టిని మిఱుమిట్లు కొల్పినవి. అంతట నే నాఘోరాకారమును జూడలేక కన్నులు మూసికొన్నాను. కాటుక కొండవలె నడిచివచ్చుచున్న యావిగ్రహము సమీపింపఁగానే నాదేహము నిలువునచెమర్చి కంపమెత్తినది; నాలుకతడఁబడి నోట మాట రాకపోయినది; భయపడి ప్రాణములెక్కడకు లేచిపోయినవో కాని దేహస్మృతి సహితము తప్పిపోయినది. ఆ క్షణముననే నేను మూర్ఛలోమునిఁగి శవమువలెను మొదలునఱికిన వృక్షమువలె క్రిందపడిపోయినాను. అటుపిమ్మట నక్కడ నేమిజరగినదో నాకు తెలియదు.

నాప్రాణము లెంతసేపటికి మరల వచ్చి నాబొందిలో చేరుకొన్నవో నేను నిశ్చయముగా చెప్పలేనుగాని యవి చేరినపిమ్మట నేను కన్నులువిచ్చి చూచునప్పటికి నేను మునుపున్నచోట లేక భూమి కిరువదియడుగుల యెత్తున చెట్టుక్రింద నాకగపడిన రాక్షసునియొక్క యొకయఱచేతిలో నున్నాను. వానియొక్క రెండవచేతి వ్రేళ్ళు రెండు నానడుమును చుట్టుకొనియున్నవి. నాతొడలకంటెను నెక్కువలావుగా

లంకాద్వీపము.

నున్న యీవేళ్ళనడుమ నడకొత్తులోని పోకలాగున నిఱుకుకొ బాధపడుచు పయివంక, జూచినప్పటికి వానిముఖమప్పుడు సమీపమున నాకు మఱింత స్పష్టముగాఁ గానఁబడినది. తెఱచియున్న వానోరు పర్వతగుహావలె నున్నది; నాలుక గుహాలోనుండి పయికివెడలు చున్న కొండచిలువవలెనున్నది; దంతము లా కొండచిలువను పట్టుకొనుటకయి చాలుపుగావచ్చి ముక్కులుచాచి క్రిందను మీఁదను గుహముఖమున నిలుచున్న గరుడపక్షులవలె నున్నవి. ఆస్థితిచూచి నన్నుడా రాక్షసుఁడు గుటుక్కున మ్రింగుటకయి నోర వేసికొనఁ బోవు చున్నాఁడని భావించి, ఆక్రూరకృత్యమును చూడలేక మొగము వెనకప్రక్కకు త్రిప్పుకొన్నాను. అట్లు మొగము త్రిప్పుకొనఁగాఁ ముల్లుపుచ్చి కొఱ్ఱడచినట్లు ఒంటికంటెను ఘోరతరమైన వికృతరూపమొకటి నాకన్నులకు వెఱపుగొలుపుచు నావెనుకతట్టున నిలువఁబడియున్నది ఈక్రొత్తవిగ్రహము నాకంటఁబడఁగానే నన్ను చేతిలోఁ బెట్టుకొనియున్న యీరాక్షసవిగ్రహము దానిముందు కేవలశిశుప్రాయమయినది. మొదటి రాక్షసవిగ్రహ మీనూతన రాక్షసవిగ్రహము మొలవద్దకయినను రాలేదు. మొదటి విగ్రహముకంటె మూఁడంతలున్న యీవిగ్రహ మెంతపెద్దదిగా నుండునో దీనిని చదివెడివారే యూహించుకోవచ్చును. సమస్తావయవములును మొదటివిగ్రహమునకున్న దానికంటె మూఁడేసిరెట్లున్నవి. ఆవిగ్రహముయొక్క మొగము చూడవలెనని నేను తలయెత్తితినిగాని దేవాలయములోని గాలిగోపురముయొక్క శిఖరమువలె నున్న యాతనిశిరస్సు తిన్నగా కంటికి కనఁబడినదిగాదు. అడవిపందియొక్క వెన్నుమీఁది నిడుదవెండ్రుకలవలె నున్న యాతని కడుపుమీఁద నూగారు నడుమ నాదృష్టి కడ్డమువచ్చి బెదరింపఁగా క్షణకాలము తొలఁగిపోయిన భయదేవత మరలవచ్చి నాహృదయములోఁ బ్రవేశించి నాకన్నులను మూఁతవేసినది; అంగ

ములనల్లలనాడించినది; మొగమును వెలవెలఁబాఱించినది; ప్రాణములను బాఱఁదోలి శరీరమునంతను మరల వివశముచేసినది. ఇట్లు కొంతసేపు మరలమూర్ఛపోయి రెండవసారి తెలివి తెచ్చుకొని కన్నులువిచ్చి చూచునప్పటికి నేను మొదట ననుకొన్నట్లుగా పయికి పిన్న రాక్షసుని నోటిలోనికిఁబోక క్రిందికి భూమిమీఁదికి వచ్చి యున్నాను. అప్పుడుభూమిమీఁదనున్న నన్నాయిరువురు రాక్షసులును మోకాళ్ళ మీఁద గూరుచుండి వంగి నాయవయవములను శోధించి చూచుచున్నారు. ఆసమయమునందు నేను కదలి భూమిమీఁద నడువనారంభింపఁగా వారు సంతోషించి తమలోతామేమో చెప్పుకొని నన్నుమరల చేతులతోఁబట్టి మనదేశమునందు పిల్లలు పక్షిపిల్లలను బట్టలలోఁ బెట్టుకొని తీసికొనిపోవునట్లు నన్ను తమ బట్టలలోఁ బెట్టుకొని మఱియొక యింటికిఁ గొనిపోయి వాకిట బల్లమీఁదఁ గూరుచుండి చదువుకొనుచున్న మఱియొక రాక్షసుని జూచి నమస్కరించి యాతనితో నేమేమోచెప్పి మెల్లగా నన్నాతని బల్లమీఁదఁ బెట్టిరి. ఆతఁడును నన్ను మొట్టమొదట తన చేతిలోనున్న పుస్తకముతో మెల్లగా కదల్చిచూచి, కొంతసేపు నామొగమువంకను చేతులవంకను వంగిచూచి యాశ్చర్యపడి, పురుగును కఱచిపోవునేమోయని భయపడి మనము నేర్పుతో పట్టుకొనునట్లు మెల్లగా తనచేయి నావెనుకకుపోనిచ్చి సాహసించి చటుక్కున ముందఱి వ్రేళ్ళతో నానడుము పట్టుకొని పయికెత్తి, వెల్లవెలికిలఁబట్టి మొగముచేరువను బెట్టుకొని కొంతసేపు నన్ను నిదానించిచూచి చిఱునవ్వునవ్వి, నన్ను మెల్లగా మరల బల్లమీఁదఁ బెట్టెను. కఱుతునో కుట్టుదునోయన్న భయముచేత నన్నతఁడు గట్టిగా పట్టుకొన్నందున వ్రేళ్ళయొత్తుడుచేత నానడుమున లిగి తరువాత మూఁడు దినములవఱకును నానడుమునొప్పి పోయినది కాదు.

నన్ను మొట్టమొదట మఱ్ఱిచెట్టుక్రిందచూచినవాఁడు నాలుగేండ్ల ప్రాయముగల బాలుఁడు. బాలుఁడైన హేతువుచేతనే యాపిల్లవాఁడు దిగంబరుఁడుగా నున్నాఁడుగాని యాలంకలోని కాఁపులందఱును దేశమువారు కారు. అక్కడ పెద్దవాండ్రందఱును మనవలెనే తమకు తగిన వస్త్రములను ధరించుకొందురు. ఆబాలుఁడాడుకొనుటకయి యూరివెలుపలనున్న మఱ్ఱిచెట్టువద్దకువచ్చి నన్నుచూచి మూర్ఛపోయి యున్నప్పుడు పసివాఁడగుటచేత నన్ను నిర్భయముగా పిల్లికూనవలె తన యింటికిఁ బట్టుకొనిపోయి నేను మూర్ఛతేఱునప్పటికి నన్ను తన తండ్రికి చూపుచుండెను. అతఁడును నన్నాశ్చర్యపడిచూచి మనుష్యరూపమున నంతచిన్న జంతువున్నవార్తఁ యెప్పుడును విననందున, ఇటువంటి యద్భుతవస్తువును గొనిపోయి తన యజమానునికి కానుకిచ్చుట యుక్తమనిభావించి తత్క్షణమే కొనిపోయి యాతనికి సమర్పించెను. అతఁడును నారూపమును జూచి వింతపడి, అంతచిన్నదిగా నున్నను మనుష్యరూపమగుటకు సందేహములేదని నిశ్చయించి అయినను లంకాద్వీపము జ్యోతిష భూమియగుటచేత జ్యోతిష్కుల నడిగి మఱి సిద్ధాంతముచేయుట మంచిదని యెంచి, జ్యోస్యులనిమిత్తము సేవకులను బంపెను. ముహూర్తగ్రంథములను జాతకగ్రంథములను, సాముద్రిక గ్రంథములను చేతఁబట్టుకొని కొంచెము సేపటికి నలుగురు సిద్ధాంతు లక్కడకువచ్చిరి. అప్పుడతఁడు నన్ను కాలజ్ఞులకు చూపఁగా వారు నేనేజాతి జంతువునో నిర్ధారణము చేయుటకై గ్రహగతులను విచారించియు శ్వాసలు పరీక్షించియు శకునములనుజూచియు గణనవేయుట కారంభించిరి. ఆజ్యోతిష్కులలో నిద్దఱు మంచి పురాణవేత్తలు. మనదేశమునందువలెనే యాదేశమునందును పురాణములున్నవి. వారిలో నొకపురాణవేత్త కొంచెముసేపాలోచించి యొకచోట కలియుగములో నేల ము

లగ చెట్లకు నిచ్చెనలు వేయునంతటి హ్రస్వాంగులు పుట్టుదురని చెప్పియున్నందున నట్టి వారిలో నేను ప్రథముఁడనని చెప్పెను. ఇంకొక పురాణవేత్త తనవ్రేలితో నన్ను కొలిచి వాలఖిల్యాదు లని యొకతెగమహర్షు లంగుష్ఠమాత్రశరీరు లుందురని పురాణములలోఁ జెప్పియున్నందున నేను వాలఖిల్యాదులసంతతివాఁడ నని చెప్పెను. ఇట్లు పురాణమార్గమున మాత్రమే కాక తరువాత నలుగురు సిద్ధాంతులును జ్యోతిషమార్గమునకూడ నాలోచించి నేను మనుష్యుఁడనని యేకవాక్యముగాఁ బలికిరి. క్రొత్తగాఁ బోయినవానికి నీకు వారిసిద్ధాంతములన్నియు నెట్లు తెలిసినవని కొందఱు ప్రశ్న వేయవచ్చును. నాకప్పుడా సంగతు లేవియు తెలియనే లేదు. తరువాతఁ గొంత కాలము వారిదేశములోనుండి నేను వారిభాష నేర్చుకొన్న తరువాత నాకీసంగతు లన్నియు వారుచెప్పఁగా బోధపడినవి. వారిభాష కొన్ని దేశ్యపదములతోఁ గలిసియున్నను విశేషభాగము సంస్కృతపదములతో నిండియున్నది. అందుచేత మన భరతఖండనివాసులకు వారిభాష నేర్చుకొనుట మిక్కిలి సులభము. నేను వారిభాష నేర్చుకొన్న క్రమము చెప్పఁబూనుకొన్నచో మీకింపుగా నుండకపోవచ్చునని యోచించి మీకావివరములు చెప్పక నేను మూఁడుమాసములలో వారిభాష నొకవిధముగా మాటాడుటకు నేర్చుకొన్నానని మాత్రము విన్నవించుచున్నాను. ఇట్టి స్వల్పాంశములనుగూర్చికూడ వివరములు వినవలెనని వేడుకపడువారు కొందఱున్న పక్షమున, వారు శ్రద్ధాళువులయి నాయొద్దకు వత్తురేని నేను మర్మము విడిచి వారికి సమస్తమును తనివిదీఱ వినిపించెదను.

రెండవ ప్రకరణము.

మొదటి ప్రకరణములో నేను జెప్పిన సత్యములను విన్నవారు నా సత్యసంధతనుగూర్చి సంశయపడక పోయినను మనుష్యాశనుల దేశమునకుంబోయి వారిచేత భక్షింపఁబడక యొక్క మనుష్యుఁ డెట్లు మనకీకథలను జెప్పుటకు జీవింపఁ గలిగెనోయని యాశ్చర్యపడక పోరు. నేను రాక్షసులచే భక్షింపఁబడక పోవుటకుఁ గారణము లనేకములు కలవు. అందు ప్రధానమయినది నే నాఁడు మళయాళములో నేర్చుకొన్న మంత్రమహిమ. రెండవది యీకాలమునందు రాక్షసులు మనుష్యభక్షణమును మానుకొనుట. "వ్యాఘ్రము లెప్పుడయిన మాంసాశనము మానివేయునా? స్వభావముచేత మర్త్యాశనులయిన దనుజులు మనుజ భోజనముత్యజించుట యెట్లుసంభవించును? ఈవార్త నమ్మఁదగియుండ లేదు." అని మనకర్మజ్యేష్ఠులయిన శ్రోత్రియులొకవేళ నామాటలు పూర్వపక్షముచేయఁ జూడవచ్చును. అయినను సత్యమెప్పుడును సత్యమే యగును. సూర్యచంద్రాదుల గతులు తప్పినను తప్పవచ్చును. గాని నానోటినుండి మాత్ర మసత్య మెప్పుడును రాదు. నేను సూర్యుఁడు పశ్చిమమున నుదయించి దక్షిణమున నస్తమించునన్నను నామాట సత్యముకావలసినదే. నాయథార్థమును పరీక్షించుటకయి మీలో నెవ్వరయిన నీదేశమున కొక్కసారి నావెంట వచ్చినపక్షమున మీకు నాసత్యవాక్య ధురీణత బట్టబయలగును. దానవులు మానవాశనతను మానుటకును కారణములేకపోలేదు. దానికిని రెండు కారణములున్నవి. అందొకటి మనుష్యులు క్రమక్రమముగా హ్రస్వశరీరులగుచు వచ్చుటచేత నెందఱినిభక్షించినను నొక్క ముద్దయినను చాలకపోవుట. రెండవది విభీషణుఁడు లంకాధిపత్యము వహించి రాక్షసరాజయిన

తరువాత శ్రీరాములవారి మీఁదఁగల భక్తిచేత నిఁకముందు రాక్షసు లెవ్వరును మనుష్యభక్షణము చేయఁగూడదని శాసనముచేయుట. ఇప్పటికిని లంకారాజ్యమును విభీషణుఁడే యేలుచుండుటచేత రాజశాసనమునుబట్టి రాక్షసులు మనుష్యాశనత్వమును విడిచిపెట్టి కామరూపులైనను మనుష్యసంచారముగల దేశములకు బోవుట బొత్తిగా మానుకొన్నారు. నామాటయొక్క సత్యమును సిద్ధాంతపఱచుటకయి మన దేశమునకిప్పుడు రాక్షసులు రాకుండుటయే ప్రత్యక్షనిదర్శనముకదా? విభీషణుఁ డిప్పుడు లంకారాజ్యము చేయుచున్నాఁడన్న మాట విన్నప్పుడు "త్రేతాయుగమునందు రాముని పరిజనుఁడైన విభీషణుని కాల మెక్కడ? ఈకలికాలమెక్కడ ? అతఁడిప్పుడు లంకనేలుచుండుట యెక్కడ?'' అని తెలియనివారు సందేహపడుదురేమో! తెలియనివారు తమ మనస్సులలో నేమనుకొన్నను తెలిసినవారు మాత్రము విభీషణుఁడు చిరకాలజీవులలో నగ్రగణ్యుఁడని పురాణములవలన నెఱిఁగియుండుటచేత నేను చూచివచ్చి చెప్పిన యీసంగతిని గూర్చి యణుమాత్రమును సందేహపడరు. ఈవిభీషణుఁడు రాజుగాయున్న హేతువునుబట్టియే లంకాద్వీపము సింహళము కాదని వెనుకటి ప్రకరణమునందు వ్యాఖ్యానము చేసియున్నప్రకారముగా నేనిప్పుడు సిద్ధాంతము చేయఁబోవుచున్నాను. పట్టాభిషేక కాలమందు శ్రీరాములవారే యాచంద్రతారార్కముగా లంకనేలుమని విభీషణునితో నానతిచ్చినందున, ఇప్పుడింగ్లీషువారేలుచున్న సింహళద్వీప మెప్పుడును లంకాద్వీపము కాఁజాలదు. అంతే కాక యీరెండు ద్వీపములకునుగల వైశాల్యాది భేదములనుగూడ విచారింపుఁడు. శ్రీమద్రామాయణములో వాల్మీకులవారు కిష్కింధాకాండమునలో

"కో వీరో యోజనశతం లంఘయేచ్ఛ ప్లవంగమః"

అని యేవానరవీరుఁడు లంకకు నూఱుయోజనముల సముద్రమును

దాటునని యగదుఃకడిగినట్లు చెప్పియున్నారు. శ్రీవాల్మీకులవారే యుద్ధకాండమునందు

శ్లో॥ "దశయోజనవిస్తీర్ణం శతయోజనమాయతం ।
దదృశుర్దేవగంధర్వా నలసేతుం సుదుష్కరం."

అని నలుఁడు నూఱుయోజనములపొడుగును పదియోజనముల వెడల్పునుగల సేతువును కట్టినట్లు సెలవిచ్చియున్నారు. సింహాళమే లంకయైనపక్షమున, రామేశ్వరమునకును లంకకును మధ్యనున్న సముద్రము నూఱుయోజనముల వెడల్పు గలదయియుండవలెనుగదా? నూఱుయోజనములనఁగా వేయిమైళ్ళు; వేయిమైళ్ళమాటయటుండఁగా నూఱుమైళ్ళయినను లేక రామేశ్వరమునకును సింహాళద్వీపమునకును మధ్యనున్న సముద్రము యింగ్లీషువారి లెక్కప్రకారమే ఱువదిమైళ్ళున్నది. రామేశ్వరమున కఱువదిమైళ్ళదూరములోనుండి మిక్కిలి నిడుపైనచోట ౨౭౦ మైళ్ళును, మిక్కిలి వెడల్పయినచోట ౧౪౦ మైళ్ళునుగల చిన్న సింహాళద్వీప మెన్నఁడయిన లంకాద్వీపము కానేర్చునా? సింహాళమునకును రామేశ్వరమునకును నడుమనున్న యిసుకతిన్నె లే సేతువయినపక్షమున, పూర్వ మాంజనేయాదివానరవీరులు హిమవత్పర్వతాదులనుండి విఱిచి తెచ్చి పడవేసిన పర్వత శిఖరములన్నియు నేమయిపోయినవి? సింహాళమే లంకయైన పక్షమున, అందు మహాసత్త్వులయిన రాక్షస సత్త్వములుండక దుర్బలులైన యఱవవాండ్రును సింగాలీవాండ్రును కాపురమేలయుందురు? కాఁబట్టి యిట్టిహేతువులను చక్కఁగా పరిశీలించి హూణులు వ్రాసిన గ్రంథములను విశ్వసింపక, సింహాళద్వీపము లంక కాదనియు నేనిప్పుడుపోయి చూచినదియే రావణలంకయనియు మీరు దృఢముగా నమ్ముఁడు.

మనమిఁక భూగోళశాస్త్ర ప్రసంగమును కొంచెము సేపు చాలించి ప్రస్తుతకార్యాంశమునకు వత్తము. నాకొత్తయజమానునిపే

రు మహాకాయుఁడు. ఆనామధేయముచేతనే యతఁడు రాజబంధువుఁడయినట్లు మీరూహింపవచ్చును. అతఁడు నాయందు పుత్రవాత్సల్యము కలవాఁడయి నాయన్నపానాదులను గూర్చి ప్రతిదినమును తానే విచారించుచు, మూషికమార్జాలాదిజంతువులవలన నాకేవిధమయిన యపాయమును గలుగకుండ రక్షించుచుండుటకయి యెనిమిదేండ్ల ప్రాయముగల తనపుత్రికకు నన్నొప్పగించెను. మూషికమార్జాలాదులవలన మనుష్యునకు భయమేమియు నీరనుకొనఁగూడదు. అక్కడియెలుకలు మనదేశపు కుక్కలంతలేసియుండును. ఇఁక పిల్లులన్ననో మన గోవులకంటె కొంచెము పెద్దవి. కాఁబట్టి యిట్టి పెద్దజంతువులవలన నావంటి యల్పశరీరికపాయము సంభవించుట యేమియాశ్చర్యము? నేనక్కడకుపోయిన మూఁడవనాఁడే నాకొక్క గొప్పగండము తప్పిపోయినది. మీరాకథవిన్నచో నాసమయోచిత బుద్ధికిని నిరుపమానధైర్య సాహసములకును మహాశ్చర్యరసమగ్నమానసులు కాకమానరు. నేనిప్పుడు పేర్కొన్న చిన్నదాని వేడుకకొఱకయి యింటివారు రెండు కంచిమేఁకలను పెంచినారు. అందొకటి వారముదినములక్రిందట రెండుపిల్లలను పెట్టినది. దానినొకటితల్లి పాలుత్రాగియాటలకయి చెంగుచెంగున గంతులువేయుచు నేను నిలుచున్న వైపునకు పరుగెత్తుకొనిరా మొదలుపెట్టెను. అటువంటి మహాజంతువు మృత్యుదేవతవలె నామీఁదికి పరుగెత్తుకొనివచ్చుచున్నప్పుడు బ్రాహ్మణుఁడ నయ్యును నేనణుమాత్రమును జంకక వెనుకంజవేయక, వ్యాఘ్రములు మొదలయిన క్రూరజంతువులు సహితము ప్రతిఘటించినిలువఁబడిన వారిమీఁదికివచ్చుటకుభయపడునని వేఁటకాండ్రవలన మనదేశమునందు విన్నమాటనుబట్టి వీరభటునివలె ధైర్యముతో దానికెదురుగా నిలువఁబడితిని. అయినను మనదేశపు పులులకంటెను నధికసాహసము గలదయి యామేకపిల్ల నాశూరగుణమును ప్రత్యక్షముగాఁజూచియు వెఱచి వెనుకదీయక తలవంచుకొని నా

మీఁది కొక్కదుముకు దుమికెను. నేనప్పుడు సమయోచితబుద్ధిగల వాఁడనయి ప్రక్కకు తొలఁగి తప్పించుకొని యమపాశములవంటి నా బాహుపాశములను దానిమెడకు తగిలించియుండనిపక్షమున, వజ్రాయుధములవంటి దానిముందటికాళ్ళగిట్టలు రెండును నాఱొమ్మును, దఁబడి ప్రాణాపాయము చేయలేక పోయినను బలమయినగాయమునైనఁ జేసియుండును. అది మెడపట్టు వదల్చుకొనవలెనని పెనఁగులాడఁగా, పట్టువదలినపక్షమున నన్నుఁ దీకాళ్ళక్రిందనలగద్రొక్కునని నేను భల్లూకపుపట్టుపట్టి వదలకపోఁగా, అంతటనాయిరువురకును భారతయోధులకువలె ఘోరమయిన ద్వంద్వయుద్ధమారంభమయినది. బాహాబాహిని దంతాదంతిని నఖానఖిని నేను జేసిన యామహాయుద్ధములో నేనక్షతశరీరుఁడనయి నాశత్రువును రెండుమూఁడుచోట్ల గాయపఱచి విజయోన్ముఖుఁడనయి యుండఁగా, ఆమేఁకపిల్ల ప్రాణరక్షణార్థమయి కడపటిప్రయత్నముచేసి పర్వతగుహాలు మాఱు మ్రోయునట్లు మహాప్రమని యొక్కసింహనాదముచేసి తనబలమంతను జూపి నన్ను బీరపాను మొదటికీడ్చెను. నాబలశౌర్యము లేమనిచెప్పను! అంతచేసినను నా పట్టు నేను విడువలేదు. అది రాక్షసభూమి యగుటచేత దేవతలు రా వెఱచిరిగాని. ఆరణరంగమే మనపుణ్యభూమియైనపక్షమున నాశౌర్యవీర్యధైర్యములకు నామీఁద తప్పక దివినుండి సురలు విరులవాన కురిసి యుందురు. నాశౌర్యకీర్తులను విద్యాధరకాంతలు దిగంతములయందు తమ నూతనగీతములతో గానముచేసియున్న పక్షమున, బ్రాహ్మణులు రణభీరువులని లోకములో నీవఱ కక్రమముగా వ్యాపించియున్న యపవాద మొక్కనిమిషములో పటాపంచలయి పోయియుండును. అయినను నాకంటెముందు భారతయుద్ధమునందు ద్రోణకృపాశ్వత్థామాది బ్రాహ్మణోత్తములుచూపిన శౌర్యమువలననే యీ యపనింద కొంతవఱకు తొలఁగిపోయినది. ఆసంగతి యటుండ

నిండు. ఇట్లు యోధానుయోధుల మయి మేమిరువురమును బీరపా దుమొదలు చేరునప్పటికి మా కాలు నేలమీఁదనిలువక జారఁగా పట్టు వదలి మే ముభయపీరులమును చుట్టచుట్టుకొని క్రొత్తగా సేవకులు నీరుపోయుటచే మహార్ణవమువలె నిండియున్న యాపాఁపులోఁ బడితి మి. దైవికముగా నింతలో లోపలినుండి నాయజమానునికూఁతు రే దోపనిమీఁద మాయుద్ధభూమికి వచ్చి మమ్ముద్దఱను వయికిఁదీసి విడి పించెను. ఈశ్వరానుగ్రహమువలన నాకిప్పుడు స్థలగండ మొకటియు జలగండ మొకటియు రెండు గండములు తొలఁగిపోయినవి. "మనిషి కాటుకు మందు లేదు." అని మన దేశమునందు పామరు లూరక ప లుకుదురు గాని నేను దయాగుణప్రధానులగు బ్రాహ్మణకోటిలోఁ జేరినవాఁడనగుటచేతనో మఱి యేహేతువుచేతనో నా కాల్లాఘాగశిశు వున కేవిధమయిన యపాయమును జేయలేదు; తుదకు దానిచర్మము నైనను ఛేదించలేదు. ఘాగశాబక బ్రాహ్మణకుమారసమరోపాఖ్యానం బను నీపుణ్యకథను విన్నవారును భక్తితోఁ జదివినవారును స్థల జలగండములనుండి విముక్తులయి సర్వకార్యములయందును విజ యము నొందుదురు. దీనికి సందేహించినవా రథోగతులగుదురు. ఈప్రథమయుద్ధ మయినతరువాత నొకనాఁడు నాయీచతుష్పాద శత్రువు మరల నామీఁదికి రాఁజూచినదిగాని, నేను ముందుగానే జా గరూకతపడి పూర్వానుభవమువలన ద్వంద్వయుద్ధముమాని దూరము నుండియే శిలాయుద్ధముచేసి దానిని తఱిమివేసి శత్రువిజయము పొం దినాను. ఇటువంటి యపాయములు మరలమరల వచ్చుచుండునని భయపడి యాచిన్నది తనతండ్రిగారితోఁ జెప్పి తనబొమ్మరింట నొక మూలను చిలుకపంజరము నొకదానిని బెట్టించి నాకు నిరపాయమ యినగది నమర్చుటయేకాక, ఒకగిన్నెలో నీరుపోసి నన్నందుఁ బడవే సి మునిగిపోకుండ తనచేతులతోఁ బట్టుకొని దినమునకు రెండేసి మా

ఱులుచొప్పున నా కీతనేర్పి కొన్ని దినములలో జలమునకు భయపడ వలసిన యావశ్యకము లేకుండఁ జేసెను. ఇట్లు సుఖోపాయములు చేసి నాప్రాణరక్షణము చేసిన పుణ్యాత్మురాలయిన యాబాలిక పేరు మండోదరి. ఆదేశమునందు నడచిన నాయద్భుతచర్య లిట్టి వసంతములు గలవుగాని, నేనే వాని నన్నిటిని బ్రశంసింపఁ బూనినచో నాత్మస్తుతి గానుండునని యావర్ణన మిందు మానివేయుచున్నాను. దివ్యజ్ఞాన మాననీయులయిన మహాత్ము లెవ్వరైనఁ బసిపూస యీయమానుషచర్యలు నశింపనీక లోకోపకారార్థముగా మహోపాయువులో ముద్రితమయియున్న లిపిని జూచి ప్రచురింతురుగాక !

మందోదరియొద్ద నొక నాఁటిప్రాతఃకాలమున నే నొంటిగాఁ గూరుచుండి మనదేశవిశేషములనుగూర్చి ముచ్చటించుచుండఁగా లోపలినుండి యొకక్రొత్తపురుషుఁడు వచ్చి నన్ను "సత్యా!" అని పిలిచి పలుకరించెను. సత్యరాజాచార్యులని నాపేరంతయు నుచ్చరించుట కష్టముగా నున్నందున, ఇంటివారు నన్ను సత్యుఁడన్న సంగ్రహనామముతో పిలుచుచుండిరి. నామొగమెన్నఁడును జూడని యీక్రొత్తవాఁడు నాపేరెట్లెఱుఁగఁ గలిగెనని నాలో నే నాశ్చర్యపడుచు మాఱుమాటచెప్పక తెల్లపోయి చూచుచుండఁగా, ఆపురుషుఁడంతలో తన రూపమును మార్చి నాయజమానుఁడయిన మహాకాయుఁడయి "యిప్పుడయిన నన్నెఱుఁగుదువా?" అని మరల నడిగెను. ఇదియేమో యింద్రజాలమయి యుండునని నాయద్భుతమప్పుడు మఱింత యెక్కువ కాఁగా నానోటినుండి బొత్తిగానే మాటవచ్చినదికాదు. వినోదమునకొఱకు కామరూపమును జూపిన నన్నుఁజూచి యిట్లేల యింత యాశ్చర్యపడుచున్నావని నాయజమానుఁ డడుగఁగా నేనప్పుడు మన పురాణములలోని రాక్షసమాయలును కామరూపములును స్మరణకుఁ దెచ్చుకొని, పూర్వము మారీచుఁడు మాయలేడి యగుటయు

వాతాపి మేకయగుటయు శూర్పణఖ మనుష్యస్త్రీ యగుటయుఁ దలఁచుకొని మనస్సు సమాధాన పఱుచుకొని, ఇప్పుడు తెలిసినదని గద్గదస్వరముతో నుత్తరము చెప్పితినిగాని నామాట యాతనికి వినఁబడినదికాదు. ఆదేశమునందు మాసంభాషణములో నాకొక్క పెద్ద కష్టమువచ్చినది. నేనెంత బిగ్గరగా నఱచినను వారిరాకాసిచెవులకు నామాటలు గుసగుసలకంటె నెక్కువ స్పష్టముగా వినఁబడకుండెను. వారెంతమెల్లగా నేకాంతమాడినను వారి మాటలు నాసూక్ష్మ శ్రవణములకు పిడుగులవలె కఠోరములుగా వినఁబడుచుండెను అందుచేత నచ్చటి నిరంతరశబ్దములచేత నాచెవులు చెవుడుపడకుండ నేను కర్ణరంధ్రములలో గుడ్డలు కుక్కుకొనవలసివచ్చినది. వారు నాతో మాటాడవలసినప్పుడెల్ల నన్ను చేతులలోఁ బయికెత్తి చెవుల చెంతఁ బెట్టుకొని గట్టిగా మాటాడుమనుచుండిరి. దీనినిబట్టి మనుష్యులమైన మన కున్న శ్రవణేంద్రియపటుత్వమును సూక్ష్మశబ్దగ్రహణశక్తియు రాక్షసులకు లేవనుట స్పష్టమేకదా! అయినను మనకంటె వారియొద్ద కామరూప మొకటి విశేషముగా నున్నది. సర్వసముఁడగున యీశ్వరుఁ డొక్కొక్కసృష్టి యం దొక్కొక్క విశేషమును బెట్టుచుండును. కామరూపు లగుటచేత రాక్షసులు తామేరూపమును పొందఁగోరినను సంకల్పమాత్రమునఁ దా నారూపము ననాయాసముగా పొందఁగలుగుదురు. అయినను వారు సూక్ష్మరూపములను ధరింపఁ గోరినప్పుడు చీమలవలెను దోమలవలెను కాఁజాలురేగాని నావంటి సూక్ష్మమనుష్య రూపమును ధరింపవలెనన్న యూహ యీవఱకెన్నఁడును వారిలో నెవ్వరికిని కలుగలేదు. అందుచేతనే నారూపమును జూచుటచేత నాదేశమునం దెల్లవారికిని నత్యాశ్చర్యము కలిగెను.

ఆదినము నాయజమానుఁడు మనస్సులో మిక్కిలి యుల్లాసముగా నున్నందున నానావిషయములనుగూర్చి నాతో సల్లాపించుచు తన పెద్దల ప్రసంగము తెచ్చెను. అప్పుడు నేనందుకొని పూర్వచరిత్రమును తెలిసికొన వలెనన్న యభిలాషతో రామాయణమునందు వర్ణింపఁబడిన రావణుని మంత్రియైన మహాకాయుఁడు మీకేమికావలెనని యడిగితిని. అతఁడు పయివంకఁజూచి వ్రేళ్ళుమడిచి లెక్కవేసి యాతఁడు తన వంశమునకు మూలపురుషుఁడగుటయు, తానాతనికి పండ్రెండవ పురుషుఁడగుటయు, చెప్పి వెచ్చనూర్చెను. నేనును వ్రేళ్ళు మడిచి యుగప్రమాణమునుబట్టి రామరావణ యుద్ధము జరిగిన త్రేతాయుగమునుండి లెక్కవేసి, ద్వాపరయుగ ప్రమాణ సౌర సంవత్సరములు ౮౬౪౦౦౦ లతోను కలియుగమునం దిప్పటికి భుక్తమయిన ౪౯౮౭ సంవత్సరములను జేర్చి ౮౬౮౯౮౭ మొత్తము తేల్చి, దానిని పండ్రెంటిచేత భాగించి యొక్కొక్క తరమువారి జీవితకాలము ౭౨౪౧౫ సంవత్సరముల రెండుమాసములని రాక్షసుల యాయుఃప్రమాణమును నిర్ణయముచేసి, మీరు వెచ్చనూర్చిన కారణమేమని నాయజమాను నడిగితిని.

మహాకాయుఁడు—మా పెద్దలస్థితిని దలఁచుకొని యిప్పటివారి యల్పాయుష్కతయు నల్పశక్తియు నల్పకాయత్వమును విచారింపఁగా దేశాభిమానము గలవారి మనస్సులో దుఃఖమెట్లు కలుగకుండును?

సత్య—మీమాటలు నాకు వింతగానున్నవి.

మహా—ఏమివింత? మాపూర్వుఁ డొకఁడు భూమిని చాపగా చుట్టి చంకక్రింద పెట్టుకొని పరుగెత్తెనుగదా! ఆతని శక్తియుండదటు నిప్పటివారిశక్తియెంత ? ఏదీ యిప్పుడొక్కరిని భూమిని కాదుగదా, యీద్వీపమును చాపగాచుట్టుమను చూతము. పూర్వమొక మహాపురుషుఁడు సముద్రము మోకాలిబంటిగా తిరుగుచుండఁగానాతని మేద

స్సుతోఁగదా యీభూమిచేయఁబడినది ! ఇప్పుడు భూమండలమంత కాదుగదా శిరస్సులో మాద్వీపమంత మెదడున్నవాని నొక్కని చూపుము. జనులంతకంత కల్పకాయులగుచున్నందున కీయొక్క పిదర్శనము చాలదా ? అల్పకాయులు నల్పశక్తులు నగుటచేతనే మావారంతకంత కల్పాయుష్కులుకూడ నగుచున్నారు.

సత్య—త్రేతాయుగమునుండి నేఁటివఱ కొక్క పురుషుఁడే మీలంకను రాజ్యము చేయుచుండఁగా మీవారల్పాయుష్కు లనెద రేమి ?

మహా—చిరకాలజీవి గనుక విభీషణుఁ డొక్కఁడు మాత్ర మింతకాలము రాజ్యము చేసినాఁడు. అప్పుడే రెండు యుగములలో నాతని రాజ్యకాలములోనే పండ్రెండు తరములు చెల్లిపోయినవి. ఆతని కిప్పుడు పండ్రెండవతరమువారు మంత్రులయినారు. తానొక్కఁడు బ్రతికియున్నను భార్యాపుత్రాదులు మృతులగుటచేతనే కదా విరక్తుఁడయి విభీషణుఁ డిప్పుడు రాజ్యము మంత్రులకొప్పగించి సువేలాద్రియందు తపస్సుచేయుచున్నాఁడు ! ఇట్టిదుష్కాలమును జూచి నేనెట్లు చింతిల్లకుందును ?

సత్య—ఓమహాకాయా ! మాదేశస్థితిని దలఁచుకొనఁగా మీకు కలుగుచున్న విచారమే నాకును కలుగుచున్నది. మావారంతకంత కల్పాయుష్కు లగుచున్నారు. పూర్వము దశరథుఁ డఱువదివేలయేండ్లు రాజ్యము చేసినాఁడు. ఇప్పుడాఱునూఱేండ్లు బ్రతికినవాఁ డయినను లేఁడు. అగస్త్యుఁడు సముద్రోదకమునంతను పానముచేసెను. ఇప్పుడొక్క చెఱువెడు నీళ్ళు త్రాగువాఁడయినను లేఁడు.

మహా—పూర్వము మీవా రంతటి స్థూలకాయులుగానుండి నందుననే మాపెద్దలు మనుష్యాశనులయి కడుపునిండ తృప్తిగా భోజనము చేయుచుండెడివారు. నిన్నుఁబట్టిచూడఁగా మీమనుష్యులిప్పుడు

మాంసార్థ ముద్దకయినను చాలనట్లు కనఁబడుచున్నారు. అయినను పూర్వాచారము విడిచిపెట్టరాదు. శిష్టాచారమును మీఱుటకంటె లోకములో పాపము మఱియొకటి లేదు. కలిమహిమచేత చండశాసనుఁడైన మావిభీషణమహారాజు మనుష్యభక్షణము నిషేధించి పాపము కట్టుకొన్నాఁడు గాని రాక్షసుల కులధర్మమయిన మనుష్యాశనతను మాన్పించి శిష్టాచారము చెడఁగొట్టుట నీతి కాదు. నేనీసంగతి శిష్టాచారము మీఱరాదని చెప్పుచున్నానుగాని యల్పాంగులయిన మనుష్యకీటకములను తినుటచేత మాకడుపులు నిండునని చెప్పుచుండ లేదు.

ఓ భరతఖండ నివాసులారా! ఈతఁడు విభీషణునిపరిపాలనలో నున్నను మనస్సులో తన రాక్షసస్వభావము నెట్లు విడువకున్నాఁడో చూచినారా? నే నధికముగా మాటాడినచో నాపాపాత్ముఁడు నన్నుకూడ నోర వేసుకొనునోయన్న భీతిచేత మఱేమియు మాటాడక, జీవహింసయు నందులో నరవధయు నంతకంటెను ముఖ్యముగా బ్రహ్మహత్యయు పాపములని చెప్పవలెనని నాలుక చివరకు వచ్చినను బలవంతముగా నాపుకొని యూరకున్నాను. ఇప్పుడు లంకలోఁగూడ రాజభక్తు లనఁబడెడు విభీషణ పక్షమువారైన నవనాగరికులు కొందఱు బయలుదేరుచున్నను, మహాకాయుఁడు పూర్వాచార పరాయణులయిన శిష్టాగ్రగణ్యులలోనివాఁడు. ఈకథ సాగినకొలఁదిని లంకలోనున్న యిరుతెగలవారి చరిత్రములును గొంతకొంత వచ్చును గనుక ప్రస్తుత మావిషయమును విడిచిపెట్టుచున్నాను.

మూఁడవ ప్రకరణము.

కొందఱక్కడక్కడ శాస్త్రవిశ్వాసములేని నాస్తికవాదు లిప్పు డిప్పుడుద్భవిల్లు చున్నను మనదేశమునందువలెనే లంకాద్వీపమునం దును సాధారణముగా జనులు శాస్త్రబద్ధులయి పూర్వాచారపరా యణులయిన శిష్టులుగానే యున్నారు. అందులోను వారికి పరమ ప్రా మాణికమయిన జ్యోతిషశాస్త్రమునందు విశ్వాస మత్యధికము. ఒక్క జ్యోతిశ్శాస్త్రమే లేక యుండిన యెడల, ఆదేశమునం దేవ్యవహారమునం దును సత్యము గనుఁగొనుటయే దుర్లభముగానుండి యుండును. అ క్కడి జనులందఱును కామరూపులగుటనుబట్టి తమ తమ యిచ్ఛవచ్చి న రూపములను ధరించి చౌర్యము మొదలగున నేరములను జేయ స మర్థులగుటచేత సాక్షులను విమర్శించి వారినిదండించుట సాధ్యము కాదు. వృశ్చికరోముఁడు సర్పరోమునిరూపమును ధరించి వచ్చి దొం గతనము చేసినప్పుడును, సర్పరోముఁడు వృశ్చికరోమునిరూపమును ధరించి వచ్చి వాని భార్యతో వ్యభిచరించినప్పుడును, దీర్ఘనాసుఁడు హ్రస్వనాసుని రూపము ధరించివచ్చి హత్యచేసినప్పుడును, హ్రస్వ నాసుఁడు దీర్ఘనాసుని రూపమునుధరించివచ్చి యొరునియింటికి నిప్పం టించినప్పుడును, చూచిన వారిని పరీక్షచేసి యపరాధులను శిక్షింపఁ బూనినచో దోషులు తప్పించుకొనిపోవుటయు నిష్కారణముగా నిర్దో షులకు శిక్షలగుటయు తటస్థించునుగదా! కాఁబట్టియే యక్కడివారు నేరములను విమర్శించుటకయి సాక్ష్యమును మానివేసి న్యాయసభల లో నెల్ల సత్యమును గనుఁగొనుటకై యయిదుగురేసి చొప్పున జ్యోతి షపండితులను బెట్టి యున్నారు. వారు సత్యమును గనిపెట్టుటలో తఱు చుగా భిన్నాభిప్రాయులుగా నున్నను వారిలో నధికసంఖ్యాకుల య భిప్రాయము ననుసరించి ధర్మాధికారి దోషులకు దండనము విధించు

చుండును. అక్కడి వారికి దివ్యజ్ఞానముమాత్రము లేదు. భగవంతుఁడు వారికి దివ్యజ్ఞాన మనుగ్రహించకపోయినందుకు కారణము లేకపోలేదు. కామరూపమును ప్రసాదించిన దేశమునందు దివ్యజ్ఞానమునుగూడ ప్రసాదించినపక్షమున, దివ్యజ్ఞానముచేత మాయ బట్టబయలయి కామరూపములవలని ప్రయోజనమే లేకపోవునని యెంచియే యపరిమిత బుద్ధిమంతుఁడయిన యీశ్వరుఁడు వారికి లోకోపకారార్థముగా దివ్యజ్ఞానము లేకుండఁ జేసినాఁడు. వారికంతకాలమునుండి కామరూపమును వహించు శక్తియున్నను వారేదైన సూక్ష్మరూపమును బొందవలెనన్న బుద్ధిపుట్టినప్పుడు చీమగానో దోమగానో నల్లిగానో బల్లిగానో మాఱుచుండుటయే కాని నావంటి యంగుష్ఠమాత్రశరీరముగల పురుషుఁడు కావలెనన్న బుద్ధి నేటివఱకును వారిలో నొక్కనికి నుదయించకపోవుటచేత నారూపముచూడఁగానే యెల్లవారికి నద్భుతమును గౌరవమును గలిగెనని చెప్పితినిగదా! నన్నుశోధించిచూచి వాలఖిల్యమహర్షినిగా నిశ్చయించిన పౌరాణికులును జ్యోతిశ్శాస్త్రవేత్తలు నారాకను గ్రామమునం దంతటను ప్రకటించినందున జనులు తీర్థప్రజవలె వచ్చి నన్నుదర్శించిపోవ మొదలుపెట్టిరి. అక్కడి వారు నాస్తికులుగాక యవతారములను మహామహిమలను నమ్మెడు ప్రమాణబుద్ధిగల భక్తిపరులగుటచే జేసి నన్ను దర్శింపవచ్చువారందఱును నాయందు భక్తిగలవారయి ఫలములను కానుకలను దెచ్చుచు వచ్చుటచేత మాయింట ప్రతిదినమును ఫలరాసులు పర్వతోపమానములగుచు వచ్చెను. నా యజమానుఁడు వానినన్నిటి నంగడికిఁబంపి యమ్మించుచు వచ్చుటచేత తద్విక్రయము కొంతవఱకాతనికిని లాభకరముగానే యుండెను. నా మూలమున తనయప్పులుకూడ తీఱుమార్గ మేర్పడినందున నాయజమానుఁడు తనహృదయములో సంతోషించి కొంతకాలమయిన తరువాత దక్షిణలుకూడ నేర్పఱచి యాత్రాపరులను ప్రోత్సాహపఱచు

చు వచ్చెను. ఈప్రకారముగా నే నాదేశమునం దల్పకాలములోనే చిఱుదేవతనయిపోయినాను. నామహిమలు శీఘ్రకాలములోనే చుట్టుపట్లగ్రామములలోను దూరదేశములోనుకూడ వ్యాపించినందున యాత్రాపరులు రేయింబగళ్ళు విరామములేక దూరదేశములనుండి సహితము మహోపహారములను సువర్ణమంత్రపుష్పములను ధరించి యిసుకచల్లినఁ రాలకుండునట్లు తీర్థప్రజలవలె రాఁదొడఁగిరి. నేను జంగమదేవతను గాఁగానే నాయజమానుఁడు తన మందిరమునందుఁగల యొక విశాలమయినగదిని దేవాలయమునుగామార్చి యొకమూలఁ బీఠమమర్చి మూలవిగ్రహమువలె నందు నన్నెత్తుగాఁ గూరుచుండఁబెట్టి జనులు తెచ్చుకానుకలు మొదలయినవానిని గ్రహించుటకయి నాపై నొకయర్చకుని నేర్పఱిచి తాను ధర్మకర్తయయి వచ్చిన ధనమునంతను యథేచ్ఛముగా తననిమిత్త ముపయోగించుకొనుచుండెను. నాయందు జనుల కింతపూజ్యతాబుద్ధి కలిగినందున కింకొక కారణము చెప్ప మఱచిపోయినాను. మన్నించి వినుఁడు. నేనక్కడకుఁ బోయిన నాలవనాఁ డొకవృద్ధకాంత నావద్దకు వచ్చి, వాలఖిల్యాది మహర్షులకు దివ్యజ్ఞానమును మహిమలును గలవని పురాణశ్రవణాదులవలనఁ దెలిసికొన్నదగుటచేత భక్తిపూర్వకముగా నాకు నమస్కరించి, ప్రసవవేదనపడుచున్న తన కోడలికి కొడుకుపుట్టునో కూఁతురుపుట్టునో చెప్పవలసినదని ప్రార్థించెను.

ఆమె ప్రశ్నయడిగిన కాలమునందులగ్నమురవి గురుచంద్రులు విషమరాశి నవాంశములయందుండుటచేత.

శ్లో. ఓజర్క్షే పురుషాంశకేషు బలిభిర్లగ్నార్క గుర్వీందుభిః
పుంజన్మప్రవదేత్సమాంశకగతైర్యుగ్మేషు తైర్యోషితః
గుర్వర్కౌవిషమేనరం శశిసితౌ వక్రశ్చయుగ్మేస్త్రియం
ద్వ్యంగస్థా బుధవీక్షణాచ్చయమళౌ కుర్వంతి పక్షేస్వకే.

అను బృహజ్జాతకవచనమునుబట్టి కుమారుఁడు కలుగునని చెప్పినాను. శాస్త్రము లెప్పుడు నబద్ధములు కావు గనుక వృద్ధాంగన యింటికిఁబోయిన జాములోపల కోడలికి నేను జెప్పినట్లు పురుషశిశువు కలిగెను. అక్కడి జ్యోతిష్కులు మాత్రము లెక్క వేసి తమ శాస్త్రప్రకారముగాం తప్పక స్త్రీశిశువు కలుగునని చెప్పిరఁట! చూచినారా? వారి శాస్త్రములకంటె మనశాస్త్రములయం దెంత యాధిక్యమున్నదో! ఆవృద్ధాంగన నేను జెప్పిన సంగతి జ్యోతిష్కులకుఁ జెప్పఁగానే వారందఱు నావద్దకు మహాకోపముతో పరుగెత్తుకొని వచ్చి నీవేశాస్త్రప్రకారముగా కొడుకుపుట్టునని చెప్పినావో చెప్పుమని పట్టుకొనిరి; వారిశాస్త్రములకు విరుద్ధముగానున్న మన శాస్త్రప్రమాణమును జెప్పిన స్వదేశాభిమానముచేత శాస్త్రబద్ధులయినవారు నాకేమి హాని చేయుదురోయని జడిసి యసత్యము పలుకుట కిష్టములేనివాఁడయి వారిప్రశ్నల కుత్తరము చెప్పక మౌనముధరించి యూరకుంటిని. అందుచేత వారు నే నాఫలములను జ్యోతిశ్శాస్త్రముచేతఁ గాక మునులకుఁగల యాంతరదృష్టిచేతనే చెప్పితినని తమలోఁ దాము సిద్ధాంతము చేసికొని యాసిద్ధాంతులు గ్రామములో నాదివ్యజ్ఞానమునుగూర్చి గొప్పవారితో నెల్లఁ బ్రశంసించిరి. అందుమీఁదనన్ను ప్రశ్నలడుగుటకయి గొప్పవారందఱును రా మొదలుపెట్టిరి బుద్ధిమంతుఁడనుగనుక నాలోనే నాలోచించుకొని జ్యోతిషభూమియైన యాదేశములో నేమియుత్తరము చెప్పిన జ్యోతిష్కులవలన నేమి చిక్కువచ్చునోయని భయపడి యేమియు నుత్తరము చెప్పక యెవ్వ రేప్రశ్న వేసినను తలయూఁచి యూరకుండుచు వచ్చితిని. తరువాత నావద్దఁజేరిన జ్యోతిష్కులు తమ శాస్త్రములనుబట్టి నాశిరఃకంపమున కర్థముచేసి యడిగిన ప్రశ్నల కన్నిటికి నుత్తరములు చెప్పి భక్తులను సమాధానపఱిచి పంపుచువచ్చిరి.

నాయొద్ద నుంచఁబడిన యర్చకులు మన దేశములోని పూజారు

లవలేశ ధనాగమోపాయములయందు మహాబుద్ధిమంతులగుటచేత నా ప్రసాదము సర్వాభీష్టప్రదమని ప్రశ్నలడుగవచ్చిన వారికెల్లఁ జెప్పి యరఁటిపండ్లు మొదలగునవి విద్యచేత చెడిపోని యాభక్తులచేతులలోఁ బెట్టి నాకర్చనము చేయసాగిరి. ఇట్లుండఁగా నొకనాఁడు చేరువపల్లెనుండి చాకలివాఁడొకఁడువచ్చి నాకు సాష్టాంగనమస్కారము చేసి తప్పిపోయి క్రొత్తగాకొన్న తనగాడిద కనఁబడునట్లనుగ్రహించవలసినదని ప్రార్థించి దక్షిణయును పండ్లను పళ్ళెములోఁ బెట్టి యర్చకులకును సమర్పించెను. ఆయర్చకులాదక్షిణను స్వీకరించి తిన్నగాపండ్లు యరఁటిపండొకటి వానిచేతిలోఁ బెట్టి యాదేవా ప్రసాదమును దేవతాసన్నిధానమునందే పరిగ్రహించి మొక్కి పొమ్మనిరి. వానికాజ్ఞ

వాఁడాప్రకారముగా ప్రసాదము స్వీకరించి భక్షించి తన యూరికిఁ బోవుచుండఁగా త్రోవలోనే యాప్రసాదము వలనను, భక్తపరిశోధనాధర్మము వలనను వానికి పుణ్యఫలములను పుట్టించి విరేచనములవనియందు వానిని చెఱువుగట్టుమీఁదికి పరుగెత్తించి యక్కడ తృణచర్వణము చేయుచున్న వాని గాడిదను జూపెను. వాఁడు నాప్రసాదమహిమను కత్యద్భుతపడి తన గాడిదను తిన్నగా తన యింటికిఁ దోలుకొనిపోయి తన బంధువులకెల్లను జూపి నామహిమలను గాథలుగాఁ బాడెను. ఇట్లు నామహాత్మ్యములు దేశమంతటను వ్యాపించినందున, గాడిదలు, ఎద్దులు, ఆవులు మొదలగునవి తప్పిపోయినవారందఱును చుట్టుపట్ల గ్రామములనుండి ప్రసాద స్వీకారార్థమయి నాదర్శనమునకు రాఁదొడఁగిరి. ఆమఱునాఁడే యాచాకలివాని గ్రామమునుండి తనగాడిద తప్పిపోయినదని వాని చుట్టమొకఁడును, తనయెద్దు తప్పిపోయినదని కాపువాఁడొకఁడును రాఁగా, మాయర్చకులు వారివలన విధ్యుక్తములగు దక్షిణలను గ్రహించి యరఁటిపండ్ల ప్రసాదమును వారిచేతిలోఁ బెట్టి నాయెదుటనే వారిచేతఁ దినిపించి పంపివేసిరి. అయి

నను చాకలివానిగాడిదగాని, కాఁపువాని యెద్దుగాని యెవ్వరిలో వారికి కనఁబడలేదఁట! గాడిదమాత్రము మఱియెప్పుడును కనఁబడనేలేదఁట గాని తరువాత గొన్ని దినముల కెద్దు పోఁగూడి బందెలదొడ్డిలో నుండఁగా కాఁపువాఁడు బందెయిచ్చి దానిని విడదల్చి తెచ్చుకొనెనఁట! ఈ వార్త నా చెవిని బడఁగానే యొకరి విషయమున నోటనే ఫలించిన నా ప్రసాద మింకొకరివిషయములో నేల ఫలింపక పోవలెనని నాలో నేనాలోచించుకొన మొదలుపెట్టితిని. తగువారై వచ్చినవారికి నాయెడల నిజమయిన భక్తి దేమోయని సంశయించి భక్తియే లేకపోయిన యెడల వారంతదూరము శ్రమపడివచ్చి భూరిదక్షిణలు సమర్పించుట తటస్థింపదుగాన వారికార్యవైఫల్యమునకు భక్తిహీనత కారణము కాదని నిశ్చయించి యీవిషయమున వారిని నిర్దోషులనుగా నిర్ణయించినాను. భక్తిహీనత కారణము కాకపోయిన పక్షమున నా యమోఘప్రసాదము విఫలమగుట కేమి కారణమై యుండునని నాలో నేను తలపోయుచు కన్నులు మూసికొని యాత్మగతధ్యానము చేయుచుండఁగా మంత్రద్రష్టలైన మహర్షులకు వేదమంత్రములు ప్రత్యక్షమయినట్లు నాకును స్వప్నములోఁ గొన్ని యూహలు సాక్షాత్కారగము కాఁగా, శాస్త్రజన్మము యొక్క క్రమమిట్టిదేకదా యని తెలిసికొని తోడనే నే నొకయభినవశాస్త్రనిర్మాణమున కారంభించినాను. మేలుకొన్నప్పుడును నిద్రపోవుచున్నప్పుడు స్వప్నరూపమున నీశ్వరాదేశముచేత సృష్టి చేసినయూహలను బట్టియు నాయనుదిన ప్రత్యక్షానుభవమును బట్టియు మూఁడుమాసములలో మహత్తరమయిన ప్రసాద జ్యోతిశ్శాస్త్రము నొకదానిని సాంగోపాంగముగా సాంతముచేసితిని. ఆశాస్త్రసంగతులు విస్తరించినచో గురూపదేశము లేనివారికి గూఢముగా నుండును గనుక సంగ్రహించి పూర్వోక్తరహస్యకథనమును బట్టి మీరు గ్రహింపఁ దగిన మూలసూత్రములను ముఖ్యముగా నుదాహరించుచున్నాను:—

గీ. క్రొత్తగాఁడిదఁ బోఁగొట్టుకొన్నవాఁడు
వాలఖిల్యప్రసాదంబు పచ్చియరఁటి
పండ్లు దక్షిణ యిచ్చి సాపడియె నేని,
దొరకు గాఁడిద భంబది యింటిత్రోవలోన. ౧

గీ. గోవృషంబులఁ బోఁగొట్టుకొన్నవాఁడు
వచ్చి కదళీఫలంబుల వాలఖిల్య
సన్నిధినిబుచ్చుకొన్నఁ బక్షంబులోన
దొరకు గోవది బందెలదొడ్డిలోన. ౨

గీ. తనకుగాఁడిదఁ బోఁగొట్టుకొనినవాఁడు
వచ్చి రాహుకాలంబున భక్తితోడ
వాలఖిల్యప్రసాదంబుఁ బడసెనేని,
కంటఁబడ దెప్పుడును వానిగాడిద భంబు. 3

మూలసూత్రములు దేవభాషయందే యున్నను స్త్రీశూద్రులు వానిని పఠింప రాదని సర్వజనోపయోగార్థముగా వానినిట్లు తెనిఁగించినాను. ఈయభినవమహాశాస్త్రమునకు ప్రసాదజ్యోతిశ్శాస్త్రమన్న పేరెట్లు సార్థక మగునో మీరేయూహించి తెలిసికోవచ్చును. వాలఖిల్యప్రసాదమువలనఁ గలుగు ఫలములను దెలుపుశాస్త్రమగుటచేత ప్రసాదశాస్త్రమును, ఆయాఫలములకు జ్యోతిశ్శాస్త్ర సంబంధమునుగల్పించుటచేతఁ గొంతవఱకు జ్యోతిశ్శాస్త్రమును అయి యీపేరీయపూర్వశాస్త్రమున కన్వర్థమయినది. ప్రసాదమును స్వీకరించుకాలమునుబట్టి వారదోషములు, తిథిదోషములు, నక్షత్రదోషములు, రాహుకాలదోషములు, మొదలయిన కాలదోషములన్నియు నీయపూర్వశాస్త్రమునందు జెప్పఁబడియున్నవి. మొట్టమొదటవచ్చినచాకలివాఁడుతనగాడిద తప్పిపోయినందునకయి ప్రశ్నయడుగుటకు శుక్రవారమునాఁడు పదిగడియల ప్రొద్దెక్కి వచ్చి ప్రసాదస్వీకారము చేసినందున, నాఁడు

రాహుకాలము ౧౧ గడియల కగుటచేత వానికార్యము సఫలమయిన ది. మఱునాఁడు శనివారమునాఁడు వచ్చిన చాకలివాఁడును పదిగడియ ల ప్రొద్దెక్కియేవచ్చి ప్రసాదస్వీకారము చేసినను వాఁడు రాహుకాల ము ౭౺ గడియలకే వచ్చినందున వాని కార్యము విఫలమయినది.

"సూ॥ విధు స్సౌరి భృగుసుతజ జీవభౌమార్కాః॥ త్రిపాద త్రి ణీ వృద్ధిః॥" అను ముహూర్తదీపికా సిద్ధాంతమునుబట్టి రాహుకాల ము సోమవారము ౩౺ గడియలకును, శనివారము ౭౺ గడియలకును శుక్రవారము ౧౧। గడియలకును, బుధవారము ౧౪ గడియలకును, గురువారము ౧౮౾ గడియలకును, మంగళవారము ౨౨౺ గడియల కును, ఆదివారము ౨౬। గడియలకును, మూఁడుగడియల ముప్పావు వృద్ధి చొప్పునవచ్చుచుండును. ఈప్రసాదజ్యోతిశ్శాస్త్రములోని జ్యోతి శ్శాస్త్రమన్న యంతిమ శబ్దసారస్యమువలన, అభినవ వాలఖిల్య మహ ర్షినయిన నాసిద్ధాంతమననుసరించియే పూర్వమహర్షులును మన దేశ ములోని జాతక ముహూర్తభాగముల నేర్పఱిచిరన్న పరమరహస్య మునుగూడ బుద్ధిమంతులూహించి తెలిసికోవచ్చును. ఈప్రసాదజ్యోతి శ్శాస్త్రము బహుఫల ప్రదమయినదగుటచేత శాస్త్రవిశ్వాస మహనీ యులయిన మన దేశపు పెద్దలు దీనిని గురుముఖమున నుపదేశము నొంది భరతఖండమునందు వ్యాపింపఁజేసి యాసేతు హిమాచలమున సర్వజనులకును దాసివలని యనంతములైన ఫలములను శీఘ్రకాలము లోనే కలిగింతురనుటకు సందేహము లేదు. అయినను వాలఖిల్యమూ ర్తి ప్రస్తుతమున మన దేశమునందు లేకపోవుటయొక ప్రతిబంధము గాఁగనఁబడి దూరాలోచన లేనివారికి వాలఖిల్య ప్రసాదశాస్త్రము వ్యాపింపఁజేయుట దుస్సాధ్యమని తోఁచవచ్చును; గాని, రామకృష్ణా దుల విగ్రహములను ప్రతిగ్రామమునందును నెలకొల్పి పూజింపఁగలి గిన మహాపురుషులకు వాలఖిల్యమూర్తిని ప్రతిగ్రామమునందును ప్ర

తిష్ఠించి యనంత ఫలప్రదమయిన తత్ప్రసాదశాస్త్రమును వ్యాపింపం జేయుట పరమసాధ్యమే యని స్ఫురించక పోదు. నేను వ్రాయుటకుం దగిన యాంకులు గాని గంటములు గాని యాదేశములో లేనందున నా ప్రసాదజ్యోతిశ్శాస్త్రమున కధిక గౌరవము కలుగుటకయి నేను దాని ని నాజ్ఞాపకముగానే యుంచి మన మహాత్ములు వేదమును కాపాడినట్లు కాపాడుచున్నాను. ఆదేశమునందలి గంటములు మన గునపముల కంటె మూడురెట్లు పొడుగును రెండురెట్లు లావును గలిగియుంటచేత వాని నెత్తుటకే నాకు సాధ్యముకాదు. ఇంకనక్కడి తాటాకులన్ననో మనపెద్ద పరుపులంత లేసి వెడల్పుకలవయి వానికంటె దశగుణములు నిడివి కలవిగా నుండును.

నా ధర్మకర్తయైన మహారాయుండు ఛోకపాండు నావద్ద నియమింపంబడిన యర్చకులు నాకు మ్రొక్కుకొనువారు చెల్లించు ముడుపులు కానుకలు దక్షిణలు నిలువుదోపులు మొదలయిన వానినిగూర్చి క్రమమయిన లెక్కలుంచి వచ్చినసొమ్మంతయు ప్రతిదినమును సరిగా ధర్మకర్తకుం బాపుచున్నారో లేదో విచారించుటకయి నన్నుంచిన యాలయమునకువచ్చి నాయాదాయవ్యయములను విమర్శించి వారిసిబ్బందికుం బాపివేసి తరువాత వారు స్వామిసొమ్ము నేమయిన నపహరించుచున్నారాయని నన్నడిగెను. నేను చిఱునవ్వునవ్వి యడిగినదానికి తగిన సదుత్తరమియ్యక జ్యోతిషభూమిలోనం దనకు విశదముగాని దేమున్నదని పలికి, జ్యోతిశ్శాస్త్ర ప్రశంసచేసి మొదటిసంగతి మఱపించి మెల్లగా నతనిని శాస్త్రచర్చకుదింపితిని తిరుమల మొదలయిన దివ్యస్థలములలో భక్తులు సమర్పించు దేవుని సొమ్ములో పూజారులు మొదలయినవారు నిత్యకృత్యముగా చేసెడి కైంకర్యరహస్యములు మాకు కొట్టినపిండియగుటచేత మాకాదేవరహస్యములను తెలుపవలసిన యావశ్యకము మొదలే లేదుగదా? నేను శాస్త్రచర్చకు దింపినతరువాత మహారాయుండు జ్యోతిశ్శాస్త్రమునందు మహాభిమానమును సంపూ

ణ్ణవిశ్వాసమును గలవాఁడయ్యును, తమదేశమునందిప్పుడు గ్రహగతి యనుకూలముగా లేనందునకుఁ గొంత సంతాపపడి యిట్లు సంభాషణ నారంభించెను:—

మహా—పూర్వమునందు మా రావణమహారాజు కాలములో గ్రహములన్నియు సదా మంచి స్థలములయందుండి యెల్లవారికిని సత్ఫలములనే యిచ్చుచుండెను. ఆమహారాజుపోయి విభీషణుఁడు రాజ్యమునకు వచ్చినతరువాత గ్రహములు కొంతభయమువిడిచి యథేచ్ఛముగా సంచరించుచు తమ యిచ్చవచ్చిన ఫలములనే యిచ్చుచున్నవి. ఆయినను జ్యోతిశ్శాస్త్రమునం దఖండపాండిత్యముగల మహానుభావుల యనుగ్రహమువలన గ్రహగతులవలని ఫలాఫలములుమాత్రము మాకిప్పుడు తెలియుచున్నవి.

సత్య—గ్రహములగతి దోషములను తప్పించుకొనుటకు మీ దేశమునందు సాధనములున్నవా?

మహా—ప్రయాణకాలములందు మంచి ముహూర్తములు పెట్టించుకొని పని యారంభించుట యొక్క-సాధనముగూడ నున్నది. అంతకంటె వేఱుగనిలేదు.

సత్య—ఈదేశస్థులు ప్రయాణాది సమస్తకార్యములయందును మంచి ముహూర్తములు పెట్టించుకొని శుభలగ్నమునందే కార్యారంభము చేయుచున్నారా?

మహా—సాధ్యమయినంతవఱకు చేయుచునే యున్నారు. మఱి మీ దేశమందో?

సత్య—మా దేశమునందును జనులు శాస్త్రబద్ధులయి నడుచుకొనుచున్నారు కాని—

మహా—ఏమి "కాని" యనుచున్నావు. మీవారు శాస్త్రవి

శ్వాసము లేనివారయి కొందఱు విహితధర్మములను మీఱి నడుచుచున్నారా ?

సత్య—మావా రెప్పుడును బుద్ధిపూర్వకముగా శాస్త్రమర్యాదలను మీఱువారుకారు. అయినను మాదేశమునం దిప్పుడు ప్రభుత్వముచేయుచున్న హూణులు క్రొత్తగా నావిరియంత్రములను కల్పించి, నీటియావిరియొక్క బలముచేత నినుపదారులమీఁద తిథి వార నక్షత్రహోరానియమమును పాటింపక నిర్ణీత సమయములయందు ప్రతిదినమును పొగబండ్లను వాయువేగమున నడిపించుచు జనులశాస్త్రచోదితాచారములకు భంగము చేయుచున్నారు. అందుచేత జనులిప్పుడు శాస్త్రమర్యాదల నంతగా పాటింపక ప్రయాణసౌలభ్యమును బట్టి పొగబండ్లలో నెక్కి జ్యోతిష్కులు పెట్టినముహూర్తములను మాని జాతివా రేర్పఱిచిన వేళలలోనే యాత్రలుచేయ మొదలుపెట్టినారు.

మహా—ప్రయాణసౌలభ్యమును బట్టి శాస్త్రవిధుల నతిక్రమించుట మహాదోషము. అందులోను జ్యోతిశ్శాస్త్రసిద్ధాంతములను మీఱిన పాపమును మించిన మహాపాతకము లోకములో మఱియొకటి యుండదు. మఱియేపాపమునకైనను నిష్కృతికలదుగాని యీపాపమునకు నిష్కృతిలేదు. దేశాభిమానులందఱును జేరి పొగబండ్లలో పోయినవారిని జాతినుండి బహిష్కారము చేసెదమని దోషజ్ఞసమయము చేయరాదా ?

సత్య—శిష్టాచార సంపన్నులయిన శ్రోత్రియశిఖామణు లనేకులు పొగబండ్లలో ప్రయాణము చేయుట పాపమని బోధించినారుగాని జనుల యనాదరమువలనను ధర్మసంస్థాపకులయిన ప్రభువులు లేని లోపమువలనను వారి యుపదేశములన్నియు నరణ్యరోదనములయిపోయినవి. ప్రయాణములకు ముహూర్తములు పెట్టించువారు

లేక విధివిహితమయిన తమ వృత్తికే భంగమురా నారంభించినందున జ్యోతిష్కులందఱును జేరి ముహూర్తములు పెట్టించుకొనకుండ యాత్రలుచేయుట పాతకములలో నెల్ల ఘోర పాతకమనియు కాలజ్ఞులయిన విప్రోత్తముల జీవనాధారమును మూలచ్ఛేదము చేయుట దోషములలో నెల్ల మహాదోషమనియు ఘోష పెట్టిరి. రాజావలంబము లేకపోవుటచే వారిఘోషము లన్నియు చెవిటివానిముందటి శంఖఘోషములే యయినవి.

మహా—ఆహాహా! మీదేశమున కిప్పుడెంత కష్టమువచ్చినది! అయ్యో! శాస్త్రమన్యాయముగా చెడిపోవుచున్నదే! జనులను సన్మార్గముననడిపించుటకు మీదేశములో మతగురువులు లేరా? పీఠాధిపతులు లేరా? ఎవ్వరును లేకపోయినను మతాభిమానులందఱును జేరి పొగబండ్లను ప్రతిస్థలమునుండియు రాహుకాలములను వర్జ్యములను వారశూలలను గ్రహవేధలను నక్షత్రదోషములను తారాబలములను చంద్రబలములను విచారించి మఱి బయలుదేఱదీయునట్లు శాసన మేర్పఱుప వలసినదని ప్రభుత్వమువారికి సంఘవిజ్ఞాపనములు పంపుకొనరాదా?

సత్య—ఈయాలోచన సర్వోత్తమముగానున్నది. ఇటువంటి మంచి యాలోచన యీవఱకు మావారలబుద్ధులకు గోచరము కాలేదు. మాదేశము చేరఁగానే యీసంఘవిజ్ఞాపనల విషయమయి నేను కృషిచేసి దొరతనమువా రొకవేళ నామొఱ్ఱ వినకపోయినను నాదేశాభిమానమాననీయతను గనఁబఱిచి దేశమునకు మహోపకారము చేసెదను.

మహా—అట్లుచేయుము. అక్కడ మీకేగాని మీప్రభుత్వము వారికి జ్యోతిశ్శాస్త్రవిశ్వాసము లేనట్టున్నది.

సత్య—లేదు. వారికి ముహూర్తములు లేవు; జాతకములు లేవు; ఏమియు లేవు.

5

మహా—గ్రహములు వారిని బాధింపవా?

సత్య—బాధింపవు. అమావాస్యనాఁడు బయలుదేఱినను వారికి కార్యసిద్ధి యగుచున్నది. శూన్యమాసములో శనివారమునాఁడు దుర్ముహూర్తపువేళ లగ్నముపెట్టి వివాహము చేసికొన్నను దంపతులు సంతానవంతులయి వర్ధిల్లుచున్నారు. గ్రహములుకూడ వారికి భయపడినట్లు తోఁచుచున్నది.

మహా—నీకు తోఁచుచున్నది సత్యమే. పంచభూతములను లోఁబఱుచుకొని నిప్పుచేతను నీళ్ళచేతను బండ్లులాగించువారికి గ్రహములు భయపడి లోఁబడుట యాశ్చర్యము కాదు. ఏమియు భయముచేత కార్యసిద్ధిచేసినట్లు భక్తిచేత చేయవు. వెనుక మహారావణునికిని భయముచేతనే కదా సూర్య చంద్రాది గ్రహములును వాయువైశ్వానరాది భూతములును చెప్పినచోట్లనుండి సేవచేయుచు వచ్చినవి.

సత్య—అది సత్యము. ఆహా! ఏమి మీబుద్ధివిశేషము! మీకుఁగల వర్ణనీయమైన శాస్త్రాభిమానము మీబుద్ధి విశేషమునకు వన్నె తెచ్చుచున్నది!

మహా—దేనిని విడిచినను శాస్త్రాభిమానమునుమాత్రము విడువరాదు. శాస్త్రవిశ్వాసముచేత నేను విధ్యుక్తముగా వివాహము చేసికొన్న ధర్మపత్నిని సహితము తృణప్రాయముగా విడిచిపెట్టినాను.

సత్య—ఓహో! మీరు త్రిలోకపూజ్యులుగా కనఁబడుచున్నారు. మీచిత్రచరిత్రమును నాశ్రోత్రపేయముచేసి నన్ను చరితార్థుని జేయుఁడు.

మహా—నాప్రథమభార్య వృషభలగ్నమున లగ్నమందు చంద్రుఁడును సింహమందు సూర్యుఁడును వృశ్చికమందు గురుఁడును కుంభమందు శనైశ్చరుఁడును ఉండఁగా ప్రథమకుమారుని గన్నది. అట్టి లగ్నమందుఁ బుట్టినవాఁడు జారజాతుఁడని శాస్త్రదృష్టిచేతఁ జూ

చినవాఁడనయి గుణవతియైన యాభార్యను తత్క్షణము త్యజించినాను.

సత్య—"వృషస్థేందౌలగ్నే సవితృగురుతీక్ష్ణాంశుతనయై స్సుహృజ్జామిత్రాఖ్యై స్త్రిభవతిని యమాన్మానవపతిః" అనువరాహమిహిరవాక్యమునుబట్టి మీరుచెప్పిన రాజయోగమునందుఁ బుట్టినవాఁడు జారజుఁడు గాక మానవపతి కావలెను—

మహా—ఆవిషయమును గుఱించి చర్చ యక్కఱలేదు. జారజుఁడు మానవపతియైనను విసర్జింపవలసినదే.

సత్య—మీభార్యయందు జారత్వదోష మున్నట్టు మీరావల కెన్నఁడయిన విన్నారా ?

మహా—పుత్రజన్మముచేత శాస్త్రము చెప్పవఱకును నాభార్యయట్టిదని నేను స్వప్నావస్థయందును ననుకోలేదు. అది మహాపతివ్రతయని యెల్లవారును నేఁటివఱకును విశ్వసించి, నేను దానిని నిష్కారణముగా నిష్కారణముగా పరిత్యజించితినని నన్నూరక నిందించుచున్నారు. జారత్వ మెప్పుడును గూఢముగా జరుగునదిగాని యొకరికిఁ దెలియునది కాదు. సర్వజ్ఞకృతమయిన శాస్త్రము చెప్పుదానికంటె జనుల కెక్కువ తెలియునా యని శాస్త్రవిశ్వాసము గలవాఁడనయి, జనులసందలను లక్ష్యము చేయక ప్రత్యక్షసాక్షియైన శాస్త్రమును బట్టి భార్యాపరిత్యాగముచేసి నేను నావంశపరిశుద్ధతను నిలుపుకొన్నాను.

సత్య—పాపము! ఆమెగతి యేమయినది ?

మహా—దానికేమిలోపము ? దానికిఁ దగిన భరణమేర్పఱిచి నేను మఱియొక కన్యను పాణిగ్రహణము చేసికొన్నాను. నాద్వితీయ భార్యకు నిర్దోషమయిన సుముహూర్తమునందు ప్రథమపుత్రజననమయినది. ఆశిశుజన్మమైనది యెంత మంచిలగ్నమో యెఱుఁగుదువా? వాని జననసమయమునందు బృహస్పతి యేకరాశిగతులయిన సూర్య

చంద్రులను చూడక చక్కగానున్నాఁడు.

సత్య—ఆహా! ఏమి మీశాస్త్రవిశ్వాసము!

మహా—ఏమి? నాశాస్త్రవిశ్వాసమున కంతయాశ్చర్య పడు చున్నావు! మీదేశమునందు శాస్త్రవిశ్వాసములేదా?

సత్య—కావలసినంత యున్నది. మాతుల మరణ యోగము నందు శిశువులు పుట్టినపక్షమున తమగండములను తప్పించుకొనుటకయి మేనమామలు మొదలయినవారు శాస్త్రవిశ్వాసముచేతనే మంత్రసానులకు లంచమిచ్చి శిశువులను చంపించివేయుదురు. అయినను మాదేశమునం దింగ్లీషు చదువుచేత నట్టి సత్యములనునమ్మని నాస్తికులు కొందఱిప్పుడు బయలుదేఱుచున్నారు.

మహా—కలికాలమహిమచేత నట్టిబౌద్ధులు మాద్వీపమునందును గొందఱు వెలసి జ్యోతిష మబద్ధమని కుత్సితబుద్ధివాదములు చేయుచున్నారు. ఈసారి నిన్ను వారిసభలకుఁ దీసికొనిపోయెదను లే.

సత్య—ఆనాస్తికాధముల సభలకు నన్నుఁ గొనిపోవుటకంటె ముందుగా మీరీవఱకు వాగ్దానము చేసియున్న ప్రకారముగా నన్నొకసారి శాస్త్రవిశ్వాసము గల పండితసభకుఁ దీసికొనిపోయి జ్యోతిష్కులు న్యాయముతీర్చు విధమును జూపుఁడు.

మహా—మంచిది. ఈమాటలసందడిలో నీకు శివపూజాసమయము మించిపోయినట్టున్నది. ఆఁకలిచేత నీకన్నులు గుంటలు పడిపోయినవి. నేను లోపలికిఁ బోయి మందోదరిచేత నీకు నైవేద్యము పంపెదను. భక్తులు దేవతాదర్శనమునకు వచ్చెడువేళకూడ నగుచున్నది. (అని లోపలికిఁ బోయెను.)

ఆమహాకాయుఁడు చెప్పినదానినిబట్టి యాతనిరెండవభార్యకు పుట్టినకొడుకు జారజాతుఁడని యెఱిఁగినవాఁడనయి,

శ్లో॥ స్వలగ్నమిందుం చగురుర్నిరీక్షతే నవా శశాంకం రవిణాసమాగతమ్
సపాపకోఽర్కేణ యుతోథవాశశీ పరేణజాతం ప్రవదంతి నిశ్చయాత్.

అని యేకరాశి గతులయిన సూర్యచంద్రులను బృహస్పతి చూడకున్న కాలమునఁ బుట్టినవాఁడు నిశ్చయముగా జారజుఁడన్న బృహజ్జాతక వచనమునకు ప్రత్యక్ష విరుద్ధముగానున్న వారిశాస్త్రము సత్యము కాదని నాలో నేననుకొని, ఆతనికిఁ గోపము వచ్చునన్న భయముచేత నతనితో నేతద్విషయమును గూర్చి ప్రస్తావింపక వారిది రాక్షస శాస్త్రమగుటచేత నట్లు వ్యత్యస్తముగా నున్నదని నిశ్చయము చేసికొని యప్పటి కూరకుంటిని.

నాలవ ప్రకరణము.

——— :)o(:——— —

వెనుకటి ప్రకరణమునందుఁ జెప్పిన ప్రసంగము నడిచిన నాలుగుదినముల కొకనాఁటి మధ్యాహ్న సమయమునందు నా యజమానుఁ డయిన మహాకాయుఁడుగారు నాయొద్దకువచ్చి, నేఁడు రాజసభ జరగఁబోవుచున్నది గనుక జ్యోతిషవిద్వాంసులు చెప్పు తీర్పులయొక్క రీతిని జూచి యానందించుటకయి నీ కోరిక ప్రకారముగా నిన్నక్కడకుఁ గొనిపోవ వచ్చినానని సెలవిచ్చెను. నే నాయనయాజ్ఞను శిరసావహించి తత్క్షణమే యుచిత వస్త్రాదులను ధరించి యరగడియలోపలనే ప్రయాణమునకు సంసిద్ధుఁడను కాఁగా నాయజమానుఁడు నా యాలయముయొక్క తలుపులు మూయించి నన్నుఁ గొనిపోయి తన గుఱ్ఱపుబండిలో తాను గూరుచున్న మెత్తమీఁద నన్ను తన కుడివైపుఁ గూర్చుండఁబెట్టుకొనెను. నే నెక్కిన బండి రాక్షసిబండి యనియు, దానికిఁ గట్టఁబడిన గుఱ్ఱములు రాక్షసి గుఱ్ఱములనియు, నేనిప్పుడు వేఱుగఁ జెప్పనక్కఱలేదుగదా ! ఆబండి ధవళేశ్వరపు కొండంతయున్నది; దానికిఁ గట్టఁబడిన గుఱ్ఱములును ఒక్కొక్కటి పదియేనుఁగు

లంతలేసియుండి నాదృష్టికి నడగొండలవలెఁ గానఁబడినవి. ఉత్సవ విగ్రహములను దేవాలయములలోని యర్చకులు మోసికొని పోవునట్లుగా నాయజమానుని సేవకులు నన్ను తమచేతులలోఁ గొనిపోయి యాశకటమునందుఁ గూరుచుండఁ బెట్టఁగా, భయముచేత నిశ్చేష్టుఁడనయి దేవాలయములోని పీఠముమీఁద దేవుఁడు కూర్చున్నట్లుగా భూదేవుఁడనైన నేనును కదలమెదలక యందలి మెత్తమీఁద గూరుచున్నాను. కొంతసేపటికి తెలివి తెచ్చుకొని నేను ముందు చూచునప్పటికి గుఱ్ఱములు బండి నీడ్చుకొని వాయువేగమునఁ బరుగెత్తుచుండినవి; బండిచక్రముల చప్పుడు మేఘగర్జనమువలె చెవులు చిల్లులు వోవునట్లు కర్ణకఠోరముగా వినఁబడఁ జొచ్చినది. ఈయవస్థలో గాలిలోఁ బెట్టిన దీపమువలె వెనుకకును ముందునకును బండికుదుపుచేత నూగులాడుచు ప్రాణములు బిగఁబట్టుకొని మెత్తకుఁ గుట్టిన పగ్గములవంటి దారములను రెండుచేతులతోను గట్టిగాఁ బట్టుకొని యరగంటసేపు కూరుచుండునప్పటికి సభామందిరము సమీపించినందున బండినిలిచినది. అప్పుడు మహాకాయుఁడుగారు బండిదిగి సభాగృహద్వారముపద్దకి నడవఁగా వెనుకనుండి భృత్యులు తదాజ్ఞానుసారముగా నన్నుఁ గొనివచ్చి యాయనచేతి కందిచ్చిరి. నావంటి యల్పునిఁ దమవంటి ఘనులు మోయుట ధర్మముకాదని నేనాయనతో నా వినయవిధేయతలు తేటపడునట్లుగా మనవిచేసి నన్ను మఱియొకరి చేతికియ్యవలసినదని ప్రార్థించినను, ఆయన నా ప్రార్థన నంగీకరింపక నీచసేవకులు సభాభవనములోనికిఁ బోఁగూడదను హేతువుచేతఁ గాఁబోలును నన్ను స్వయముగానే చేతులలో నెత్తుకొనిపోయి ధర్మాధికారిగారు చూపిన పీఠముమీఁదఁ దాను గూరుచుండి నన్ను తన ప్రక్కను గూరుచుండఁ బెట్టుకొనెను. మేమక్కడకుఁ బోవునప్పటికే సభాస్తారులందఱును వచ్చి తమ కర్హములగున పీఠములమీఁద నాసీనులయి యుండఁగా,

సభయంతయు వ్యవహారమును జూడవచ్చిన మహాజనులతో నిండిపో యినది. వారిలో ధర్మాధికారియగు ఖరుఁడు దక్షిణముఖముగా నొక్క యున్నతాసనముమీఁదఁ గూరుచుండి యుండెను. ఆయనకు కుడిప్రక్కను రెండుమూఁడు బారల దూరములో వరుసగా వేసియు న్న పీఠములపయిని పంచామరతరువులవలె జ్యోతిషవిద్వాంసు లయి నుగురు తలలకు శాలువులు చుట్టుకొని చెవులను కుండలము లల్లల నాడ గంభీరముగాఁ గూరుచుండి యుండిరి. వారి నామములు వరుసగా వృశ్చికరోముఁడు, సర్పరోముఁడు, ఖడ్గరోముఁడు, అగ్నిరోముఁడు, కంటకరోముఁడు, అని తరువాత నేను మా యజమానునివలనఁ దెలిసికొన్నాను. రోమకసిద్ధాంతము నభ్యసించు టచేతనో మఱియే హేతువుచేతనో కాని యాదేశమునందు సామాన్య ముగా జ్యోతిషసిద్ధాంతులు నామముల చివరను రోమశబ్దము చేర్పఁ బడుచున్నది. ఆమహావిద్వాంసులకును ధర్మాధికారికిని నడుమగా లేఖ నోద్యోగి యొకఁడు నిలువఁబడియుండెను. అప్పుడు నిలువఁబడియున్న యాలేఖకునిపేరు తిగాయుఁడు. రాజభటులు చేతు లాడించుచు మా టాడుచున్నవారి నూరకుండుఁడని కేకలు వేయుచుండఁగా, ధర్మాధికా రితలయెత్తి చూచి లేఖకుని వైపునకుఁ దిరిగి వ్యభిచార వ్యవహారము ను విమర్శించుటకు ముందుగా నందలి వాది ప్రతివాదుల నెదుటఁ బెట్టింపుమని యుత్తరువు చేసెను. అతఁడు రాజభటులను జూచి ప్ర హస్తుని వజ్రహస్తుని నైకసిని దీసికొనిరండని చెప్పెను. వారు వెంటనే పోయి యిద్దఱు ప్రహస్తులను నైకసిని దీసికొనివచ్చి యెదుట నిలిపిరి.

లేఖ—భటులారా! మీరిద్దఱు ప్రహస్తులను దెచ్చినారేమి? వీరిలో వజ్రహస్తుఁడెవరు? ప్రహస్తుఁడెవరు?

భటు—మేము వాదిప్రతివాదులను గొనిపోయి యొకగదిలోఁ బెట్టి యీవలఁ గూరుచుండఁగా ప్రభువువారు పిలిచెడిలోపల వారి

లో వజ్రహస్తుఁడు తన కామరూప ప్రభావముచేత ప్రహస్తుఁడుగా మాఱిపోయినాఁడు.

ఇట్లేకరూపమును బొందినవారిరువురిలో నెవ్వఁడు ప్రహస్తుఁడో యెవ్వఁడు వజ్రహస్తుఁడో నిర్ణయించుటకు శక్యముకానందున వారిలో నొకనిని మొదటి ప్రహస్తుఁడనియు నింకొకనిని రెండవప్రహస్తుఁడనియు నిజము తెలియువఱకును జెప్పవలసి యున్నది.

ధర్మా—నిష్కారణముగా మాకు శ్రమ కలుగఁజేయక మీలో నిజమైన ప్రహస్తుఁ డెవఁడో శీఘ్రముగాఁ జెప్పుఁడు.

మొ-ప్రహా—నేనే నిజమయిన ప్రహస్తుఁడను. ఇతఁడు మాయాప్రహస్తుఁడు.

రెం-ప్రహా—నేను నిజమయిన ప్రహస్తుఁడను. ఇతఁడుమాయప్రహస్తుఁడు.

ధర్మా—మీరబద్ధము లాడఁగూడదు. మీలో వజ్రహస్తుఁ డెవఁడు?

మొ-ప్రహా—అతఁడు వజ్రహస్తుఁడు.

రెం-ప్రహా—అతఁడు వజ్రహస్తుఁడు.

లేఖ—ఈ వ్యవహారము చక్కఁగానే యున్నది. సత్యమునుకనుఁగొని శిక్షించువఱకును వీరిలో నొక్కరును నిజము చెప్పరు. ఈసత్యాసత్యముల నిప్పుడీవిద్వాంసులే నిర్ణయము చేయవలెను.

ధర్మా—ఆసంగతి తరువాత చూచుకొందము గాని ముందుగా మీయభియోగమేదో వాది సభవారికి మనవిచేయవలెను.

మొ-ప్రహా—కైకసియను నీకామిని నాభార్య. నేనింట లేనప్పుడీ వజ్రహస్తుఁడు నావేషము వేసికొనివచ్చి—

రెం-ప్రహా-ఛీ! ఛీ! అబద్ధములాడకు—ప్రహస్తుఁడవు నీవా? నేనా?—ఓ మహాప్రభూ! న్యాయప్రభువులు నామొఱ్ఱ యాలకింపవ

లెను. కైకసియును నీ కామినీ నాభార్య. నేనింటలేనప్పుడీ ప్రహస్తుఁడు నావేషము వేసికొనివచ్చి—

ధర్మా—ఇఁక నీరివలన సత్యము బయలఁబడదు.—ఓకైకసీ! వీరిలో నీభర్త యెవ్వఁడో నీవు చెప్పు.

కైక—(ఇరువుర మొగములవంకఁ జూచి,) ఓమహాప్రభూ! నేను గదిలోనున్నప్పుడు నాభర్తకు కుడివైపునఁ గూరుచున్నాను. అప్పుడు కూరుచున్నట్లు కూర్చుండఁబెట్టిన పక్షమున నాభర్త యెవ్వరో నేను జెప్పఁగలను. రాజభటులు వారి నిక్కడకుఁ దీసికొనివచ్చునప్పుడు తమతమ స్థానములను వదలి వారిద్దఱును గలసి పోయినారు. ఇప్పుడు నేనెవ్వరివంకఁజూచిన నతఁడే నాభర్తగాఁ గనఁబడుచున్నాఁడు.

మొ ప్రహ—ఓప్రాణేశ్వరీ! నావంక తిన్నఁగాఁ జూడు. నేను నీభర్తను కానా?

రెం-ప్రహ—ఓప్రాణేశ్వరీ! అతనివంకఁ జూడక నావంకఁ జూడు. నేనే నీకుభర్తను కానా? —ఓరీ వంచకుఁడా? నీవు మాయ చేసినంతమాత్రమున పెండ్లినాఁటినుండియు నన్నెఱిఁగిన నాధర్మపత్ని నిన్ను భర్తయనుకొను ననుకొన్నావురా? —ఓప్రాణేశ్వరీ! నిజము చెప్పవేమి?

కైక—మీరే నాప్రాణవల్లభులలాగున నున్నారు.

మొ-ప్రహ—ఓప్రాణేశ్వరీ! యీమోసగాని మాయమాటలను నమ్మి మోసపోకు. నీవింతదాక నాకుడిప్రక్కను గూరుచుండలేదా? యింతలోనే నన్ను గుఱుతుపట్టలేక పోయినావా? నేనే నీకు నిజమైన భర్తనగుదునో కానో నా మొగముచూచి చెప్పు.

కైక—మీరును నాప్రాణవల్లభులలాగుననే యున్నారు.

ధర్మా—ఈవ్యవహారమీలాగున తేలదు. నీభర్తయెవ్వరో యీమాట యటుండనిచ్చి నేరముజరిగినదా లేదో నిజముచెప్పు.

కైక—నాభర్తను దప్ప నేను పరపురుషుని కన్నెత్తి చూడలేదు.

ధర్మా—అది కాదు. ఈయభియోగ పత్రికలోఁ జెప్పఁబడిన కాలమునం దొకపురుషుఁడు శయనగృహమున నీయొద్దనున్నాఁడా?

కైక—నా భర్త నాయొద్దనున్నాఁడు

మొ-ప్రతి—అప్పుడున్న వాఁడు నీభర్తగాఁడు. నీభర్తయొక్క రూపమును ధరించివచ్చిన వజ్రహస్తుఁడు.

రెం-ప్రతి—ఆమాట పరమసత్యము. ఆవేషము వేసికొని వచ్చి నీతో నున్నవాఁడు వంచకుఁడయిన వజ్రహస్తుఁడే.

ధర్మా—ఇటువంటి వ్యవహారములలో పెద్దమనుష్యులు సభల కెక్కరాదు. ఎక్కినపక్షమున నుభయుల గౌరవమును బోవుటయే కాక యిల్లాండ్రకుఁగూడ నపఖ్యాతివచ్చును. ఈవిషయములో వాది ప్రతివాదు లిద్దఱును సఖ్యపడి సమాధానపడవలెను.

మొ-ప్రతి—సభ కెక్కిన యీవ్యవహారములో నిఁక సఖ్యము కుదురదు. ధర్మాధికారులు సత్యము కనిపెట్టి దోషిని కఠినముగా శిక్షింపవలెను.

రెం-ప్రతి—ఈ వజ్రహస్తుఁడు చెప్పినమాట సర్వజనశ్లాఘాపాత్రముగా నున్నది. ఏలినవారు దోషికి కఠినదండనము విధింపవలెను.

మొ. ప్రతి—ఓరిద్రోహీ! వజ్రహస్తుఁడను నేనా! నేనా?

రెం-ప్రతి—ఓరివంచకుఁడా! నీవు వజ్రహస్తుఁడవుగాక మఱి యెవ్వఁడవురా? నీవు లోకమును వంచింపఁదలఁచుకొన్నను శ్రీమహేశ్వరుని పంచముఖములవలెఁ గూరుచున్న యీపండితపంచకమైనను నీమోసము తెలిసికోలేదనుకొన్నావురా? ఓరిపాపాత్ముఁడా! ఓరి క్రూర—

ధర్మా— మీలో మీరు పోట్లాడక యూరకుండుడు.— ఓ విద్వదగ్రగణ్యులారా ! మీరే యిప్పుడు శాస్త్రసిద్ధాంతానుసారముగా ధర్మనిర్ణయము చేయవలెను. నిజము చెప్పక యింతసేపు మాకు నిష్కారణముగా నాయాసము కలుగఁజేసినందునకయి యీసారి యపరాధికి మే మతిఘోరశిక్ష విధింపఁదలఁచుకొన్నాము. మీరిప్పుడు సిద్ధాంతకరింపవలసిన యంశములు— ౧. వీరిలో వజ్రహస్తుఁడెవఁడు; ౨. వజ్రహస్తుఁడు నేరము చేసినాఁడా, లేదా? ౩. ఈమె నిజమయిన కైకసి యగునా ! కాదా?— ముఖ్యముగా నీమూఁడంశములను మీరు శాస్త్రపద్ధతిని నిర్ధారణము చేయవలెను.

అని ఖరాసురుఁడు సెలవియ్యఁగానే సిద్ధాంతు లాకాశమువంకఁ జూచియు వ్రేళ్లు మడచియు నేలమీఁద నంకెలు వేసియు ముకుపుటముల వ్రేళ్లు చొనిపియు నొండొరులతో గుసగుసలాడియు లెక్కలువేసి తలపోతలకుఁ జొచ్చిరి. ఈలోపల ధర్మాధికారి పీఠముమీఁద వెనుక కొఱిగి యొక్క కునుకు కునికెను. సభలో నిలిచియున్న యుభయవాదుల పక్షములవారును విద్వాంసు లేమి సెలవిత్తురో యని వినువుత్సుకులై వేచియుండిరి. చూడవచ్చినవారందఱును వివిధవిషయములనుగూర్చి తమలోఁ దాము సంభాషించుకొనుచుండిరి. ఈప్రకారముగా రెండుగడియలసేపు నడచునప్పటికి సిద్ధాంతులలో నొకఁడు లేఖకునిఁ బిలిచి తమయభిప్రాయములను వ్రాయవలసినదని చెప్పెను. మనదేశమునందు వలెనే యాదేశమునందును విద్వాంసులకు శాస్త్రజ్ఞానమే కాని యక్షరజ్ఞాన ముండదు. అందుచేతనే యాదేశమునందు వైయాకరణుఁడు తన చుట్టములకుత్తరము వ్రాయవలసివచ్చినను లౌకికుల నొద్దకుఁబోయి వ్రాయించుకోవలసినవాఁడే కాని స్వయముగా వ్రాసికొనేర్చినవాఁడు కాఁడు. ఆసంగతి యటుండనిచ్చి కార్యాంశమును చిత్తగింపుఁడు. లేఖకుఁడు ధర్మా

ధికారిని లేపినప్పుడు జ్యోతిష్కులు తమ సిద్ధాంతములను దెలిపిరి. వారిలో వృశ్చికరోముఁడును కంటకరోముఁడును రెండవ ప్రహస్తుఁడే వజ్రహస్తుఁడని చెప్పిరి. తక్కిన ముగ్గురును మొదటిప్రహస్తుఁడే వజ్రహస్తుఁడనిరి. ఇఁక రెండవసారాంశములో వృశ్చికరోముఁడునుకంటకరోముఁడునువజ్రహస్తుఁడు నేరముచేసినాఁడనిరి. అగ్నిరోముఁడును, సర్పరోముఁడును వజ్రహస్తుఁడు నేరము చేయలేదనియు నతనియందలి ద్వేషము చేత భార్యాభర్తలే కనుబు యీదోషారోపణము చేసినారనియు పలికిరి. మూఁడవసారాంశమును గూర్చి యేవురుసిద్ధాంతులును నైకకంఠ్యముతో నామె నిజమయిన కైకసి యనియే సిద్ధాంతము చేసిరి. అప్పుడు వాదిబంధువు లగ్నిరోమ సర్పరోములు వజ్రహస్తునివలన లంచముగొనిరని కేకలు వేయఁజొచ్చిరి; ప్రతివాదిబంధువులు వృశ్చికరోమాదులు ప్రహస్తునివలన లంచములు గైకొనిరని కేకలు వేయ నారంభించిరి. ధర్మాధికారి వారికలకలములువారించి సిద్ధాంతులలో నధికసంఖ్య గలవారి యభిప్రాయాను సారముగా వజ్రహస్తునికి రెండు సంవత్సరములు గారాగృహవాసశిక్ష విధించినట్లు తీర్పు వ్రాసి వినిపించెను. సిద్ధాంతుల యభిప్రాయము ననుసరించి తనకు శిక్షయగునని మొదటిప్రహస్తుఁడు వడవడ వడఁకుచు భూమిమీఁదఁబడి మూర్ఛపోయెను. అందఱును మూఁగి చన్నీళ్ళు చల్లి యాతనిని మూర్ఛ తేర్చునప్పటి కా సందడిలో రెండవ ప్రహస్తుఁడు కనఁబడక యదృశ్యుఁడయ్యెను. అప్పుడా యంతర్ధానము నొందివాఁడే నిజమయిన వజ్రహస్తుఁడని యెల్లవారికిని బోధపడెను. ధర్మాధికారి రాజభటులను జూచి యీఁగయయి యతఁ డెగిరిపోయి యుండును. పట్టుకొండని రాజభటుల కాజ్ఞాపించెను. వారు నానాముఖముల నరచుచు పరుగెత్తిరి కాని వారికంటి కెవ్వరును నక్షత్రమండలము లోపలఁ గాన బడలేదు. ఈప్రకారముగా మొదటి వ్యవహారము

తీర్పఁబడిన తరువాత దొంగతనపు వ్యవహారమును తీర్చుటకయి నేరము మోపినవానిని మోపఁబడినవానిని పిలిపింపుమని మరల ధర్మాధికారి లేఖకుని కుత్తరువు చేసెను.

అంతట లేఖకుని యొక్క యాజ్ఞాప్రకారముగా రాజభటులు దూషణుని ఘూమార్తుని గొనివచ్చి ధర్మాధికారి యెదుట నిలువఁబెట్టిరి.

ధర్మా—ఓ దూషణా! నీవు తెచ్చిన యభియోగమేమి ?

దూష—ఈ ఘూమార్తుఁడు మా బంధువర్గములోనివాఁడు. దుస్సహవాసము చేత నితఁడు చిన్ననాఁటినుండియు దుష్టవర్తనుఁడయి జూదములాడుచు పూర్వులార్జించియుంచిన ధనమునంతను పాడుచేసి విచ్చలవిడిగాఁ దిరుగుచున్నాఁడు. ఇతఁడు తన తల్లిదండ్రులు విధ్యుక్తముగా వివాహము చేసిన భార్యను విడనాడి జారవృత్తి నవలంబించి యొక వేశ్య నుంచుకొని యున్నాఁడు. విత్తము లేనిదే వేశ్యచిత్తమును లోఁగొనుట యెప్పుడును సంభవింపనేరదు గనుక, విత్తహీనుఁడయినప్పుడు జారత్వమును చోరత్వ మనుసరించి యుండకమానఁడు. ఇతఁడు కొంతకాలము క్రిందట మాయింటికి చుట్టపుఁజూపుగావచ్చి చావడిలో నాడుకొనుచున్న మాచిన్నదానినగ నొకటి తెంపుకొనిపోయి వేశ్యకిచ్చినాఁడు. రక్తస్పర్శ గలవాఁడగుటచేత మేమప్పుడీతనిని రచ్చకీడ్వక చీవాట్లుపెట్టి క్షమించి యూరకున్నాము. నిన్నటిదినము మా యింటికి మరల వచ్చి నా భార్యనగలపెట్టె నెత్తుకొని పాఱిపోయినాఁడు. పిల్లది చూచి యఱవఁగానే మేము వెంటఁబడితిమిగాని యితఁడు వీధినిబడి యేదో సందులోదూఱి యదృశ్యుఁడయినాఁడు.

ధర్మా—తరువాత నగలపెట్టె దొరకినదా ?

దూష—దొరకలేదు. నేను వెంటనే రాజభటులను గొని యి

తనియింటికిఁ బోయినాను. అప్పుడితఁడింటలేఁడు. ఇల్లు శోధించినాము గాని పెట్టె దొరకలేదు.

ధర్మా—ఇతఁడింటికే రానప్పుడు పెట్టె యెట్లు దొరకును? మీరు మొట్టమొదట వేశ్యయింటికిఁ బోవలసినది.

ధూమ—ఆపనియుఁ జేసినాము పెట్టెకాని యితఁడుకాని యింట దొరకకపోఁగా మేమక్కడనుండి తిన్నగా వేశ్యయింటికిఁబోయి దానియిల్లు శోధింపఁగా నొక మూలగదిలో నితఁడు దొరకెనుగాని పెట్టె మాత్రము దొరకలేదు. రాజభటు లితనిని పట్టుకొని దేవరసన్నిధికిఁ దెచ్చినారు. ఇతఁడు నగలపెట్టెను చంకక్రిందఁ బెట్టుకొని పరుగెత్తుచుండఁగా మేమందఱము కన్నులారఁ జూచినాము.

ధర్మా—ధూమమూర్తీ! నీవేమి చెప్పుకొనెదవు? నీవు రాజబంధుఁడవయ్యును నీదుష్ప్రవర్తనముచేత బంధులమయిన మాకందఱికిని తలవంపులు తెచ్చుచున్నావు.

ధూమమూ—నావెనుకటి నడతనుబట్టి నేనేమి చెప్పినను నామాట యెవ్వరును నమ్మరు. మొదట చిన్నదాని నగయెత్తుకొని పోయినమాట వాస్తవమే కాని యీసారిమాత్రము నగలపెట్టెను నేను దొంగిలింపలేదు. నగలపెట్టె పోయినదన్న సమయమున నేను వేశ్య యింటనే యున్నాను.

ధర్మా—జార చోరులమాట నమ్మరాదు.—ఓవిద్వచ్ఛిఖామణులారా! నగలపెట్టె పోయినదో లేదో, ఆపెట్టె నితఁడపహరించినాఁడో లేదో, ఆపెట్టె యిప్పుడెక్కడనున్నదో, మీరే శాస్త్రదృష్టిచేతఁజూచి సత్యము చెప్పుఁడు.

న్యాయస్థానమునకు వచ్చిన ప్రత్యభియోగమునందును మూఁడు సారాంశములు నేర్పఱుచుట యచ్చటి శాస్త్రమర్యాద. ధర్మాధికారి యీప్రకారముగా సారాంశములు నేర్పఱిచి వ్యవహారనిర్ణయ

ము చేయఁ గోరఁగా వెనుకఁ జెప్పినప్రకారముగానే సిద్ధాంతులు యథావిధిగా చేయవలసిన తంతులన్నియు నడపి యాలోచించి యీసారి యభిప్రాయభేదములు లేకుండ సారాంశముల మూఁటిని శాస్త్ర దృష్టితో సావధానముగాఁ జూచి యేకవాక్యముగా సిద్ధాంతీకరించి సత్యమును తెల్పిరి. నగలపెట్టె పోవుట సత్యమేయనియు, దానిని తస్కరించినవాఁడు ధూమ్రాక్షుఁడేయనియు, ఇతఁడా పెట్టెను తానుంచుకొన్న వేశ్యకియ్యగా నావేశ్య యాపెట్టెను తానుంచుకొన్న విటపురుషుని చేతికిచ్చి యిల్లు దాటించె ననియు, వారేర్పఱిచిన నిష్కృష్టాశయమును లేఖకుఁడు వ్రాసి ధర్మాధికారి చేతికిచ్చెను. అదిచూచుకొని ధర్మాధికారి యాకాశమువంకఁ జూచి కొంతసే పాలోచించి, రాజబంధుని నీచతస్కరునివలె చెఱసాలకుఁ బంపుట యుచితము కాదని నిశ్చయించి, ధూమ్రాక్షునకు నూఱు సువర్ణములు ధనదండమును విధించి, ఆ మొత్తమును నెలదినములలోపల చెల్లించునట్లు తీర్పు చెప్పెను. ఆతీర్పు వినిపింపఁగానే సభలోనుండి త్రిశిరుఁడను రాజకుమారుఁడు ధర్మాధికారినద్దకు నడిచివచ్చి దొంగిలింపఁబడిన నగలపెట్టెను దెచ్చి యాతనిపీఠముమీఁదఁ బెట్టి, ఆపెట్టెను ధూమ్రాక్షుసహాయముతో తానే దొంగిలించితినని చెప్పి, శిక్షగా విధించిన నూఱుసువర్ణములను చెల్లించి ధూమ్రాక్షుని విడిపించెను. అంతట ధర్మాధికారి మఱియొక్క వ్యవహారమును పరిష్కరించుటకయి వాది ప్రతివాదులను పిలిపింపుమని లేఖకుని కుత్తరు విచ్చెను. అప్పటికి నాపూజాసమయమును భక్తులు నాయాలయమునకు వచ్చు సమయమును సమీపించినందున, మహాకాయుఁడుగారు సభ ముగియువఱకు నుండక నన్ను వెంటఁబెట్టుకొని బండియెక్కి యింటికివచ్చిరి.

బండికుదుపుచేఁ గలిగిన యాయాసము కొంత శాంతిపొందినపిమ్మట నేను నాయజమానునితో నాఁటి సభావ్యవహారములను గూర్చి

యు జ్యోతిష్కుల సిద్ధాంతనిర్ణయమునుగూర్చియుమాటాడ నారంభించితి ని. నాయజమానుఁడు కొంతసేపు తానావిషయమయి నాతో మాటాడుట కిష్టములేని వానివలెఁ గనఁబడినను నేను విడిచిపెట్టక వేసిన ప్రశ్న నే మరల వేయుచు వచ్చుటచేత తుదకిష్టములేకయే నాప్రశ్నల కుత్తరము చెప్పవలసినవాఁడయినందున మాయిరువురకు నీక్రిందిరీతి సంభాషణముజరిగినది --

సత్య—ఓమహాప్రభూ! ఈజ్యోతిష్కులవ్యవహారనిర్ణయ మెల్లప్పుడు నీప్రకారముగానే యుండునా? వేఱువిధముగా నుండునా?

మహా—ఎప్పుడు నిదేప్రకారముగా నుండును.

సత్య—ఏకశాస్త్రమువలననే సిద్ధాంతనిర్ణయము చేయవలసినప్పుడు వీరిలోవీరి కభిప్రాయభేదము లేలకలుగును?

మహా—శాస్త్రమొక్కటికాదు; శాస్త్రములనంతములు.

సత్య—శాస్త్రము లనంతములయినను, అన్నియు నేకవిధముగా ఫలమును జెప్పక పోయిన పక్షమున వానిలో కొన్ని యసత్యములు కావలసివచ్చును.

మహా—శాస్త్రము లసత్యము లెన్నటికినిగావు. ఈభేదమునకుఁ గారణము శాస్త్రార్థము చేయువారి బుద్ధివిశేషములో నుండును. ఫలములను జెప్పువారు తమతమ బుద్ధ్యనుసారముగా నూహించి చెప్పుటవలన నిట్టి భిన్నాభిప్రాయములుకలుగుచుండును.

సత్య—నియామకములేక యెవరిబుద్ధికి తోఁచినట్లు వా రర్థము చేయుచువచ్చినచో శాస్త్రములవలన ప్రయోజనమేమి?

మహా—శాస్త్రము లెవరిబుద్ధికి తోఁచినట్లు వారి కర్థమిచ్చునవికావు. అవి యందఱికి నేకార్థమునే యిచ్చును. అయినను శాస్త్రార్థనిర్ణయముచేయువారు ముహూర్తము తిన్నగా కట్టలేక పోవుటవలనను గణన తిన్నగా చేయలేకపోవుటవలనను ఫలములోఁ గొన్ని వ్యత్యాసములుకలుగుచుండును.

సత్య—జనులు ధనప్రాణములతో సంబంధించిన వ్యవహారము లలో సత్య నిర్ణయము చేయుట కేర్పఱుపఁబడిన పండితోత్తములనైనను చక్కగా కాలము కట్టఁగలవారిని, సరిగా లెక్కవేయఁగలవారిని విచారించి యేర్పఱుపరా ?

మహా—పండితోద్యోగమునకు దేశములోఁ గల జ్యోతిషవిద్వాంసులలో శ్రేష్ఠతములనే యేరి యేర్పఱతురుగాని యిది గుప్తశాస్త్రమగుటచేత నెవ్వరు గట్టివారో యెవ్వరు కారో యేర్పఱచుట యసాధ్యము. ఇటువంటి శాస్త్రములు రహస్యముగా నుంచఁబడినంతకాలము తమమహిమలను గలిగి యుండును గాని యందఱికిని వెల్లడించినచో మహిమలను గోల్పోయి పాటిరెప్పిపోవును. కాఁబట్టి శాస్త్రమన్నది యెవరికిని దెలియకుండ సదా గోప్యముగా నుండవలెను.

సత్య—తమరు సెలవిచ్చినది కొంతవఱకు సత్యమే కాని—

మహా—కాని యని నీవేమో సంశయపడుచున్నావేమి? నేను చెప్పినది సత్యమగునా ? కాదా ?

సత్య—తమరు సెలవిచ్చినది నిస్సందేహముగా సత్యము. అందసత్యమణుమాత్రమును లేదు. నాకు వేదవాక్యమునకంటెను తమవాక్యమునం దెక్కువ గౌరవము. సూర్య చంద్రులు గతులుతప్పినను తమ నోటినుండి యసత్యవాక్కు బయలువెడలునా ? శాస్త్రమర్మము లెప్పుడును సర్వజనులకును వెల్లడిచేయఁగూడదు అందులో ముఖ్యముగా మాదుశాస్త్రములు పరమగుహ్యములు. అందుచేతనే మాదేశమునందుఁ గూడ చదువెఱుఁగనివారు సహితము జ్యోతిశ్శాస్త్రములోను, వైద్యశాస్త్రములోను, మంత్రశాస్త్రములోను, మహావిద్వాంసులయి జనసమ్మానముపొంది కోటీశ్వరు లగుచున్నారు.

మహా—ఈ సంభాషణమునుబట్టి నీవు రహస్యోపదేశమునకు పాత్రుఁడవయినట్టు నాబుద్ధికి పొడకట్టినది కాఁబట్టి నేనిప్పుడు మర్మములు

డిచి సిద్ధాంతులు చెప్పు ఫలమునలో వ్యత్యాసము కలుగుటకుఁగల ని జమయిన కారణమును తెలిపెదను. నీవిది విశ్వాసహీనులతోఁ జెప్పక మహారహస్యముగా నుంచవలెను. ఇట్టి జ్ఞానదానమున కెల్లవారును న ర్హులు కారుసుమా!

సత్య—తమరు సెలవిచ్చినది పరమసత్యము. జ్ఞానోపదేశమున కందఱును యోగ్యులు కారు. నేను యోగ్యుఁడనని తమచిత్తమునకు తోఁచిన పక్షమున—

మహా—నీయోగ్యతావిషయమై మాకణుమాత్రమును సందే హములేదు. జ్యోతిషము తప్పిపోవుటకు నిజమైన కారణము పరమేశ్వ రశాపము. నీవు భక్తాగ్రేసరుఁడవగుటచేత పరమరహస్యమైనను దాఁ చక నీకిది నేను సమగ్రముగా నుపదేశించినాను. నీ విది భక్తిహీనుల కెప్పుడును చెవిని వేయఁగూడదు. ఇప్పుడు నీకు తృప్తి కలిగినదా?

సత్య—నిజమైన కారణమును గ్రహించుటచేత నే నిప్పుడు ప రమసంతుష్టాంతరంగుఁడ నయినాను. ఇది యత్యంతగుహ్యమైన పరమ రహస్య మనుటకు సందేహములేదు. ఇది దేవరహస్యమే కాకపోయిన పక్షమున, పురాణములనురచించిన మా దేశములోని సర్వజ్ఞులయిన మ హర్షులకొక్కరికైన దెలిసియుండకపోవునా? నేను మా దేశము చేరిన తోడనే దీనిని పద్మపురాణముయొక్క యుత్తరభాగములోని యష్టోత్తర శతసహస్రాధ్యాయమునందుఁ జేర్చి వ్యాసప్రోక్తము చేయించెదను. తమ రీశాపకారణము నామూలాగ్రముగా సెలవియ్యవలెను.

మహా—పూర్వకాలమునందు శ్రీసాంబమూర్తి వారు త్రిపు రాసుర సంహారము చేయఁబూని యుద్ధ సన్నద్ధులయియున్న ప్పుడు మొంగగా శుక్రాచార్యుల వారా వృత్తాంత మును తమ జ్యోతిశ్శాస్త్ర మహిమచేఁ దెలిసికొని శిష్యులకు తెలుప గా, వారు శివుఁడు వచ్చులోపల తమ పురములతో పాతాళలోకము

నకు యాత్రవెడలిరి. తరువాత సమస్తసన్నాహములతోను శివుఁడు వచ్చి త్రిపురములను గానక తనదివ్యదృష్టిచేత నిది యంతయు శుక్రాచార్యుల కృత్యమని తెలిసికొని జ్యోతిషమెల్లప్పుడును యథార్థము కాకపోవును గాకయని శపించెను. దీనిమర్మ మిది.

సత్య—నేను ధన్యుఁడనయినాను. తమరు మర్మమువిడిచి యీ రహస్యమును నాకానతిచ్చినందున, సెలవయినపక్షమున నాకు తెలిసిన రహస్యము నొకదానిని దేవర వారితో మనవిచేసెదను. జ్యోతిషమునకు పార్వతీశాపమున్నమాట మీపురాణములయం దెచ్చటనైనఁ జూచియున్నారా ?

మహా—లేదు. జ్యోతిశ్శాస్త్రమున కొక్కయీశ్వరశాపమే గాక పార్వతీశాపము కూడ నున్నదా? ఏమి యీవింత!

సత్య—జ్యోతిశ్శాస్త్రము సందిగ్ధఫలముల నిచ్చుటకు ముఖ్యకారణము పార్వతీశాపమే. పూర్వము సాంబశివులవారు సభలోఁగూర్చుండి జ్యోతిశ్శాస్త్రముయొక్క సత్యమును పరీక్షింపవలెనని యెంచి బృహస్పతినిజూచి యిప్పుడు పార్వతీదేవి యేమి చేయుచున్నదో చెప్పుమని యడిగెను. అతఁడు శాస్త్రదృష్టిచేతఁ జూచి పార్వతీదేవి వస్త్రహీనయై యభ్యంజనస్నానము చేయుచున్నదని చెప్పెను. ఆవాక్యముయొక్క యథార్థతను కన్నులార చూడవలెనని శివుఁడు తత్క్షణమే కొలువువిడిచి లేచి తిన్నగా నంతఃపురమునకుఁబోయి, నలుగుపిండితోఁ జేసి ప్రాణప్రతిష్ఠ చేసి కావలియుంచిన విఘ్నేశ్వరుఁడు లోపలికి పోనీకపోఁగా నతనిశిరస్సు ఖండించి పోయి చూచి జ్యోతిశ్శాస్త్రముయొక్క సత్యమున కత్యాశ్చర్యపడెను జ్యోతిశ్శాస్త్రమువలన స్త్రీలగుట్టు మగవారికి తెలిసిపోవుచున్నదిగదా యని పార్వతీదేవి యాగ్రహముతో జ్యోతిశ్శాస్త్రము ఫలింపక పోవునుగాక యని ఘోరశాపమిచ్చెను. జ్యోతిష్కులు చెప్పినఫలము తప్పిపోవుట కీశాపములే కారణములుగాని శాస్త్రమెంతమాత్రము నబద్ధము కాదు.

మహా— దేవతలందఱును మహాదుర్మార్గులు. అందులోను దేవగురువైన బృహస్పతి పరమదుర్మార్గుఁడు. కాకపోయినపక్షమున నమూల్యమైన జ్యోతిశ్శాస్త్రమునకు నిష్కారణముగా శాపము తెచ్చి పెట్టునా? ఇటువంటి దుష్కార్యమును జేసినందుకు మారావణమహా రాజుగారు లేకపోఁబట్టి బ్రతికిపోయినాఁడు. పాపీ చిరాయు వనుట చేత నెల్లకాలము నాతనినే బ్రతుకనిమ్ము. సత్యమిప్పుడు నాకు పూర్ణ ముగా బోధపడినది. జగత్తునకు తల్లిదండ్రులయిన పార్వతీ పరమేశ్వ రు లిద్దఱును శాపములు పెట్టిన తరువాత సిద్ధాంతులు చెప్పినఫలము తప్పిపోవుటలో నాశ్చర్య మేమున్నది? సిద్ధాంతులు లంచములు పుచ్చు కొని తప్పుఫలములను చెప్పుదు రందురుగాని చెప్పినఫలములు తప్పిపో వుటకు లంచము లక్కఱలేక యీశాపములే చాలును.

ఇంతవఱకు సంభాషణ జరుగునప్పటికి నాపూజసమయమును భక్తులు దర్శింపవచ్చు సమయమును సమీపించినందున నాయర్చకులు రాఁగా మహానాయుఁడుగారు నన్ను విడిచి లోపలికిఁ బోయిరి. అంతట నేనీవఱకు వర్ణించినప్రకారముగా నానిత్యకృత్యములు యథావిధి గా జరుగ నారంభించెను.

అయిదవ ప్రకరణము.

సభాసందర్శనము చేసి వచ్చిన తరువాత మూఁడవనాఁడు మధ్యాహ్నము మూఁడు గంటలవేళ మహానాయుఁడుగారువచ్చి, నేఁడు జ్యోతిశ్శాస్త్రమునుగూర్చి సభ జరుగఁబోవుచున్నది గనుక తనవెంటఁ జూడ రమ్మని నన్ను పిలిచిరి. మొన్న బండిలో తగిలిన కుదుపువలన

గలిగిననొప్పు లింకను తిన్నగా పోకపోయినను, ఆయనమాటకు మాఱుపలుక వెఱచి ప్రయాణమై యాయనవెంట బయలుదేరితిని. బండిలో నెక్కినది మొదలుకొని సభామందిరము చేరువఱకును జరిగిన కథ యంతయు నించుమించుగా వెనుక వర్ణించినరీతిగానే యున్నది; గాని బండి దిగినతరువాత వెనుకటివలె మాయజమానుఁడుగాక సేవకుఁడే నన్ను లోపలికిఁ దీసికొనిపోయి యొక యున్నతాసనముమీఁదఁ గూరుచుండఁబెట్టిరి. మేము వీధిగుమ్మముచేరఁగానే నాఁటిదినము సభలో తాను ధూమ్రాక్షువేషముతో నగలపెట్టెను దొంగిలించితినని తెచ్చియిచ్చిన త్రిశిరుఁడు మాకెదురుగా వచ్చి ప్రత్యుత్థానముచేసి మమ్ము లోపలికిఁగొనిపోయి యుచితాసనముమీఁదఁ గూరుచుండఁబెట్టెను. మేము పోవునప్పటికే సభాభవనము మహాజనులతో నిండి యుండెను. అందులోఁ గొందఱు జ్యోతిశ్శాస్త్రమబద్ధమని వాదించుటకయి యక్కడకువచ్చిరి; మఱికొందఱు వారివాదమును ఖండించి పూర్వసిద్ధాంతమును స్థాపించుటకయి వచ్చిరి; తక్కినవా రుభయవాదములను విని వేడుక చూచుటకొఱకును నవనాగరికులను గేలిచేయుటకొఱకును వచ్చిరి. అప్పు డుపన్యాససమయమునందున పూర్వపక్షులలో నొకరు లేచి త్రిశిరుఁడుగారి నగ్రాసనాసీనునిగా నేర్పఱుపఁగోరెను; వెంటనే సిద్ధాంతులలో నొకరు లేచి నవనాగరికాగ్రగణ్యుఁడయిన యాయన నాపనికి నియమించుట కాక్షేపించి మహాకాయుఁడుగారి నగ్రాసనాసీనునిగా నేర్పఱుపఁగోరెను. అట్టి పూర్వనాగరికాగ్రగణ్యుఁ డగ్రపీఠమున కనర్హుఁడని మఱియొకఁడు లేచి నిషేధించెను. ఈ ప్రకారముగా వీరు నియమించినవారిని వారు పనికిరారనియు, వారు నియమించినవారిని వీరు పనికిరారనియు, ఉభయపక్షములవారును రెండుగడియలు తగవులాడినపిమ్మట నుభయపక్షములవారు నంగీకరించినవా రొక్కరును దొరకకపోవుటచేత నాఁటికి సభ ముగియునట్లు

కనఁబడెను. ఇంతలో నొక బుద్ధిమంతుఁడు లేచి లంకానగరవాసులంద
రు నేఁడో యొకపక్షములోఁ జేరినవారగుటచేత వారిని విడిచి విదేశీ
యుఁడయి నిష్పక్షపాతబుద్ధి గలవాఁడయిన వాలఖిల్యమహర్షిని అగ్రాస
నాసీనునిఁజేసి సభసాగింపవచ్చునని యాలోచన చెప్పెను. ముల్లోకము
లను మ్రింగఁజాలిన దేవాంతక నరాంతకులవంటి మహాసమర్థులెంత
మంది స్వదేశస్థులుండఁగా వ్రేలికణుపు పెసు లేని యంగుష్ఠమాత్రశరీరు
నికి పరదేశస్థుని కగ్రపీఠమిచ్చుట యవమానకరమని దేశాభిమానులు
కొందఱాక్షేపించినను, అర్వాతరులు మఱియెవ్వరును దొరకనందున
పరస్పరజయకాంక్షులయి యున్న యుభయపక్షములవారిలో ప్రధాన
పురుషులు నాఁడే తమవిజయమును లోకవిశ్రుతము చేయవలెనన్న
నపేక్షచేత నన్నగ్రాసనాసీనునిగా నంగీకరించిరి. నేను సూక్ష్మకా
యుఁడనగుటచేత కుర్చీలోఁ గూర్చున్న పక్షమున నన్ను సభికులు చూ
డఁజాలరని యుపన్యాసకుని ముందుంచిన బల్లమీఁద నన్నుఁ గూరు
చుండఁబెట్టిరి. ఉపన్యాసకుని పేరు దీర్ఘరోముఁడని సభవారిలో నొక
రు నాతోఁ జెప్పిరి. అతఁడు వచ్చి బల్లముందు నిలువఁబడినప్పుడు మన
దేశపునరపరిమాణమునుబట్టి నీలిపగ్గములవలె మూఁడునాలుగు నిలు
వుల పొడవుగలిగి నేను గూరుచున్న బల్లనంటుచున్న యాతని గడ్డపు
వెంట్రుకల దీర్ఘత్వమునుబట్టి దీర్ఘరోముఁడన్నది సార్థకనామధేయ
మని నేను భావించితిని. ఉపన్యాసవిషయమును నేను సభవారికి
విన్నవించినపిమ్మట నుపన్యాసకుఁడు తనయుపన్యాసము నుపక్రమిం
చెను. మనవారు గ్రంథములలో మేఘగంభీరభాషణము లని వర్ణిం
పఁగా వినుటయేకాని పిడుగులుపడినట్లు కర్ణకఠోరముగా నాఁడాత
ని మాటలు చెవినిబడువఱకును మేఘగంభీరభాషణములయర్థము
నా కనుభవమునకు రాలేదు. ఆదుస్సహమయిన శ్రవణవిదారణదా
రుణశబ్దములకు తాళలేక నేను నా చెవులలో గుడ్డలు దోనుపుకొంటి

ని, ఆయుపాయముచేత సద్దణఁగినందునను బాడలికపుచేతఁ గలిగిన యాయాసముచేత నిద్రవచ్చినందునను నావెనుకనుంచిన దిండునకుఁ జేరగిలఁబడి నేను హాయిగా నిద్రపోయినాను. సభికులుమాత్రము నాగుట్టు తెలిసికోలేక నేను యోగముపట్టి యోగనిద్ర నవలంబించి దివ్యదృష్టి చేతను దివ్యజ్ఞానముచేతను నాటియుపన్యాసమునుమాత్రమే గాక జ్యోతిశ్శాస్త్రముయొక్క సత్యమునుగూడ గ్రహించుచున్నానని తలఁచిరి. అందుచేత నుపన్యాసముయొక్క ప్రథమభాగమును మీకుఁ దెలుపకపోయినను తప్పిదమును దీనిని జదువువారు మన్నింతురని నమ్మెదను. ఆవిషయమును తరువాత నితరులనడిగి తెలిసికొని మీకు తెలిపియుందునుగాక. అట్లు చేసినచో నాయోగమహిమకే భంగము కలిగి జనులలో శాస్త్రమునందవిశ్వాసము కలుగునన్న భీతిచేత నేనితరుల నడుగక శాస్త్రమర్యాదను కాపాడుటకు కంకణము కట్టుకొన్న మీరు నాసమయోచితబుద్ధిని శ్లాఘింతురన్న పూర్ణవిశ్వాసముచేత శాస్త్రగౌరవమును నిలువఁబెట్టినాను. నేను గాఢనిద్రలోనుండఁగా నుపన్యాసకుఁ డేదో ముఖ్యాంశమును జెప్పుచు బల్లమీఁద నొక గుద్దుగుద్దెను. ఆగుద్దుతో నన్నాశ్రయించియున్న నిద్రాదేవి భయపడి నన్ను ముందుకుఁ బడఁద్రోచి క్షణకాలములో నన్నువిడిచి పాఱిపోయెను. నేనును కన్నులు తెఱచిచూచి మెల్లగా లేచి మరల యథాస్థానముచేరి దిండువానుకొని సావధానచిత్తుఁడనై కూరుచుంటిని. అప్పుడు నన్నుఁజూచిన సభాస్తారు శ్రీమహామునియొక్క యోగనిష్ఠకు నడుమ భంగమువచ్చినదని కొందఱును, ఈమహర్షి తనంత తానే లేచినాఁడు కాని సమాధి చెడలేదని కొందఱును, సమాధి చెడినపక్షమున మౌనముద్రపూని ప్రాణాయామము పట్టి మరల యోగనిద్ర వహించునని కొందఱును, నానావిధములఁ జెప్పుకొనసాగిరి. ఇంతలో నుపన్యాసకుఁ డితరులమాటలు చెవిచొ

రకుండ తానే యుచ్చైస్స్వరముతో మాటాడఁజొచ్చినందున వారిమాటలు పూర్ణముగా వినుటకు నాకవకాశము లేకపోయినది.

ఉపన్యాసకుఁడు— ఈపాడుజ్యోతిశ్శాస్త్రము వివేకమును పాఱఁద్రోలి బుద్ధిని మ్రింగివేసి యాలోచన నడఁగఁద్రొక్కి తెలివిగలవారిని సహితము సమస్త విషయములయందును వంచకులయినమూఢులకు దాసులను జేయుచున్నది. శాస్త్రనామము ధరించిన యీపిశాచముయొక్క సమ్మోహనయంత్రములోఁ జిక్కి భ్రమపడి మనుష్యప్రకృతి కలంకారమయిన స్వాతంత్ర్యమును పోఁగొట్టుకొని మనమందఱమును నిష్కారణముగా బుద్ధిపూర్వకముగాఁ దెచ్చుకొన్న కష్టములపాలయి బాధపడుచున్నాము. మనమొకయిల్లు కట్టుకోవలెనన్నచో మనకిష్టమయిన తావునను సమయమునను కట్టుకొనక మూర్ఖసిద్ధాంతి చెప్పిన తావునను ముహూర్తమునను కట్టుకొనవలసినవారమగుచున్నాము; నుయ్యి త్రవ్వించుకోఁ దలఁచుకొన్నచో మన మనస్సువచ్చిన యనుకూలమైన తావున త్రవ్వించుకొనక మూర్ఖసిద్ధాంతి చూపిన మూలను త్రవ్వించుకొనవలసినవార మగుచున్నాము; మన బిడ్డకు పెండ్లి చేయఁదలఁచుకొన్నచో మనకనుకూలుఁడుగా కనఁబడు వరుని నిర్ణయించి వీలయినకాలమునందు వివాహము చేయక మూర్ఖసిద్ధాంతి పెట్టిన నిశాముహూర్తమునందో యెప్పుడో ప్రవర్తనచేతఁ గాకపోయినను జన్మపత్రముచేత నతఁడు మంచివాఁడన్నవరుని కిచ్చి పెండ్లి చేయవలసినవార మగుచున్నాము. మనమొక యూరికి పోఁదలఁచుకొన్నచో మనకు తీఱికయైన సమయమున బయలుదేఱక మూర్ఖసిద్ధాంతి చెప్పిన దినమునందును వారమునందును కాలమునందును ప్రయాణము కావలసినవార మగుచున్నాము; మనము క్షౌరము చేయించుకోఁ దలఁచుకొన్నచో మన కవకాశముగా నున్ననాఁడు చేయించుకొనక మూర్ఖసిద్ధాంతి చెప్పిన తిథివా

రములయందే తల గొఱిగించుకోవలసిన వార మగుచున్నాము. మనము క్రొత్తబట్టలు కట్టుకోఁదలఁచినచో కావలసినప్పుడు కట్టుకొనక మూర్ఖసిద్ధాంతి తెలిపిన దినమును వారమును వచ్చువఱకును వేచియుండవలసినవార మగుచున్నాము. వేయేల ? మనము క్రొత్తగా భార్యవద్ద పరుండఁ దలఁచుకొన్నను, గృహమునఁ బ్రవేశింపఁదలఁచుకొన్నను, రోగమునకు మందుపుచ్చుకోఁదలఁచుకొన్నను, మూర్ఖసిద్ధాంతియే మనకు కాలనిర్ణయము చేయవలెను. ఇట్టి నిత్యకృత్యములలోనే మనకు స్వాతంత్ర్యము లేనిచో లోకములో నింతకంటె క్రూరదాస్యము మఱియేముండును ? మూర్ఖసిద్ధాంతి—;

వృశ్చికరోముఁడు—మీరు మూర్ఖసిద్ధాంతియని లోకోపకారులయి మహావిద్వాంసులయిన జ్యోతిష్కులను నిర్హేతుకముగా దూషించి మహాదోషము కట్టుకొనుచున్నారు. ఈసిద్ధాంతులే యుండి వివాహాదికార్యములయందు మంచిముహూర్తములు పెట్టి లోకమునకుపకారము చేయనిచో లోకమెట్టి దురవస్థల పాలగునో—

ఉప—మీరుపన్యాసమధ్యమున మాటాడరాదు—

మహాకాయుఁడు—మీరు సిద్ధాంతులను మూర్ఖులని దూషింపరాదు.

త్రిశిరుఁడు—మీరిఁకముందు సిద్ధాంతికిముందు మూర్ఖశబ్దము పెట్టక మాటాడుఁడు.

ఉప—సిద్ధాంతులు లోకమునకుఁ జేయుచున్న యుపకారము చెప్పనక్కఱలేదు. లోకములోనున్న జాతకపత్రికలలోనెల్ల నుత్తమమైనదని చెప్పి యొకవరుని నిర్ణయించి మంచిముహూర్తము పెట్టి వివాహముచేయించి యీసిద్ధాంతి మంచిదోవతులచాపు కట్టుకొనిపోయిన మూఁడుమాసములపదిదినములలో జాతకపత్రికలోని నూఱేండ్లను ముహూర్తబలముచేత నూఱుదినములుగా మాఱఁగా నా

చెల్లెలు వైధవ్యదుఃఖ మనుభవింపవలసినదైనది. ఈసిద్ధాంతి చెప్పిన ముహూర్తమునందు కట్టించి, పెట్టిన సుముహూర్తమునందు గృహప్రవేశమయిన మాపొరుగువారు నెలదినములలోపల గృహయజమానుఁడు స్వర్గస్థుఁడుకాఁగా తా మాఱుమాసము లిల్లుపాడుపఱిచి పొరుగువారిపంచను జేరవలసినవారైరి. నామిత్రునితండ్రి యొన్నియోదినములాగి యీసిద్ధాంతి చెప్పిన ముహూర్తమునందు గ్రామాంతరమునకు బయలుదేఱినను త్రోవలో దొంగలు కొట్టఁగా బాడివిఱుగఁబడి కాలువిఱుగఁగొట్టుకొని యర్ధరాత్రమునందు మరల స్వగృహమును జేరవలసినవాఁ డయినాఁడు.

వృశ్చి—అయ్యలారా! చిత్తగించినారా? ఈయన నన్నెట్లు దూషించుచున్నాఁడో! మూర్ఖపదము ప్రయోగించినప్పటికన్నను, ఈదూషణభాషణము లధికకర్ణకఠోరములుగా నున్నవి. పెద్దమనుష్యులింతమందియుండి పండితదూషణ జరుగుచుండఁగా చూచి యూరకుండుట మీకు ధర్మమా? వారిగ్రహచారముచాలక యాపదలు తటస్థమయినప్పుడు నేనేమిచేయఁగలను? ముహూర్తములు పెట్టుట నాపనికాని యాపదలు తప్పించుట నాపనికాదుకదా?

త్రిశ—మీరు మంచిముహూర్తములు పెట్టుటచేత విపత్తులు తొలఁగనిపక్షమున మీముహూర్తములలో నేమిప్రయోజనము?

మహా—మధ్య మీరు మాటాడుట యుక్తముకాదు. సామాన్యముగాఁ జెప్పక వక్కాణించి యొక్కరినిగూర్చి చెప్పుట యుపన్యాసకునికి మంచిపనికాదు. జ్యోతిషమువలన లాభమే లేకపోయినపక్షమున నింతకాలమునుండి సర్వజ్ఞులయిన మనపెద్దలందఱును జన్మపత్రములు వ్రాయించుకొని సమస్తకార్యములకును శుభముహూర్తములు పెట్టించుకొనుచుందురా? వ్యవహారదక్షులయిన ప్రభుత్వమువారు వ్యవహార నిమిత్తము జ్యోతిషవిద్వాంసులను నియమించుచుందురా?

త్రిశి—వీరి వ్యవహార నిర్ణయమునందలి సత్యము మొన్న నే కదా సభలో బయలఁబడినది? కల్పవృక్షములవలె పండితు లయిదుగురుచేరి సభలోఁగూరుచుండి నేను గొనిపోయిన నగలపెట్టెను ధూమ్రాక్షుఁడు దొంగిలినట్లు సిద్ధాంతముచేసినారు.

మహా—అదియంతయు మోసము. నిజమైన వ్యవహారములో నిజము తెలియును గాని పరీక్షింపవలెఁని మోసముచేసిన వ్యవహారములో సత్యమెట్లు బయలఁబడును?

ఉప—నాయుపన్యాసము ముగియనియ్యరా?

మహా—కానిండి.

ఉప—లోకమునకుఁ గలిగెడియుపకారము లోకములోనివారైన యీసిద్ధాంతులకే కాని యితరలోకమున కణుమాత్రము గలుగదు. మనయింట కన్య రజస్వలయైనచో శాంతికావలెనో లేదో తెలిసికొనుటకయి ముందుగా సిద్ధాంతిగారికి దక్షిణముట్టవలెను; మనయింట నెవ్వరయిన పుట్టినపక్షమున పితృగండమున్నదో లేదో తెలిసికొనుటకయి ముందుగా సిద్ధాంతిగారికి దక్షిణముట్టవలెను; మనయింట నెవ్వరయిన చచ్చిరేని యిల్లు విడిచిపెట్టి లేచిపోవలయునో లేదో తెలిసికొనుటకయి ముందుగా సిద్ధాంతిగారికి దక్షిణముట్టవలెను. ఈప్రకారముగా పుట్టినది మొదలుకొని చచ్చువఱకును చెవులు కుట్టినను, పుట్టువెండ్రుకలు తీయించినను, అన్నము ముట్టించినను, చదువ వేసినను, మఱియేపనిచేసినను సిద్ధాంతిగారిచేత ముహూర్తము పెట్టించుకొని యాయనకు ముట్టవలసినముడుపు నెప్పుడో యొకప్పుడు చెల్లింపక తప్పదు.

మహా—మీరు సిద్ధాంతులను వారివృత్తిని నిందింపఁగూడదు. వారు జనులకు ఫలములు చెప్పియు ముహూర్తములు పెట్టియు పడిన ప్రయాసమునకు ప్రతిఫలముగా ధనస్వీకారము చేయుచున్నారు.

కాని యూరక చిల్లిగవ్వయైనను గ్రహించుచుండలేదు. చేతనైన పక్ష మున మీరు జ్యోతిశ్శాస్త్రి మబద్ధమనుటకు చాలిన యుక్తులను చెప్పుం డు. అప్పుడు మీహేత్వాభాసములను ఖండించుటకు మేము పూను కొందుము.

ఉప—ముహూర్తజాతక భాగము లసత్య మనుట కణుమాత్ర మును సందేహములేదు. ఈగ్రామనుండు ఇద్దరు రాజపుత్రులొక స్త్రీనిమిత్తమున గర్భశత్రువులయి యొకరి నొకరు చంపవలెనని నిశ్చ యించుకొని యిద్దఱును వేఱువేఱుగ జ్యోతిష్కునియొద్దకుం బోయి యు ద్ధ విజయమునకు ముహూర్తము పెట్టుమని యడిగిరి. ఇద్దఱు జ్యో స్యులును శాస్త్రవిచారముచేసి నాఁటిసాయంకాలము నాలుగు గడియ ల పొద్దుండఁగా శత్రువిజయమునకు మంచి సమయమని ముహూర్త ము పెట్టిరి. తనకే విజయము కలుగునని మొదటివాఁడును తనకే గెలుపు కలుగునని రెండవవాఁడును మనస్సులలో నమ్మి తాము జ్యోతిష్కుల నాలోచించిన మాట యొండొరులకు తెలియ నీ యక రహస్యముగానుంచి యుద్ధాహార్యములు మాత్రము చేసి కొని యిద్దఱును బయలుదేఱి ముహూర్తసమయమున కూరి బైలికి పోయి ఘటికాయంత్రములు ముందుంచుకొని సరిగా యుక్తసమయ మున దుడ్డుకఱ్ఱలతో యుద్ధమారంభించిరి. ఇద్దఱును పరస్పర జయకాం క్షచేత చావమోఁదుకొనఁగా నందొకఁ డప్పుడే దెబ్బలచేత కాలధర్మ మునొందెను. రెండవవాఁడు కంటికిదెబ్బతగిలించుకొని చావుతప్పి క న్నులొట్టబడి యొంటికంటితో బ్రతికెను. ఆమహాశూరు లెవ్వరో, వారికి ముహూర్తము పెట్టిన మహాసూరు లెవ్వరో మీరందఱు నె ఱుఁగుదురు. శాస్త్రమే యసత్యము కానిపక్షమున, ఏకముహూర్త మునందే యుద్ధ మారంభించినయొక్కరి కపజయమును నొక్కరికి జ యమును నేల కలుగవలెను? ఇంకొక్క నిదర్శనము చూపెదను. మా

పెద్దతమ్ముఁడును మాపాలికాఁపువాని పెద్దకొడుకును త్రుటికాలమైనను భేదములేక సరిగా నేకముహూర్తమునందే జననమొందిరి. జనన సమయమునం దిరువురకును గ్రహము లేకస్థానమునందే యున్నందున సమాన ఫలమునే యియ్యవలసినను, మావాఁడు చదువుకొని పరీక్షల నిచ్చి గొప్ప యుద్యోగము చేయుచుండఁగా మాపాలికాపుకొడుకు చదువ వెఱుఁగక పొలము దున్నుచు పేదదశయందే యున్నాఁడు. శాస్త్రిమబద్ధము కానిపక్షమున, ఏకసమయమునందే జననమొందిన యిరువురకును గ్రహములు విరుద్ధఫలముల నేల కలుగఁజేయవలెను? సిద్ధాంతులు చెప్పిన ఫలములు కొందఱికి సరిగా కలుగవచ్చును. అప్పుడును సహితమాఫలములు దైవికముగా కలిగినవే కాని సిద్ధాంతి యెఱిఁగి చెప్పుటవలనఁ గలిగినవి కావు. ఏఁబదియేండ్లు బ్రతుకునని జన్మపత్రికలలో వ్రాయఁబడియున్నవారు కొందఱంతకాలము జీవించినను, పలువురంతకులోపలను ముగ్గురు నలుగు రటు తరువాతనుగూడ మృతులగుదురు. ఈప్రకారముగానే కష్టములును సుఖములును దైవికముగా కొందఱికి చెప్పినట్లు కలిగినను పలువురకు కలుగవు. కార్యసాఫల్యమెప్పుడును యుక్తసమయమున తగినపని చేయుటవలనఁ గలుగునుగాని ముహూర్తమువలనఁ గలుగదు. ఇల్లు కాలుచున్నప్పుడు వెంటనే నీరు పోసినచల్లాఱును గాని ముహూర్తము నిమిత్తము వేచియుండినచో చల్లాఱదు. పాముకఱచినప్పుడు తత్క్షణమే విషవైద్యునికొఱకు పరుగెత్తి చికిత్స చేయించిన విషము దిగునుగాని ముహూర్తము నిమిత్తము వేచియుండినచో విషబాధ తగ్గదు. ఈవిధముగానే వ్యవసాయమునందైనను, వాణిజ్యమునం దైనను, మఱియేయితరవ్యాపారమునం దైనను ముహూర్తముల నిమిత్తము వేచియుండక యుక్తసమయమునందు కృషిచేసినప్పుడు మాత్రమే కార్యసాఫల్యమగును. మంచిముహూర్తమును నిరీక్షించుచు పనిచేయక యోగ్యసమయమును వ్యర్థపుచ్చి

నచో మేలు కలుగుటకు మాఱుగా కార్యవిఘాతము గలిగి కీడు మూడును.

మహా — మీరు చెప్పెడు మాటలు యుక్తికిని లోకానుభవము నకును శాస్త్రమునకును విరుద్ధముగా నున్నవి. మంచిసిద్ధాంతి శాస్త్ర ము చూచి యాలోచించి చెప్పినప్పు డొక్కయక్షర మైనను హెచ్చుత గ్గులు లేక ఫలములు సరిగా కలుగును. నాతమ్మునిజన్మపత్రమును మొన్న నే నొక సిద్ధాంతికి చూపఁగా వెనుక జరిగిన దంతయు పూస గ్రుచ్చినట్లు సరిగా నతఁ డేకరువు పెట్టినాఁడు. శనిమహాదశలో నాకు ప్రాణాంతకరమైన రోగము వచ్చునని ముందుగా నే నొకసిద్ధాంతి చె ప్పి తప్పించుకొనుటకు ప్రతిక్రియ చేసికొమ్మని యుపదేశింపఁగా, నే ను మెలఁకువపడి యుక్తసమయములో శనిగ్రహజపముచేయించి గ్ర హశాంతినిమిత్తము సంతర్పణము చేయించునప్పటికి నాకు రోగము రానేలేదు. జ్యోతిశ్శాస్త్రము నిజమనుట కింతకంటెను ప్రబల నిదర్శ నములు మఱేమి కావలెను ?

ఉప — మీరు సెలవిచ్చినవానిలో నొక్కటియు నిదర్శన మని చెప్పుటకు వీలుపడదు. గతము చెప్పుట యొకగొప్పకాదు. అట్లు చె ప్పిన దంతయు శాస్త్రజ్ఞానము వలననే చెప్పఁబడిన దనుటకును వలను పడదు. ఈజ్యోతిష్కులవద్ద సాధారణముగా లోకులసంగతులను తెలి సికొనివచ్చి గ్రహములకంటె సూటిగా రహస్యముగా గురువులకు తె లుపఁగలశిష్యు లుందురు అంతేకాక వారు తఱుచుగా మాయోపా యముల చేతను కొన్ని సమయములయందు ధనదానముచేతను కు టుంబములయందలి పరమ రహస్యములను సహిత మాకుటుంబములోని స్త్రీలవలనను పిల్లలవలనను సేవకులవలనను గ్రహించి యవి తమకు ప్రాణములేనిగ్రహములు చెప్పినట్టుగా చెప్పి వివర్శ లేనివారి కా శ్చర్యముగా కలిగింతురు. గ్రహపూజవలన మీకు రావలసినరోగముమా

రాక తప్పిపోయినట్లు మీరు సెలవిచ్చుచున్నారు. శాస్త్రమే నిజమ
యి దానివలన తప్పక రోగము రావలసియుండినపక్షమున రోగము
వచ్చి తీఱవలెనుగదా? గ్రహశాంతికయి సంతర్పణములు సమారా
ధనములు చేయుటవలన రావలసినయపాయము తప్పెననుట జ్యోతి
ష్కులును పురోహితులును చేరి స్వోదరపూరణార్థమయి పన్నిన
మాయోపాయము. నిజముగా రోగము వచ్చినపక్షమున, గ్రహచా
రము తిన్నగా లేక శాస్త్ర ప్రకారము వచ్చినదందురు. రోగము రాక
పోయినపక్షమున, నవగ్రహజపాదులవలనను సంతర్పణములవలనను
తప్పిపోయిన దందురు. ఈకపటోపాయమువలన జ్యోతిష్కులు చెప్పి
నఫలము తప్పిపోయినయెడల తమమీఁద నిందలేకుండ తప్పించుకొను
టకును, పురోహితులు మొదలయినవారి కందఱికి నుదరపోషణము
జరుగుటకును, మార్గము కలుగుచున్నది. అంతేకాక యాకాశమం
దలి యచేతనములైన గ్రహము లెక్కడ? సచేతనులైన జీవులకు ఫల
ములిచ్చు టెక్కడ?

మహా — మీకుయుక్తు లెంతమాత్రమును విశ్వాసార్హ మయి
నవి కావు. గ్రహములు జీవకోట్లకు తప్పక ఫలములిచ్చును. గ్రహము
లకును మనకును సంబంధము కలదనుటకు మీకు నేను కొన్ని ప్ర
త్యక్షనిదర్శనములు చూపెదను. చంద్రోదయాస్తమానములను బ
ట్టి సముద్రమునకు పోటును పాటును వచ్చుచుండుట మనకు ప్రత్య
క్షమే కదా? దీనికి మీరేమి చెప్పఁగలరు? అదిగాక పూర్ణిమ మొ
దలయిన పర్వదినములయందు వెఱ్ఱి మొదలయినరోగములు ప్రబ
లుచుండుట యనుభవసిద్ధము. గ్రహములకే మనరోగాదికమునువృద్ధి
చేయుట మొదలైన శక్తులు లేకపోయిన పక్షమున, అట్లేల జరగును.
దుర్ముహూర్తమునం దారంభించిన పనులు చెడుట నేను స్వానుభ
వముచేత నెఱుఁగుదును. నేను కొన్ని దినములక్రిందట బృహస్పతికాల

మునందు బయలుదేఱి దేవతాదర్శనమునకు వెళ్ళి పూజారులు దేవాలయముయొక్క తలుపులు తీయకపోఁగా దేవతాదర్శనము చేయకయే యెండలో మరల నింటికి రావలసినవాఁడనయినాను.

బృహస్పతికాలమనఁగా నేమో మనభరతఖండవాసులకు తెలియకపోవచ్చును. లంకలోఁ బుట్టినవారెల్లరును రాక్షసులగుటచేత రాక్షసుఁడైన రాహుగ్రహము వారికి శుభగ్రహము; దేవతాగురు వగుటచేత బృహస్పతి వారికి పాపగ్రహము. ఈదేశమునందు మనము రాహుకాల మశుభసూచకమని యెట్లెంతుమో యట్లె యాదేశమునందు వారు ప్రతిదినమును తొమ్మిదిగడియలకాలమును బృహస్పతికాలమని చెప్పి యాకాల మశుభసూచకముగా పరిగణించి యేకార్యమును జేయక విడుతురు.

ఉప — వేఁడియెండ కాసినప్పుడు తీక్ష్ణములయిన సూర్యకిరణములచేత నేయిమొదలయినవి కరఁగునట్లును మనదేహములకు తాపమెక్కునట్లును మొత్తముమీఁద చంద్రాదిగ్రహములు పదార్థములకు కొన్ని మార్పులను గలుగఁజేయఁ గలుగును; గాని యొకపదార్థమున కొకవిధముగాను మఱియొకపదార్థమునకు మఱియొకవిధముగాను మార్పులను గలుగఁ జేయఁజాలవు. ఎండలోఁ బెట్టినప్పు డన్నిగిన్నెలలోని నేయి కరఁగవలసినదే కాని యొకగిన్నెలోనినేయి కరఁగుటయు, నొకగిన్నెలోనినేయి కరగక పోవుటయు తటస్థింపదు. చంద్రోదయాదులనుబట్టి పోటుపాటులు సమస్త సముద్రములకును నేకరీతిగా కలుగునే కాని చంద్రోదయముచేత నొకసముద్రమునకు పోటును మఱియొకసముద్రమునకు పాటును గలుగవు. ఆవిధముగానే గ్రహాగతుల వలనను గ్రహస్థితులవలనను ఫలము గలిగెడుపక్షమున సమస్తజనులకు నేకఫలము కలుగవలెనే కాని వివిధజనులకు వివిధఫలములు కలుగుట యెన్నఁడును తటస్థింపనేరదు; కాఁబట్టి వివిధజనులకు వివి

ధఫలముల నిచ్చునని చెప్పెడు జ్యోతిశ్శాస్త్రము విశ్వాసార్హమైనది కాదు. బృహస్పతికాలమునందు వెళ్ళినవారికి కొందఱికి దైవికముగా కొన్ని సమయములయందు కార్యవిఘాతము కలిగినను కొందఱికి కొన్ని సమయములయందు కార్యసిద్ధి యగుటయుఁ గలదు. నే ననేక పర్యాయములు బృహస్పతికాలములో బయలుదేఱినను నాకు కార్యసిద్ధి యగుచునే వచ్చినది కాఁబట్టి కార్యసాఫల్యమునకుఁగాని కార్యవైఫల్యమునకుఁగాని, బృహస్పతికాలాదులు కారణములు కావు. న్ని కాలములు మంచివని కొన్ని కాలములు మంచివి కావని భావించి యుక్తకాలమునఁ బనికిఁబూనక వృథా కాలహరణమును జేసెడు మౌఢ్యమునుబట్టి పెక్కుకార్యములు చెడుచున్నవి. ప్రతిసంవత్సరమును శూన్యమాసములని కొన్ని మాసములు వ్యర్థపరుపఁబడుచున్నవి; మిగిలినమాసములలో శుభదినములు కావని కొన్ని దినములు వ్యర్థపఱుపఁబడుచున్నవి. శేషించిన తిథులలో మంచివారములు కావని కొన్ని వారములు వ్యర్థపఱుపఁబడుచున్నవి; ఆ యున్న కొన్ని వారములలో సహితము దుర్ముహూర్తమని, వర్జ్యసమయమని, బృహస్పతికాలమని, నక్షత్రము మంచిది కాదని, విశేషకాలము వ్యర్థపఱుపఁబడుచున్నది. ఈప్రకారముగా మూఢవిశ్వాసముచేత మంచి కాలమును వృథాగా పోఁగొట్టక యనుకూలకాలమునం దెల్లను పనులు చేయుచు వచ్చినచో దేశమున కెంతక్షేమము కలుగును?

వృశ్చి—ఇది యెంతయు శాస్త్రదూషణము. శాస్త్రనిందచేత నెంతయైనపాపమున్నది. ఏమయ్యా? వాలఖిల్యా! అగ్రాసనాధిపత్యము వహించి శాస్త్రతిరస్కారము జరుగుచుండఁగా చూచుచు నూరకున్నావేమి?

మహా—అగ్రాసనాసీనుడు తనయభిప్రాయమును జెప్పి దూషణమాన్పవలెను. ఇప్పుడు నాకు గొప్పచిక్కు తటస్థమయినది. ఇక మాటాడక యూరకుండుటకు వలనుపడదు. మాటాడినచో నెవ్వరి పక్షమున నేను చెప్పిన కోపావేశముచేత మూర్ఖరాక్షసు లెవ్వ రేమి చేయుదురో! అయినను నేను బుద్ధిమంతుడ నగుటచేతను, పరమ ప్రమాణములైన మనశాస్త్రములు వచ్చి సమయములో నాకు తోడుపడుటచేతను, ధైర్యము తెచ్చుకొని యెవ్వరిమనస్సును నొవ్వకుండ సమయోచితముగా నిట్లంటిని—

“ఓ సజ్జనాగ్రగణ్యులారా! దూషణ యెవ్వరికిని కూడదు. అందులోను ముఖ్యముగా జ్యోతిశ్శాస్త్ర దూషణ కూడదని మీశాస్త్రములుమాత్రమే కాక మాశాస్త్రములును భేరీధ్వనితో ఘోషించుచున్నవి. జ్యోతిష్కులమాటలను గాని జ్యోతిశ్శాస్త్రమునుగాని పరిహసించినవారు తామిస్రనరకములో పడుదురని వరాహమిహిరులవారు బృహత్సంహిత రెండవ యధ్యాయములో సెలవిచ్చియున్నారు. అయినను దీర్ఘరోమములవా రిప్పుడు చెప్పుచున్నది పరిహాసము కానందున శాస్త్రదూషణమని చెప్పుటకు వలనుపడదు. చెప్పెడిదంతయు పూర్ణముగావినక యిది యిట్టిదని నిర్ధారణము చేయుటయు మంచిదికాదు. కాబట్టి సభవారు దయచేసి వారు చెప్పెడిదంతయు పూర్ణముగా విని తరువాత వారివాదమును ఖండించి తమపక్షమును సిద్ధాంతము చేయబూనవలెను.”

వృశ్చి—అవి తప్పక దూషణ వాక్యములే. ఇటువంటి మాటలు మనము విననుకూడదు; ఇతరులను చెప్పనియ్యనుకూడదు.

మహా—ఈవఱకు కొంత విన్నాముగనుక కడముట్టవిని యీ యుక్త్యాభాసములను ఖండించి యెల్లవారికిని భ్రాంతినివారణముచేయుదము. జ్యోతిశ్శాస్త్ర మబద్ధమని యిటువంటివారు లక్షమంది లక్ష

యుపన్యాసము లిచ్చినను, ఎవ్వరును నమ్మరు. జ్యోతిశ్శాస్త్రములో చెప్పినట్లు సంతానము కలుగుచుండ లేదా? కలిగిన సంతానమునకు విద్యాబుద్ధులు వచ్చుచుండ లేదా?

ఉప.—మీరు సంతానమనుచున్నారుగనుక చెప్పెదను వినుఁడి. మా పెద్దన్నగారి జన్మపత్రములో నాతని కాలుగురు పుత్రులు కలుగునట్లున్నది; ఆయనభార్య జన్మపత్రికలో సద్దలు కొడుకులును ముగ్గురు కూఁతులును కలుగునట్లున్నది. ఆయన వృద్ధుఁడగుటను భార్యకు ముట్లుడిగినను వారి కీవరకును సంతానయోగ్యత కలుగు చిహ్నములేవియుఁ గానరాకున్నవి. ఈప్రకారముగానే నామిత్రుల జన్మపత్రముల ననేకములను శోధించి చూడఁగా సంతానవిషయమున వానిలోఁ జెప్పఁబడినదానికిని సరిగా జరిగినదానికిని మిక్కిలి వ్యత్యాసము కనఁబడుచున్నది. ఇఁక విద్యావిషయ మన్ననో యంతకంటెను తారుమారుగా నున్నది. ఈవఱకు నేను జెప్పినప్రకారముగా నాచిన్నన్నగారికుమారుఁడును పాలికాఁపువానికుమారుఁడును సరిగా నేకలగ్నమందును, ఏకముహూర్తమునందును, ఏకతారయందును, పుట్టినవారయినను మాయన్నగారి కుమారుఁడు పండితుఁడగుటయు పాలికాఁపువానికుమారుఁడు నిరక్షరకుక్షి యగుటయు మీరందఱు నెఱుఁగుదురు. దీనికి మీరేమి సమాధానము చెప్పఁగలరు? ఇదంతయు నేల? మనకు సమీపమునందే హిరణ్యాక్షద్వీప మున్నదిగదా? అక్కడ వసించువారందఱును మూఢులయి మనుష్యభక్షకులయి యనాగరికులుగా నున్నారు. అక్కడివారనేకులు విద్వాంసులు కావలసినముహూర్తములలోఁ బుట్టినను వారిలో నొక్కరికిని విద్య యన్న వాసనయే లేక యందఱును జ్ఞానశూన్యులుగా నున్నారు. నేనీపని నిమిత్తమయి యక్కడకుఁ బోయి యనేకులజన్మపత్రములను వ్రాసికొనివచ్చి చూచినాను. చేతనైనపక్షమున నీవైపరీత్యమునకు కారణమేమో జ్యోతిష్కులను చెప్పుమనుఁడు.

వృశ్చి—జ్యోతిశ్శాస్త్రము ద్వీపమునకు చెల్లదు.

మహా—విశ్వాసహీనులకును నిరక్షరకుక్షులకును గ్రహము లు సహితము ఫలములను కలిగింపవు.

ఉప—ప్రత్యక్షవిరోధము చూపినను చూడనొల్లక కన్నులు మూసికొని జ్యోతిశ్శాస్త్రము సత్యమని చెప్ప నిశ్చయించుకొని వచ్చినవారిముందఱ యుక్తివాదమువలన కంఠశోషణము కలుగుటతప్ప వేఱుప్రయోజనము కలుగదు. ఈపాడు జ్యోతిశ్శాస్త్రము మనదేశమునకెంతహానినైనను జేయుచున్నది. కొందఱు సిద్ధాంతులు చెప్పినయాయుఃపరిమాణమును నమ్మి తమకు చావుసమీపించిన దనుకొని బెంగపెట్టుకొని నిష్కారణముగా దీర్ఘవిచారమును కొన్ని సమయములందు మరణమునుకూడ పొందుచున్నారు. కొందఱు సిద్ధాంతులు రోగాదికము వచ్చునని చెప్పినమాటలునమ్మి రోగములు వచ్చినప్పుడు బాధపడుటకు మాఱుగా రానిరోగములనిమిత్తము మనోవ్యథచెంది వానిని తప్పించుకొనుటకయి తమవిత్తమును వంచకులపాలు చేయుచున్నారు. శిశువులు పుట్టిననక్షత్రములనుబట్టి సిద్ధాంతులు చెప్పినమాతృగండములను పితృగండములను మాతులగండములను భ్రాతృగండములను విశ్వసించి శిశుహత్యలను గూడ జేయించుచున్నారు. అనేకులు సిద్ధాంతులు చెప్పినయోగములు నమ్మికొని దుర్భ్రమలు పడి కాలము వ్యర్థపుచ్చి తుద నాశాభంగము పొంది వ్యాకులపడుచున్నారు. ఒకజ్యోతిష్కుడు మనయూరిలో నొక కాపువానివద్ద ధనము స్వీకరించి వానికి తోటలో చెట్టుమొదట పాతు దొరకునని చెప్పగా వా డొకటితరువాత నొకటిగా చెట్లమొదళ్లెల్లను త్రవ్వి యెందును ధననిక్షేపమును గానక చెట్లు చచ్చుటచేత దరిద్రుడయి మున్నున్నది సహితము పోగొట్టుకొని కలకాలము దుఃఖపడవలసినవా డయ్యెను. ఇట్లనేకనిదర్శనములు కనబడుచున్నను

జనులు తమమూఢ విశ్వాసమును విడువఁజాలక సూర్యచంద్రాదిజడ పదార్థములవలనఁ దెలిసికొని ఫలములను జెప్పెదు మన్న మహాత్ము లకు బానిసలయి బుద్ధిపూర్వకముగా కష్టములకు తల యొగ్గుచున్నా రు. మనమనసువచ్చినప్పుడు కన్నబిడ్డకు పేరుపెట్టుకొనుటకును, క్రొత్త తలగుడ్డ ధరించుకొనుటకును, క్రొత్తనగ పెట్టుకొనుటకును, పొలమును దున్నుకొనుటకును విత్తనములు చల్లుకొనుటకును, పండి నపంట కోసికొనుటకును, గుఱ్ఱమునో గోవునో కొనుటకును, మందు పుచ్చుకొనుటకును, ప్రభుదర్శనము చేయుటకును విజ్ఞాపనపత్రికను పంపుకొనుటకును, ఇటువంటి మఱియేయల్పకార్యమును చేయుటకు ను కూడ స్వతంత్రులముకాక మనము సమస్తమునకును, మింటనుం డు గోళాకారము గల నోరులేని జడపదార్థములు చెప్పినట్లే నడు చుకోవలసినయెడల లోకములో నింతకంటె బానిసతనము మఱియే ముండును ? ఓయగ్రాసనాసీనా ! ఇది మనము కోరి తెచ్చుకొన్న బానిసతన మగునో కాదో నీవు చెప్పుము. దురభిమానముచేత మాహారు తెలిసియు తెలియనట్లు నటించినను పక్షపాతమును దురభి మానమును లేని నీవైన సత్యము చెప్పుము. ఈపాడునమ్మకము మను ష్యులహృదయము లలో ననావశ్యకము లయినభయములను, విచార ములను, బాధలను తెచ్చిపెట్టుచుండలేదా ? ఇది పలుమారు దురా శలను కలిగించి క్రమమైనప్రయత్నమును మాన్పుచుండలేదా ? ఇది ప్రజలయొక్క మందునంటి బుద్ధిని పదటఁగలిపి వారిని జడవస్తువులను నమ్మి పొట్టపోసికొనువారికి దాసులనుగాఁ జేయుచుండలేదా ? ఓమ హార్షి ! నీమానము చాలించి యీప్రశ్నలకు సదుత్తరము చెప్పు.

వెనుక సభవారు నన్ను హెచ్చరించినప్పుడు నేను తనకనుకూ లముగాఁ జెప్పుట చూచి యీదీర్ఘరోముఁడు నేను శాస్త్రప్రమా ణబద్ధుఁడ నైనశిష్టాచారపరాయణుఁడ నన్న సత్యము తెలిసికోక నేనే

మో తన కనుకూలముగా నుత్తరము నిచ్చునని భ్రమపడి యిప్పుడీ ప్రశ్నలు వేసెను. అప్పు డీదీర్ఘరోముండు చెప్పినదానిలో శాస్త్రదూషణ మంతగా లేదని చెప్పినదానిని బట్టియే ప్రాచీనాచారపరాయణులయిన సభవారందఱును మనసులో నామీఁద కొఱకొఱగా నుండుట బుద్ధి మదగ్రగణ్యుఁడ నగుటచేత నేనావఱకే కనిపెట్టి యున్నవాఁడను గాన మహాజనుల యనుగ్రహమునకు మరల పాత్రుఁడ నగునట్లుగా—"ఓయి దీర్ఘరోమా! త్రికాలవేదినైన నేను సత్యము పలికెదను వినుము. నేనిప్పు డంతరదృష్టిచేతఁ జూచి యథార్థమును కరతలామలకముగా గనిపెట్టినాను. శాస్త్రమెప్పుడును లవలేశమైన నబద్ధము కాదు. జ్యోతిశ్శాస్త్రము పరమసత్యము. సత్యము నందాదరముగల శాస్త్రబద్ధులయిన యాస్తికులందఱును శాస్త్రవిశ్వాసముచేత నీవిప్పుడు చెప్పినవిగాక యింక వేయిరెట్లుకష్టములు వచ్చినను వానికన్నిటికి సహింపవలెను. మనకు శాస్త్రము ప్రమాణము గాని బుద్ధి ప్రమాణము కాదు. ఈసత్యమును శిష్టులందఱు—" అని చెప్పుచుండఁగా దీర్ఘరోముఁడు నావంక కన్ను లెఱ్ఱచేసి చూచి నానోటనున్న వాక్యమైనను ముగియకమునుపే తనముందు బల్లమీఁదనున్న నన్ను కుడిచేతితోఁ బట్టుకొని పయికెత్తి నోట వేసికొని గుటుక్కున మ్రింగెను. చూచితిరా? అక్రూరరాక్షసుఁడెంతపనిచేసినాఁడో! ఎంతచదువుకొన్నను రాక్షసులకు మనుష్యభక్షణముచేయు స్వభావగుణము విడువదుగదా? మహోపాయసంపన్నుఁడ నగుటచేత నాతనినోటఁబడి నేను కాఁబట్టి బ్రతికి బయలఁబడితిని గాని సామాన్యమానవుఁడైనపక్షమున నంగుష్ఠప్రమాణముగల వాని జఠరాగ్ని కాహుతి కావలసినవాఁడే. నేను సూక్ష్మబుద్ధి నగుటచేత వాఁడు నన్ను తనగొంతుకలోనికి చొప్పింపఁగానే తిన్నగా లోపలికిపోవక యందుండి యేమిచేయుదునా యని యాలోచింపఁ జొచ్చితి

ని. అప్పుడు నాకు గరుత్మంతుఁడు మ్రింగిన కిరాతకాంతనుంచుకొన్న బ్రాహ్మణోత్తమునివలె గొంతుకలోనుండి నుండి పయికి వత్తునాయని నొకయాలోచన కలిగినది. రామరావణయుద్ధమునందు కుంభకర్ణుఁను కపులను మ్రింగినప్పుడు వారు నవరంధ్రములలోనుండియు వెడలి వచ్చినట్లు వెడలి వత్తునా యని యొకయాలోచన కలిగినది. కంఠనాళమునుండి గర్భములోఁ బ్రవేశించి యక్కడ జరుగుచుండు విశేషముల నెల్లను కన్నులార చూచివచ్చి జీవించియున్న పురుషుని యుదరములో నేమేమి విచిత్రములు నడుచుచుండునో తెలిసి సత్యము తెలియక చిక్కులుపడుచున్న యిప్పటి శారీరశాస్త్రజ్ఞులకు జ్ఞానోపదేశము చేయుదునా యని యొకయాలోచన కలిగినది. ఇట్లు నాకప్పు డనేకములైన యూహ లుత్పన్నములు కాఁగా దీర్ఘవిచారము చేయక వేగిరపడి కార్యనిశ్చయము చేయుట బుద్ధిమంతుల లక్షణము కాదని యెఱిఁగినవాఁడనయి దీర్ఘముగా నాలోచించి, గర్భకుహరము ప్రవేశించిన పక్షమున నపవిత్రమైన మలద్వారమున పయికి వెడలవలసి యుండునుగాన బ్రాహ్మణుఁడనైన నాకది తగదని శారీరశాస్త్రజ్ఞుల కుపకారము చేయుపనిని విడిచిపెట్టి, శ్వాసకోశములను శోధించి వైద్యశాస్త్రజ్ఞుల కుపకారము చేయవలెనని నిశ్చయించి గొంతుక్రిందనున్న ప్రాణద్వారమునఁబోయి తిన్నగా నూపిరితిత్తులలోఁ బ్రవేశించితిని. అక్కడ నాయిష్టదైవమైన ముఖ్యప్రాణదేవుఁడు నాకు దర్శనమిచ్చి తనభక్తుని నిట్లు చేసినందుకయి కోపముచేతనో యన నన్ను తత్క్షణమే తనబలముకొలఁదిని బయికిఁ బంపివేసెను. వాయుబలముచేత నేనప్పుడాకాశబాణమువలె పయికెగసి బయలఁబడి యేప్రకారముగానో క్షణకాలములో నాతని శ్మశ్రువుల నడుమఁ జిక్కుకొని యక్కడనుండి యుట్టిచేగులలోనుండి యొకక్రిందికి ప్రాఁకిన ట్లుగా సిలిపగ్గములవంటి గడ్డపువెండ్రుకలు పట్టుకొని మెల్లగా క్రిందికి

దిగఁబాఱి బల్లమీఁద నాయథాస్థానము చేరి మరల నగ్రాసనాసీనత్వము వహించి కూరుచుంటిని. నేనప్పు డారాక్షసుని నోటినుండి పయికి వెడలితినో ముక్కునుండి పయికి వెడలితినో చెప్పలేనుగాని మఱి యే యితర మార్గమునుండియు వెలువడలేదని మాత్రము దృఢముగాఁ జెప్పఁగలను. నేను పయికి వచ్చునప్పటి కానష్టరాక్షసుఁడు మెతుకు గొంతుకఁబడి పలకఁ బాఱినప్పుడు మన కగునట్లుగా క్రిందిగ్రుడ్డు మీఁదికిని మీఁదిగ్రుడ్లు క్రిందికిని వచ్చినవాఁ డయి యుక్కిరిబిక్కిరి యయి దగ్గుచు వెంటనే ప్రయాసపడెను. నిష్కారణముగా సజ్జన సంతాపము చేసినవారి కాపదలు ఘటింపక యీశ్వరుఁడు సహించి యూరకుండునా ? నేను సురక్షితముగా పయికి వెడలివచ్చుట చూచి సభాస్తారు లందఱును నామహిమ కత్యద్భుతపడి నేను నిజమయిన మహర్షి నని నమ్మిరి. సూక్ష్మరూపుఁడనయిన నేను హనుమానునివలె తపోమహిమచేత స్థూలరూపము నొంది యానష్టరాక్షసుని పొట్ట చీల్చుకొని పయికి రానందునకయి సభవారిలో ననేకులు నాదయాగుణమును వేయినోళ్ళ శ్లాఘించిరి. ఆయజమానుఁడు నావద్దకు పరుగెత్తుకొనివచ్చి వాత్సల్యముతో నాదేహము తడి నొత్తి నాతడిబట్టలు తీసివేసెను. నామహాత్త్వముచేత నాద్వీపమునందు నాఁటినుండియు జ్యోతిశ్శాస్త్రము నిరపాయముగా స్థిరపడినది. జ్యోతిశ్శాస్త్రమే సత్యము కానిపక్షమున, కాదన్న వానిగర్భములోఁ జొచ్చి వానిని ప్రాణావశిష్టునిజేసి నిరపాయముగా పయికి రాఁగలుగుట మనుష్యమాత్రునకు సాధ్యమగునా యని యెల్లవారును సంతుష్టులయిరి. మాపక్షమువారు తమవాదము గెలిచినదని జయజయధ్వనులతో బయలు వెడలఁగా నాఁటికి సభ ముగిసినది. ఇప్పటివలె గుటుక్కున మ్రింగక యేక్రూరరాక్షసుఁడయినను నన్ను పండ్లసందునఁ బెట్టుకొని నమలివేయు నేమోయన్న భయముచేత మహాకాయుఁడుగా రటు

తరువాత నెప్పుడును నన్నే సభకును దీసికొని పోలేను. ఓ హిందూ మహాజనులారా! మీవాండ్రొకండు బయలుదేఱి దేశదేశముల వెంటం బోయి యిక్కడ మీకుపిప్రియతమమైన జ్యోతిశ్శాస్త్రమును స్థిరపఱిచి యాచంద్రార్కమైన శాశ్వతకీర్తిని పొందఁగలిగినందునకు మీరును నమందానందము పొందుఁడు.

ఆఱవ ప్రకరణము.

ఆనాఁటినుండియు నాకీర్తి లంకాద్వీపమునందు దిగంత విశ్రాంతముగా వ్యాపించినది. పడిపోవుచున్న జ్యోతిశ్శాస్త్రమును నిలువఁబెట్టితినని విద్వాంసులు వేయినోళ్ళ శ్లాఘింపఁ జొచ్చిరి. జ్యోతిషమును పునరుద్ధారణముచేసి దేశమునకు మహోపకారము చేసినందునకయి కవీశ్వరులు నామీఁద పాటలను పద్యములను జేసి ఈశ్వరుని యవతారముగాను నన్ను స్తుతింపఁ జొచ్చిరి. ఇఁక నామ హిమలను విని యానందించి యింటింటను నాచిత్రచరిత్రమును కథ గాఁ జెప్పుకొనుచు పామరులు చేసిన స్తోత్రపాఠములకు పరిమితి యే లేదు. పామరుల నోళ్ళనుండి స్త్రీల చెవులసోఁకి సూతులవద్దను శిశ్యులవద్దను జరుగు మహాసభలలో చిత్రవిచిత్రముగా పెరిఁగి స్త్రీలనోళ్ళలోనుండి శాఖోపశాఖలుగా వ్యాపించి యంతఃపురములు చేరునప్పటికి నామహిమలు నిజముగా కోటిగుణితము లయినవి. కొందఱు నేను సింహికగర్భములోఁ జొచ్చి కాయము పెంచిన హను మంతునివలె నా కాయమును పెంచితినని చెప్పుకొనఁ జొచ్చిరి. కొందఱు నేను సురసగర్భములోఁ జొచ్చి యంగుష్ఠమాత్రశరీరుండై బయలువెడలిన హనుమంతునివలె సూక్ష్మాతిసూక్ష్మమగు రూపమును

ధరించితినని చెప్పుకొనఁ జొచ్చిరి; కొందఱు నేను శుక్రాచార్యుల గర్భమును చీల్చుకొని వెలువడిన కచునివలె దీర్ఘరోముని గర్భగోళమును భేదించుకొని వచ్చి యాతనిని మృతసంజీవనీవిద్యచేత మరల బ్రతికించితినని చెప్పుకొనఁజొచ్చిరి; కొందఱు నేను దీర్ఘరోముని పాదములు మొదలుకొని శిరస్సువఱకును నడిమికి రెండు చీలికలుగా చీల్చి తరువాత జర యనురాక్షసి జరాసంధునియర్ధదేహముల నొకటిగా సంధించినట్లుగా రెండు ఖండములను మరల నతికించి మంత్రప్రభావముచేత పునర్జీవితుని జేసితినని చెప్పుకొనఁ జొచ్చిరి. ఇట్టి కథల నన్నిటిని పూర్ణముగా వివరించినచో నొక్క పెద్దపురాణము కావచ్చునుగాని స్వోపకర్షమును జెప్పుకొనుట యిష్టము లేనివాఁడ నగుటచే వానిని నే నభివర్ణించుట మాని నాయపూర్వమహిమలను లోకోపకారార్థముగా పురాణరూపమున రచియించి యాచంద్రార్కముగా లోకమున వ్యాపింపఁజేసి మనమహర్షులవలె శాశ్వత కీర్తిని సంపాదించుకొనెడు పుణ్యమును భక్తాగ్రేసరులకు విడిచి పెట్టుచున్నాను. నాఁటినుండియు నన్ను దర్శింపవచ్చుభక్తులయొక్కయు భక్తురాండ్రయొక్కయుసంఖ్య దినదినాభివృద్ధి నగుచువచ్చెనదన్న సత్యమునుబుద్ధిమదగ్రగణ్యులయిన మీకు నేనువిన్నవింపవలసినయావశ్యకమే లేదుగదా? అయినను మీకింకొక సత్యమును మాత్ర మిప్పుడు విని పింపవలసి యున్నది. లోకములో మనుష్యుఁడు గొప్పవాఁడయిన కొలఁదిని గొప్పతనముతోఁ గూడ కష్టములును పెరుఁగుచుండును. భక్తులయిన వారు స్వప్రయోజనపరు లయి స్వలాభముకొఱకు రాత్రియుంబవళ్లుఁ పీడించుచుందురు; అసూయాపరుల యినవారు పరోత్కర్షమును సహింపలేక యపవాదములను వేసి బాధించుచుందురు.

లంకాద్వీపము నందు ప్రాచీనాచారసంస్థాపకనిష్ఠులయిన శిష్టులందఱును నన్ను సనాతనసదాచారములను స్థాపింప నవతరించిన

ఈశ్వరాంశ సంభూతునిగా భావించి బహిష్కరింపఁ జొచ్చినను, జ్యోతిశ్శాస్త్రమును రూపుమాప దీక్ష వహించి బద్ధకంకణులయి విఫల మనోరథులయిన నవనాగరికులు నన్ను ద్వేషించి నాయశస్సునకు భంగము కలిగించుటకును నాకపాయము కలిగించుటకును నానావిధములఁ బ్రయత్నించుచుండిరి. ఆ రాక్షసుల క్రౌర్యము నెఱిఁగి నా యజమానుఁడయిన మహాకాయుఁడుగారు నాఁటినుండియు నన్ను సభలకుఁ దీసికొని పోవుట మానివేసిరని యీవఱకే చెప్పియున్నాను గదా! ఆపదలు రానున్న కాలమున నంతఃపురములలోఁ దాఁచి సహస్రభటులను కావలియుంచినను రాకమానవు. ఆపదలు రారాని కాలమునందు సముద్రమధ్యమునందుఁ బడవైచినను రావు. నాయజమానుఁడు తన యింట నన్నెంత సురక్షితముగా నుంచి కాపాడుచుండినను, ఒక నాఁటిరాత్రి నాకొక్క ఘోరవిపత్తు సంప్రాప్తమయినది. ఓచదువరులారా! విధివిధాన మప్రతివిధానమగుట తెలిసికొని నావిషయమయి మీరు చింతిలఁబోకుఁడు.

ఒకనాఁటియర్ధరాత్రమునందు నేను నాపాన్పుమీఁద సుఖనిద్ర చేయుచుండఁగా నానడుమెవ్వరో పట్టుకొని నొక్కుచున్నట్టు యులికిపడి లేచితిని. లేచి కన్నులు తెఱచి చూచునప్పటి కేదోజంతువు నన్ను నడుము మొదలుకొని మెడవఱకును నోటఁ గఱచుకొని పోవుచున్నట్టు దీపము వెలుతురున కనఁబడినది కాని యాజంతు వేదో యానవాలు తెలిసినది కాదు. ఆభయములో నన్ను వ్యాఘ్రి మీఁచ్చుకొని పోవుచున్నదని భ్రమకలిగినది కాని ప్రక్కలనుండి దాని కాళ్ళు నల్లగా కనఁబడినందున వెంటనే యాభ్రమ నివారణమయినది. అటు తరువాత నది భల్లూకమో వరాహమో యని తలఁచి యరణ్యములో నుండఁదగిన యాజంతువులు నట్టింటి కెట్లువచ్చునాయని వితర్కింప నారంభింపఁగా నింతలో [illegible] పొడిచి నట్లుగా నొప్పునకు కోఱమో

కటి గుచ్చుకొని తీవ్రవేదనను కలిగించినది. ఆవేదనకు భయము తోడ్పడి నన్ను కొంతసేపు మూర్ఛలో ముంచినందున నావల నేమి జరిగినదో నేను చెప్పలేను. మూర్ఛతేఱి నేను మరల కన్నులువిచ్చి చూచునప్పటికి చుట్టును నంధకారబంధురముగా నుండెను; ఎచ్చటఁ జూచినను నాకంటి కేదియు కనఁబడ లేదుగాని నా ముక్కునకు మాత్రము మురికికాల్వలలోనుండి వచ్చునట్టి దుర్గంధము గుప్పున కొట్టుచుండెను. దానినిబట్టి నన్నా జంతువు మాయింటివారి తూము కాల్వలోనుండి యీడ్చుకొని పోవుచున్నదని నేనూహించినాను. ఇట్లనుకొనుచుండఁగానే నాకా సుగంధభుక్తి కలిగినది కాని యాసౌఖ్యమును చిరకాలముండినది కాదు. జంతువు నన్ను నోటఁగఱచుకొని మాయింటివారి తూముకాల్వలోనుండి వీధిలోనికీడ్చుకొనివచ్చి కొంత దూరము నడచినతరువాత మరల నధికదుర్వాసన గల మఱియొకరి తూము కాల్వలోనుండి మఱియొకరియింటిలోనికిఁ గొనిపోయి దీపము వెలుఁగుచున్న యొకగదిలో నన్ను క్రింద దింపినది. ఇదియంతయుఁ జూచి యీకపటకృత్యమంతయు నాకు శత్రువులుగా నున్న కామరూపులయిన యానవనాగరికులపని యని నేను మనస్సులో నిశ్చయించుకొన్నాను. దీపము వెలుఁగున నన్నీడ్చుకొని వచ్చిన జంతువును నల్లగా నాకంటికి స్పష్టముగాఁ గనఁబడినది. దానిని జూచునప్పటికి నామేను నిలువునను జెమర్చి కంపమొందఁ జొచ్చినది. అది మనదేశమందలి యేనుఁగుబంటియంత యున్నది; ఏనుఁగుగొడ్డునకువలె దాని శరీరమంతటను బొచ్చులేదుగాని వరాహమునకున్నట్లుగా మెడ మీఁదమాత్రము దబ్బనములవలెఁ బయికి నిక్కఁబొడుచుకొనియున్న దీర్ఘరోమములున్నవి. మీరయిన పక్షమున దానిని పెద్ద యడవి పందియని భ్రమించియుందురుగాని యాదేశపుజంతువులపరిమాణముల నెఱిఁగియున్న నే నప్పుడొక్క నిమిషములో నది పందికొక్కని

యది మాంసభక్షకజంతువు గాదని యాతనివలన నెంత సంతోషించినాను. అప్పుడొక్క మహాయోగిని నన్నుం గొనిన ప్రాణిజంతువు నన్ను నట్టింట దిగవిడిచి తానొక కిటికీనుండి వెలుపలికిం బోయెను అంతట సమస్తాభరణభూషితురాలయియున్న యొక కాంత మంచముపైనుండి దిగి వచ్చి మిక్కిలి చందనపుబొమ్మను పట్టుకొనినట్లుగా నన్ను తనకుడిచేతిలో పట్టుకొని రెండవ చేతిలోని యంగవస్త్రముతో నాశరీరమంతయు తుడిచి నన్ను తన మంచముమీఁదఁ గూర్చుండఁబెట్టి తానును నా కెదురుగాఁ గూరుచుండెను. కాళికాశక్తివలె నెదురఁ గూరుచున్న యామె మొగమును జూడఁగానే నామనస్సులో పలువిధములగు నాలోచనలు పుట్టఁ జొచ్చెనవి. నాశత్రువు లెవ్వరైన నన్ను బాధించి చంపుటకయి యిట్లు తెప్పించి యుందురని మొట్టమొదటఁ దోఁచినది తరువాత నొకటి తరువాత నొకటిగా ననేకాలోచనలు కలిగిన పిమ్మట కట్టకడపట రాక్షసాంగనయైన యామె నన్ను మోహించి బాణాసురుని కూతురైన యుషాకన్య యనిరుద్ధుని చిత్రరేఖచేతఁ దెప్పించుకొన్నట్లుగా నన్నీ యూషకరాజుచేతఁ దనయొద్దకు రప్పించుకొని యుండునాయని సంశయము తోఁచినది. తరువాత మాయిరువురకును నడిచిన సంభాషణమును బట్టి నాయీకడపటియూహయే సిద్ధాంతమగునట్లు మీరిప్పుడే తెలిసికొనఁగలరు. ఆకాంత యత్యాతురపడి చూచుచున్న నాకు తన్ను దెలుపుకొని, తనపేరు త్రిజటయగుట చెప్పి యిట్లనియెను—

త్రిజ—ఓరుషివర్యా! నావంక వెఱఁగుపడిచూడకు. ముల్లోకములనుజయించిన సార్వభౌముని వంశములోని రాజకన్యకు జీవితేశ్వరుని గావించి ధన్యుని చేయుతలంపున నిన్నిటకు రావించితిగాని హానిచేయుతలంపున రప్పింపలేదు. ఇంద్రుని జయించి యింద్రజిత్తని పేరొందిన మేఘనాదుఁడను రావణపుత్రునకు నేను మఱఁదలను.

సత్య—అమ్మా! నీకు నామీఁదఁగల యనుగ్రహముచేత నేను నిజముగానే ధన్యుఁడనయినాను. నాపేరు సత్యరాజాచార్యులు. నేను ఋషివర్యుఁడన్న పేరున కర్హుఁడనుగాను.

త్రిజ—నీపేరేదియైనను గానిమ్ము; నీవొక్క ఋషివరమాత్రమే కాక యంగుష్ఠమాత్ర శరీరులయి నిరంతరమును సూర్యరథముచుట్టు ను తిరుగుచుండెడు క్రతుపుత్రులైన యఱువదివేల వాలఖిల్యులలో నొక్కఁడవనికూడ నేనెఱుఁగుదును. ఇఁక నావద్ద నేమియు దాఁచఁబోకు.

సత్య—మీరట్లన్న నేనేమి చెప్పఁగలను?

త్రిజ—ఏమియుఁ జెప్పనక్కఱలేదు. ఇఁక రాత్రియెంతో లేదు. మాటలతో వృథాకాలహరణము చేయక కార్యాంశమును వినుము. నీయొక్క మహామహిమలను నాచెలికత్తెలవలన విని నీకు వలచి చిక్కినదానను. గాంధర్వవిధిని వరించి యిప్పుడే నన్ను చరితార్థు రాలిని జేయుము.

సత్య—అటువంటిమాటలు మీరు సెలవియ్యఁగూడదు.

త్రిజ—దీనురాలనయి ప్రార్థించుచున్న నాకోరిక వ్యర్థపు చ్చుట మీకు ధర్మముకాదు. మీఋషులయొక్కయు దేవతలయొక్క యు గుట్టంతయు నేనెఱుఁగుదును. వారు రాక్షసస్త్రీలమాట య టుండఁగా తిర్యగ్జంతువులతో సంభోగించుటకు సహితము సంశ యింపలేదు.

సత్య—సంశయింపనివారెవ్వరు? మహర్షులా?

త్రిజ—ఒక్క మహర్షులుమాత్రమే కాక వారి దేవతలును సం శయపడలేదు. మందపాల మహర్షి లావుకపిట్టతో సంభోగించి సం తానము కనెను. విభండకమహర్షి లేడిని పొంది ఋశ్యశృంగుడను కొడుకును గనెను. మీవాయుదేవుఁడు కేసరియను వానరుని భార్య వలన హనుమంతుని గనెను. సూర్యుఁడశ్వమును జేరి యశ్వినులను

గనెను. శ్రీకృష్ణుఁడు జాంబవంతుఁడను భల్లూకరాజుయొక్క పుత్రికను వరించెను. దేవేంద్రుఁడును సూర్యుఁడును ఋక్షవిరజుఁడను మర్కటమును కామించి వాలిసుగ్రీవులను గనిరి. మీవారిగుట్టు నాకు తెలియదనుకొన్నావా?

ఈమాటలను నప్పటికా రాక్షసియొక్క పురాణపరిజ్ఞానమునకు నాకత్యాశ్చర్యము కలిగినది. మన పురాణములలోని రహస్యములిన్ని యీయువతి కెట్లు తెలిసినవో! శ్రీరాములవారికి తరువాత నే నొక్కఁడను దక్క భరతఖండవాసులు మఱియెవ్వరును లంకాద్వీపమునకు వచ్చియున్నట్టు నేను వినియుండలేదు. ఇఁక నెవ్వరీమెకీగాథను జెప్పియుందురు? ప్రపంచమునందంతటను లోకానుగ్రహార్థముగా తిరుగుచుండెడు హిమాలయభ్రాంత లయిన మహాత్ములెవ్వరో యీమెను శిష్యురాలినిగా నంగీకరించి గుప్తవిద్య నీమె కుపదేశించి యుందురు. ఇది నిశ్చయము కాకపోయినయెడల లంకాద్వీపములో నంతఃపురములయందుండెడు రాజకన్య కిట్టి శాస్త్రమర్మము లెట్లు తెలియును? ఎటువంటి మహాత్ములు చెప్పినను పరదేశస్థులకు మన వారి మహిమలు సవిస్తరముగాఁ దెలియవు. ఈమె చెప్పిన విషయములలో నెన్నో ప్రమాదవచనము లున్నవి. ఊర్వశిని జూచుట చేత స్నానము చేయుచున్న విభాండకమహర్షికి జలములో వీర్యపతన మగుటయు లేడి యానీరు త్రాగి గర్భముధరించి ఋశ్యశృంగుని కనుటయు తెలిసికొలేక విభాండకుఁడు లేడిని పొందినట్లు చెప్పినది. ఋక్షవిరజుఁడు నీటిలో మునిఁగి వానరస్త్రీయైనప్పుడింద్రసూర్యులు కామించినసంగతి తెలియక వారు పురుషరూపముతోనున్న ఋక్షవిరజుసనే కామించినట్లు చెప్పినది. ఇట్టి వ్యత్యాసములనుగూర్చి నాలో నే నాలోచించుకొనుచుండఁగా నారాక్షసాంగన కొంతసేపూరకుండి మరల ప్రశ్నలు వేయుట కారంభించినది.

త్రిజ—ఓమనుసిందార్! నేనడిగినదానికి ప్రత్యుత్తరము చెప్పక మౌనముధరించి యూరకున్నావేమి? శీఘ్రముగా సమ్మతిని తెలుపు సదుత్తరమును జెప్పుము.

సత్య—నేనేమని యుత్తరము చెప్పఁగలను? వారు మహర్షులును దేవతలునయియుండుటచేత వారికట్టి పనికయినను సామర్థ్యము కలిగినది. మనుష్యమాత్రుఁడ నయిన నాకెట్లుకలుగును?

త్రిజ—నీవు నిజముగా మనుష్యుఁడవయినను సందేహింప వలసినపని లేదు. రాక్షసస్త్రీలను వివాహము చేసికొన్న మనుష్యులును మీలో ననేకులున్నారు. భీముఁడు హిడింబ యనురాక్షసితో సంభోగించి ఘటోత్కచుని గనెను. ప్రద్యుమ్నుఁడు వజ్రనాభదైత్యుని కూఁతురైన ప్రభావతిని బొంది పుత్రునిగనెను. అనిరుద్ధుఁడు బాణాసురపుత్రియైన యుషాకన్యను వరించెను. ఇఁక మాఱు మాటాడక స్థూలరూపమును ధరించి నన్ను కృతార్థురాలిని జేయుము. కామరూపములను ధరించి యిష్టకామోపభోగములను పొందిన మీఋషులమహిమలు నాకిదివఱకుముగాఁ దెలియును.

సత్య—పూర్వకాలపు మహర్షులవద్దనే కాని యిప్పటివారి కటువంటి శక్తులు లేవు. కామరూపమును వహించు సామర్థ్యము నావద్ద లేదు.

త్రిజ—నీమాట నేను నమ్మను; ఆలస్యముచేసి స్త్రీహత్య కొడిగట్టక స్థూలరూపమును పొందుము. తెల్లవాఱఁబోవుచున్నది. మంచిమాటలచేత నాప్రార్థనను వినవుపక్షమున బలాత్కారముగానైన నామనోరథము తీర్చుకొనెదను. కొన్నిదినములక్రిందట నీవు దీర్ఘరోమునిగర్భములోఁ జొచ్చి నెక్కసముగా పెరిగి పొట్టచీల్చుకొని పయికి వచ్చినకథ నేను వినలేదనుకొన్నావా ? ఇఁక నావద్ద నీమాయమాటలు మాని నీకామరూపమహిమచేత స్థూలాకారమును ధరింపుము.

అప్పుడు నాకేమిచేయుటకును తోఁచలేదు. బ్రాహ్మణులకు రాక్షసస్త్రీని గాంధర్వవివాహమున కలియుగమునందు స్వీకరింప వచ్చునా యన్నధర్మసందేహమొక్కటి నామనస్సును బాధింపఁజొచ్చినది. రాక్షస స్త్రీలను వరించినభీమాదులు క్షత్రియులు; అది ద్వాపరయుగము. ఈధర్మసందేహమును విడిచి లంకాద్వీపమునందు మనధర్మశాస్త్రముతో పనిలేదని యంగీకరించి యొప్పుకొన్నను, మనదేశము నందలి గ్రామదేవతలను సహితము పొత్తులలోని చంటిపిల్లలను గా గణింపఁదగినంత మహాకాయము గల యీ రాక్షసికి వరుఁడు కాఁదగినంత పొడుగు నేనెట్లుకాఁగలను? ఆచిన్నది యిది గాంధర్వవివాహమని చెప్పుచున్నను నాదృష్టికిది కేవలరాక్షసవివాహముగాఁ బొడకట్టుచున్నది. మనదేశములో కన్యను వరులెత్తుకొని పోవుటధర్మము; ఈ రాక్షసవివాహమున కన్యయే వరునెత్తుకొని వచ్చుట తటస్థించినది. హా! దైవమా! నేనేమి చేయుదును? కామదేవుఁడు కల్పించిన యీయాపద నెట్లు తప్పించుకొందును? ఎంతచదువుకొన్నను స్త్రీలబుద్ధి యెప్పుడును పెడదారినే పోవునుగదా? మహావిద్వాంసులారా! ఈచిన్నదానికి నన్ను తనంత స్థూలరూపము వహించుమని నిర్బంధించుటయేకాని తాను నాకుఁదగిన సూక్ష్మరూపమును ధరింపవలెనన్న యాలోచన తోఁచినదికాదు. ఇక్కడ నింకొక ధర్మసూక్ష్మత యున్నది. రతిసమయమునందు స్త్రీలు నిజరూపమున పొందుదురని పెద్దలు చెప్పుదురు. అది యాలోచించియే యీయామె నన్ను స్థూలరూపము పొందుమని నిర్బంధించుచున్నదేమో! రాక్షసవిగ్రహములుగల హిడింబాదులను పొందునప్పుడు భీమాదు లేమిచేసిరో! ఓభరతఖండవాసులారా! మనుష్యులైన భీమాదులే పెరిగి రాక్షసరూపమును ధరించిరో, రాక్షసులైన హిడింబాదులే చిక్కి మనుష్యరూపమును ధరించిరో, పురాణములను శోధించి నాకు తెలుపుఁ

డుః నేనీయూహలనుకొనుచుండఁగా త్రిజట నామీఁద చేయివేసి వేగిరము స్థూలరూపము పొందుమని నన్ను నొక్కెను. అప్పుడు నాబ్రతుకు సింహపుపెండ్లికొడుకు కాలిక్రిందఁ బడి నలిగిన యెలుక పెండ్లికూతురుబ్రతుకు కాఁగా, ఆనఖక్షతమునకు సహింపలేక నేను ఛావుగని పెద్దపెట్టున నేడ్చితిని. ఆకూఁత విని వెలుపలినుండి యెవ్వరో "అమ్మాయీ! ఆపిల్లికూఁతయెక్కడిది ?" అనియడిగిరి. ఏమియు లేదని చెప్పి త్రిజట యెవ్వరైనను వచ్చి చూచిపోదు రన్నభయముచేతఁ గాఁబోలును నన్ను మంచముమీఁదినుండి దింపి గోడమూలనున్న మందసము తాళముతీసి నన్నందులోఁ బెట్టి మగల తాళమువేసెను. ఆమందసము చిన్నగదియంత యున్నది. తాళముచెవి పెట్టు రంధ్రము గవాక్షమంత యున్నందున లోపలికి తగినగాలి వచ్చుచుండుటచేత నే నాయాసపడక యొకబట్టమడతమీఁద నొరిగి కొంచెముచేపు నిద్రపోయినాను. ఆనిద్రలో మహాకాయముగల వానర మొకటివచ్చి నన్నెత్తుకొని పోవుచున్నట్లు కలగని యులికిపడిలేచితిని. స్వప్నములో కోఁతినిగాని వరాహమునుగాని చూచినపక్షమున భయముకలుగునని స్వప్నశాస్త్రాభిజ్ఞులగు పెద్దలు చెప్పుదురు గదా! ఈ కల వేకువజామున వచ్చినదగుటచే నెలదినములలోనే దానిఫలము కలుగునని నేను మఱింత భయపడఁజొచ్చితిని. "దుస్స్వప్నే దుర్జనస్పర్శే స్నానమేవ విధీయతే" యన్న శాస్త్రప్రకారముగా స్నానము చేయవలెనన్నను పెట్టెలో మూయఁబడి యుండుటచే నాకదియు సాధ్యమైనదికాదు.

శ్లో. రామం స్కందం హనూమంతం వైనతేయం వృకోదరం
శయనే యః స్మరే న్నిత్యం దుస్స్వప్నం తస్య నశ్యతి.

అన్నశ్లోకమును నేను రాత్రి పరుండఁబోవునప్పుడు పఠింప మఱచిపోయిన దోషముచేత నాకీదుస్స్వప్నము సంప్రాప్తమయినది. కామరూపులయిన రాక్షసులయొక్క యీదేశమునందు దీనికేమి ప్రతిక్రి

య చేయవలెనో తెలియకున్నది; ఈపెట్టెలోనుండి ముందుగా నీవలం బడినంగదా తరువాత ప్రతిక్రియమాట యాలోచింపవలెను? నాశత్రువు లెవ్వరేరూపమును ధరించివచ్చి నా కేయపాయమును సేయుదురోయని నాయుల్లము తల్లడిల్లుచున్నది. హా! దైవమా! ఏమిచేయుదును? కామరూపమునుపొందు శక్తిని మాభరతఖండవాసుల కెప్పుడును ప్రసాదింపకుము. ఈకామరూపధారణము దుష్టులకు మాయవేషములు వేసికొనివచ్చి సాధువులకు హానిచేయుట కొఱకేకాని మంచివారి కేసత్కార్యములు చేయుటకొఱకును నావశ్యకమైనదికాదని నాకిప్పు డనుభవము వలనం దెలియుచున్నది.

ఏడవ ప్రకరణము.

ఆపెట్టెలో నే నొకబట్టమడతమీఁదఁ గూరుచుండి పైని చెప్పినట్లు నాలో నే నాలోచించుకొనుచుండఁగా నేదో తేలుకుట్టినట్లు నా నడ్డిమీఁద నొకపోటుపొడిచినది. ఆపోటుతో నాధ్యానమంతయు చెడినందున నిప్పుతొక్కిన కోఁతివలె నొక్క యెగురెగిరి యులికిపడి లేచి నాలుగుమూలలను గంతులువైచుచు నిది యేదుస్స్వప్నఫలమని భయపడుచు ముందుకు తిరిగిచూచునప్పటికి నాకన్నులయెదుట మన మూషకమంత జంతువొకటి మహాభయంకరముగా గానంబడెను. అది యెలుకవలెనున్నను దానికి తోఁకగాని వెనుకవైపునకాళ్ళుగాని యేమియులేవు; అవయవరహితమై తోలుకప్పిన యెముకలులేని నల్లనిమాంసపుముద్దవలె నున్న యాచరమకాయమే దానిశరీరములో నాలుగింట మూఁడువంతులున్నది; ద్రాక్షసారాయము పోసిన తోలుతిత్తివ

నుబ్బి మొత్తగానున్న, యాచరమకాయమునకంటె దానిలో చతురాంశమంతయున్న పూర్వకాయమున్నది; ఆపూర్వకాయమునకు ప్రక్కకు మూఁడేసి చొప్పున రావణాసురుని భుజములవలె నాలుకాళ్ళున్నవి; దక్షప్రజాపతిమెడ కతికించిన మేషశిరస్సువలె చిన్నదిగానున్న దానిశిరస్సున కిరుపార్శ్వములయందును పట్టుకారులవలె రెండుడెక్కలున్నవి; దాని దేహచ్ఛాయ యమవాహనమైన మహిషచ్ఛాయనుబోలి నామనస్సున కప్పు డంధకాసురుని స్మరణకు తెచ్చినది. నాకన్నులయెదుట నట్లు నిర్భయముగా నిలువఁబడిన యాజంతువు పయికి మత్కుణమువలె కానఁబడినను అది కామరూపప్రభావముచేత నట్టిరూపమును వహించిన ఘోరరాక్షసుఁ డయినందునను సందేహము లేదు. విద్వన్మహాసభలో నేనట్లు ప్రతిపక్షుల నోడించి జ్యోతిశ్శాస్త్రము నాచంద్రార్కముగా నిలువఁబెట్టిన నాఁటినుండియు పరాజితులయిన క్రూరరాక్షసులు నామీఁద పగపట్టి నానావిధమాయవేషముల చేత నాకపాయముచేయఁ జూచుచున్నారు. ఆదేశమునందలి జ్యోతిశ్శాస్త్రమహిమచేత నేఁటిరాత్రి నేనీపెట్టెలోనుందునని ముందుగాఁ దెలిసికొని నాకు హానిచేయవలెనన్న ద్రోహబుద్ధితో వచ్చి యెవ్వఁడో యొక రాక్షసుఁడు నాకంటె ముందుగానే పెట్టెచొచ్చి దాఁగియున్నాఁడు, అట్లు కానియెడల తాళము వేసిన పెట్టెలోని కాజంతు వెట్లువచ్చును? వచ్చినను మత్కుణరూపము నేల ధరించును? ధరించినను నేను వచ్చినదాఁక దాఁగియుండి దొంగవలె నేమఱుపాటున మీఁదఁబడి నన్నేల కఱచును? ఇన్ని హేతువులనుబట్టి యాజంతువు రాక్షసుఁడగుట నిశ్చయము. అయినను నాకిప్పు డీరాక్షసుని పేరు తెలియనందున నిజమైనపేరు బయలఁబడువఱకును మన కథాంశము నిమిత్తము నేనాతని మత్కుణాసురుఁడని పిలిచెదను. నేను భూదేవుఁడ నన్నయంశము మీకు తెలిసినదే కదా? దేవతలు రాక్షసులను తారసిల్లి నప్పుడు

మహాయుద్ధము సంభవించుననియు మీరెఱుఁగుదురు. మనుష్యాశనుఁడగుటచేత నన్ను మ్రింగవలెనని యీరాక్షసుఁడే మొట్టమొదట నామీఁదఁబడెనో దుష్టశిక్షణము చేయవలెనని నేనే మొట్టమొదట రాక్షససంహారమునకు పూనితినో వీరావేశపరవశుఁడ నయి యుండుటచేత నేను నిశ్చయముగాఁ జెప్పలేనుగాని మాయిరువురకును జరిగిన యుద్ధము దేవాసురయుద్ధమును మించినదనిమాత్రము దృఢముగాఁ జెప్పఁగలను. అరంభదశలో కొంతసేపు మాయిరువురకును బాహాబాహిని నఖానఖిని దంతాదంతిని ఘోరయుద్ధము జరగినది. నాగకుమారుని మీఁదికి దుముకు గరుత్మంతునివలె నే నారాక్షసునిమీఁదికి కుప్పించి యురికి నా రెండు బాహువులతోను వాని బాహువొకటి యొడిసిపట్టి శ్రీకృష్ణులవారు గోవర్ధనగిరి యెత్తినట్టు పయికెత్తి గిరగిర త్రిప్పి నేలమీఁద వేసి కొట్టఁబోయితిని. కాని యీరాక్షసుఁడు క్రిందఁబడక మాయచేసి తన బాహువులతో నాచేయిఁ గట్టిగా పట్టుకొని వదలక కత్తులవంటి తన డెక్కలతో నాకుత్తుక కత్తిరించవలెననియో యమపాశములవంటి తన బాహుపాశముల నాఱింటిని నామెడ కొక్కసారిగా చుట్టి బిగించి యూపిరి వెడలనీయక ప్రాణములు గొనవలెననియో దక్షిణ భుజముమీఁదుగా నాకంఠసమీపమునకు ప్రాకఁ జొచ్చెను గాని నేనింతలో మెలఁకువపడి మోచేతివద్దికి పరుగెత్తునప్పటికే యెడమచేతితో నే నారాక్షసుని కాలుపట్టుకొని నేలమీఁద మోఁది సింహనాదము చేసితిని. నాసింహనాదముయొక్క దారుణధ్వనిచేత దిగ్గజముల చెవులకు చెవుడు పట్టియుండును; ఆకాశమునుండి గవ్వలవలె నక్షత్రములన్నియు నేలమీఁద రాలియుండును. నేనప్పు డాపెట్టెలో నిర్బంధింపఁబడి యుండుటచేత పయికివచ్చి చూడలేకపోయితినిగాని లేప మొదల క్రిందిరాలిన నక్షత్రములను కొన్నిటి నేటి మూటకట్టి తెచ్చి నామాటకు నిదర్శనముగాను నాపౌరుషప్రకటన మగునట్లుగాను మీ

కుంజూషి మీ కష్బుతము కలిగించియుండును. నేను విసరివైచినప్పు డారాక్షసుఁడు పర్వతమువలె నేలఁగూలియు చావక బట్టమడత మీఁదపడి మరలలేచి మహావేగముతో నావంక పరుగెత్తుకొని రాఁజొచ్చెను. నే నెదురుగాఁబోయి కుంజరముమీఁదికి కుప్పించు సింహామువలె రాక్షసునిమీఁదికి లంఘించి కాలి కొలఁదిని నొక్కతన్ను తన్నితిని. ఆతన్ను తగిలియున్నయెడల వాఁడు పొట్ట పగిలి చావవలసినవాఁడే. కాని యారాక్షసుఁడు తన మాయాబలముచేత నాపాదఘాతమును తప్పించుకొని ప్రక్కకు తొలఁగెను. ఆపదతలాఘాతముచేత పెట్టియంతయు నదిరి పర్వతగుహావలె మాఱుమ్రోగెను. నాకాలితాఁకున పెట్టె క్రిందికిదిగి పెట్టెతోఁగూడ భూమి పాతాళమంట కృంగుటచేత నాఁడు శేషునితలల కెంతో నొప్పికలిగి యుండును. అతఁ డాదుర్భరవేదనచేత శిరసు కదల్చినప్పుడు భూకంపము కలుగక మానదు. ఓభరతఖండ వాసులారా! శాలివాహనశకము ౧౮౮౬ వ సంవత్సరము మార్చి నెల యేడవ తేదినిగాని దానికి కొన్ని దినము లీవలావలనుగాని భూకంపము కలిగినదేమో స్మరణకుఁ దెచ్చుకొనుఁడు. ఆకాలమునం దెక్కడనైనను భూకంపము కలిగినట్లు మీదృష్టికి వచ్చినను వార్తాపత్రికలయందు చదివినను పెద్దలవలన వినినను స్వప్నములయందు జూచినను, అది నా పాదతాడనముచేతనే యైనదని గ్రహింపుఁడు. ఎన్నివిధములచేత విచారించినను మీకాభూకంపవార్త గోచరము కానిపక్షమున, మీరు మన పంచాంగములను జదివి వానియందైనను జూచి జ్యోతిషశాస్త్రమహిమకు సంతోషింపుఁడు. ప్రక్కకు తొలఁగిన యారాక్షసుఁడు బట్టమడత చివరవఱకును పరుగెత్తి యక్కడనుండి మరలి మరల నావంకకు నడువ నారంభించఁగా నేను వెనుకకుఁబోయి పార్శ్వభాగమునకువచ్చి యొక్క కాలొడిసిపట్టి ద్వంద్వయుద్ధమున కారంభించితిని. భీమదుర్యోధనులకు జరిగిన ద్వంద్వయుద్ధమువలె మాపోరాట

ము మహాఘోరముకాగాఁ రాక్షసుఁడు ధర్మయుద్ధమున నన్ను గెలువ లేక యధర్మయుద్ధమున కారంభించి నాకాలు కఱువఁ బోయెను. నే నాకాటునకు భయపడక ధైర్యమువిడువక పట్టినపట్టు వదలక నట్టిట్టు గదలక విష్ణుమూర్తియొక్క పంచాయుధములవంటి నఖములతోఁ జీల్చి వానివజ్రకాయమును ఛేదింపలేక తుదకు వాఁడుప్రదేశించిన మార్గమునే యవలంబించి దంతము ఉపయోగించితన గదాఘాతమున భీముఁడు సుయోధనుని తొడలు విరుగఁగొట్టినట్లు కఱుక్కునకొఱికి నాముని పండ్లతో వానికాలొక్కటి తొడవఱకు రెండుఖండములు చేసితిని. ఈప్రకారముగా యుద్ధమునంతను వర్ణించినపక్షమున భారత రామాయణములంత గ్రంథము పెరుగునని భయపడి యాపనిని పురాణకర్తలకు విడిచి నేనిక్కడ మాసమర పర్యవసానమును మాత్రము చెప్పెదను. శ్రీరాములవారు రావణాసురుని వింశతి బాహువులను నఱికినట్లును శ్రీకృష్ణులవారు బాణాసురుని సహస్ర బాహువులను నఱికినట్లును నేనామత్కుణాసురుని మూఁడు బాహువులను దంతాదంతిని నఖానఖిని యుద్ధముచేసి నఱికి నాయసహాయ శూరత్వమును జూపితిని. అప్పుడు రాక్షసుఁడు దేవేంద్రుని వజ్రాయుధముచేత రెక్కలు తెగి పడినపర్వతమువలె కదల మెదల నేరక కూలఁబడెను. ఈలోపల ప్రభాతసమయ మగు చుండెను. అది రాక్షసులకు మంచి సమయముకాదని యెఱిగినవాఁడనయి వెంటనే మీఁదఁబడి కాలికొలఁదిని పొట్ట మీఁద త్రొక్కితిని. ఆదెబ్బతో మనుష్యరక్తపానముచేసి బలిసియున్న వానిపొట్ట పగిలి చిమ్మనగొట్టములతోఁ గొట్టినట్లు బుస్సుమని రక్తధారలు పయికెగసి నామొగమునఁబడెను. పరశురామునివలె క్షాత్రమును పూని శత్రుసంహారముచేసి పెట్టెలో నెత్తురుమడుగులు చేసినను, ఆరక్తము కంటఁబడఁగానే బ్రాహ్మణధర్మమైన దయాగుణము మరలవచ్చి నన్ను క్షణకాలము మూర్ఛలో ముంచెనుగాని నేనంతలో తె

లివి తెచ్చుకొని మరల శత్రువువంకఁ జూచితిని. శత్రు వప్పటికిని జావఁ తనడెక్కల నాడించుచుండెను. అగ్ని శేషమును ఋణశేషమును శత్రు శేషమును నుండఁగూడదని రాజనీతివేత్తలు చెప్పుట స్మరణకుఁ దెచ్చు కొని నేనప్పుడు నారెండుచేతులతోను రాక్షసుని రెండుడెక్కలను బ ట్టుకొని శ్రీకృష్ణులవారు బకాసురుని చీల్చినట్లు నిలువునఁ జీలఁజూచితి నిగాని యీలోపలనే నాభుజబలాతిశయముచేత వానిడెక్కలు నడి మికి విఱిగిపోయినవి. అంతట రాక్షసుఁడు విగతాసుఁడయినాఁడు. అ ప్పుడు దేవతలు నామీఁద పుష్పవర్షము కురిసియుందురుగాని పెట్టె లోనుండుటచే దానినిజూచి యనుభవించు భాగ్యము నాకన్నులకు కలి గినదికాదు. మహాపుణ్యప్రదమైన యీమత్కుణాసురవిజయకథను శ్రద్ధతోఁ జదివినవారును భక్తితో విన్నవారును పద్యకావ్యమునుగా రచించి లోకమున ప్రసిద్ధపఱచినవారును మూఁడులోకములయందును మత్కుణబాధనుండి విముక్తులగుదురు.

శ్లో. మవర్ణాది మకారాంతమ్ సతమ్ కువర్ణ సంయుతమ్
  అదంతణకారోపేతమ్ ఏతన్మంత్రం విదుర్బుధాః.

పరమగోప్యమైన యీమత్కుణమహామంత్రమును పరమవి శ్వాసములో నిత్యమును జపించువారికి సమస్తపిమబాధలును తొలఁ గును.

మత్కుణాసురవధానంతర మారాక్షసునిదేహమునుండి యొక విధమయినదుర్గంధము బయలువెడలి నాఘ్రాణేంద్రియమునకుదుస్స హము కాఁజొచ్చెను. ఆదుర్గంధసముద్రమునుండి వెలువడుసాధన మెట్లాయని నాలో నేనాలోచించుచుండఁగా నింతలో మారణకోలాహ లముచేత మెలఁకువవచ్చియో పెట్టెలోని బట్టను దేనినైన తీసికొనవల సివచ్చియో మఱి యేహేతువుచేతనో త్రిజట మంచము దిగివచ్చి పె ట్టెతాళముతీసి మూఁతపయికెత్తెను. అందువలన పయినున్న వాయుదే

వృద్ధుడు లోపలికివచ్చి దుర్వాసనను కొంతతొలఁగించి భర్తుఁడనైన నాక
పరిమితసుఖప్రదాయకుఁ డయ్యెను. ఇంతలో త్రిజట పెట్టెవద్దఁ గూరు
చుండి లోపల తొంగిచూచి బట్టమడతమీఁద మడుగు కట్టియున్న రా
క్షసునిరక్తప్రవాహమును గని యీమొత్తములక యెట్లయినదని వాసన
చూచి యీనల్లి పోతుదని పలుకుచు మత్కుణాసురుని కళేబరముతీక
దూరముగా విసరివైచెను. ఆమెవిగ్రహమును జూచి భయపడి యొసి
మూల నొదిగియున్న నన్ను చేతితో బట్టుకొని కొంచెము పయికెత్తి
"ఓవాలఖిల్యా! ఇంతటనైనను నీవు స్థూలరూపమును ధరించి
నామనోరథమును సఫలముచేయుము. రాక్షసాంగనాపరిగ్రహము
వలన నీకు పాపములేదు. పూర్వము మీభూలోకములో చంద్రవంశ
పురాజయిన యయాతి వృషపర్వుఁడను రాక్షసరాజకూఁతురైన శర్మి
ష్ఠను వరించి వంశకర్తయైన పూరుఁడులోనుగాఁగల కొడుకులనుగన్న
వార్త మీపురాణములయందువినలేదా? మాఱుపలుకవేమి?"
అని తనవ్రేళ్లతో నాప్రక్కలు నొక్కెను నే నాబాధకు తాళలేక
యింతకుముందే మత్కుణాసురునితోడి సంగరమునందు నఖానఖిని
దంతాదంతిని పోరాడి గడితేఱియున్న రసికుఁడ నగుటచేత నాకన్య
యొక్క పాణిగ్రహణముచేసి యామృదుహస్తముమీఁద నఖక్షత
దంతక్షతములను జేసితిని. నవోఢయగుటచే నాసుందరి నారసికత్వమును
గ్రహింపలేక కెవ్వన కేక వేసి చేతిలోనున్న నన్ను క్రిందవిడిచి పెట్టెను.
భాగ్యముచేత నేను బట్టమీఁదపడ బట్టిగాని యంతయెత్తునుండి పెట్టె
కొయ్యమీఁద నేపడుట తటస్థించినపక్షమున నాతల రెండువ్రక్కలయి
యుండును. ఆచిన్నది కెవ్వన కేక వేయఁగానే లోపలనుండి యెవ్వరో
"అమ్మాయీ! అట్లు కేకవేసితి వేమి?" అని యడిగిరి. "ఏమి
యులేదు ఎలుక" అని త్రిజట యుత్తరమిచ్చెను. "ఎలుక నిన్ను కఱ
చినదా యేమి? ఎలుకకాటువలన విష మెక్కును. ఎక్కడ కఱ

చినది ?" అని పలుకుచు నొకయంగన లోపలికివచ్చెను. ఆమె వచ్చు టచూచి వెంటనే పెట్టెమూఁత వైచి తాళమువేసి త్రిజట "అమ్మా! యెలుక నన్ను కఱువలేదు. నాచీరకమిత్తము పెట్టె మూఁతతీయఁగా పెట్టెమీఁదనున్న యెలుక నాచేతిమీఁదినుండి ప్రాఁకి యీ పెట్టెలో నుఱికినది. నేను భయపడి కేకవేసి పెట్టెమూఁతవేసినాను." అని చెప్పెను. "మంచిపని చేసినావు. ఎలుకలబాధ మనయింటవిస్తారముగా నున్నది. ఎక్కడిదో చూరెలుక యొకటి మనగదిలో ప్రవేశించి దండెముమీఁది బట్టలన్నియు కొట్టివేయుచున్నది. నేఁటికి దానికా యువు మూడి పెట్టెలో దూఱినది. పాఱిపోవునేమో పెట్టెతలుపుతీ యకు. పెట్టె నెత్తిమీఁదఁబెట్టి మనతాటకచేత నావలికిఁబంపెదను." అని యారెండవసుందరి చెప్పెను. వారిసంభాషణమువలన నేనా కాంత త్రిజటతల్లియని గ్రహించితిని. అప్పుడు తల్లిబిడ్డలకు మఱియు నీ క్రిందిరీతిని ప్రసంగముజరిగెను.

బిడ్డ—అమ్మా! ఈపెట్టె తాటకచేత పంపరాదు. అది యింటిలోని యెలుకను చంపివేయును.

తల్లి—అమ్మాయీ! నీకిష్టములేనియెడల చంపక దీనిని దూర ముగాఁగొనిపోయి యూరిబైట విడిచిరమ్మని నేను తాటకతో గట్టిగా చెప్పెదనులే.

బిడ్డ—నీవెన్ని చెప్పినను తాటక దీనిని చంపకమానదు. అది క్రూరురాలు. దానిమాట నేను నమ్మను. నాసఖియైనహిడింబిని కూడ వెంటఁబంపి దూరముగా వదలిపెట్టించెదను—ఓహిడింబీ! ఓహిడింబీ! వేగిరముగా.

తల్లి—ఇష్టమున్న యెడల హిడింబినికూడఁ బంపవచ్చును— ఓతాటకా! నీ చీపురుగట్టవిడిచి యిటురా. వీధియరుగులు తరువాత తుడువవచ్చునులే.

"అమ్మా! వచ్చుచున్నాను" అని దూరమునుండి యొక ధ్వని వినవచ్చినది.

"ముందుగా నీవిటు రా. నీపని తరువాత చేసికోవచ్చునులే." అని మరల త్రిజటతల్లి దానిని పిలిచెను. "పని కావచ్చినది. చేసికొని వచ్చెదను." అని దూరమునుండి మరల ధ్వని వినవచ్చెను. "అది యెంతసేపటికిని రాకున్నది. నేనుపోయి తీసికొనివచ్చెదను." అని త్రిజటతల్లి నడిచెను. ఆమె కాలిచప్పుడు వినఁబడఁగానే నాకు భయ మధికము కాఁజొచ్చినది. ఇంతలో నెవ్వరో లోపలికి వచ్చుచున్నట్లు మరల కాళ్ళచప్పుడయినది. ఆయడుగులచప్పుడు చెవినిబడఁగానే నాపాలిటికి మృత్యుదేవత్యైన తాటకయే వచ్చుచున్నదని నాగుండెలు తటతట కొట్టుకొన నారంభించినవి. అప్పుడెవ్వరో యిద్దఱు గుసగుస లాడుచున్నట్టు మాటలు వినఁబడఁజొచ్చినవి. అది రాక్షసులకేకాంత మైనను వారిగుసగుసలు సూక్ష్మశబ్దగ్రహణశక్తిగల మనుష్యులశ్రవణేంద్రియములకు స్పష్టముగా వినఁబడుచునేయుండును. అందుచేత నేను చెవియొగ్గి వారిమాటల నాలకింప మొదలుపెట్టితిని.

"ఓహిండింబీ! రాత్రి నీవు తెచ్చినబాలుఁడిప్పుడెక్కడ నున్నాఁడు. అమ్మతో నిందున్నది యెటుకయని నేను బొంకినాను."

"ఇప్పుడు నేనేమిచేయవలెను?"

"ఇతని కపాయము కలుగకుండ కాపాడి యేలాగునైనను నీపితనిని నాకడ మరలఁ జేర్పవలెను. నాఁటిరాత్రి తెచ్చుట తెచ్చుట గాదు. నేఁటిపగలు తెచ్చి నీప్రాణసఖియైన త్రిజట ప్రాణములు నిలుపవలెను.

"ఓత్రిజటా! నీనిమిత్తము నాప్రాణములనైన నిచ్చెదను. ఆరాక్షసిముండ కన్నులుగప్పి మరలతెచ్చి నీప్రియవల్లభుని నీకొప్పు సమర్పింపఁగలుగుదునో లేదో యని చింతించుచున్నది."

"అమ్మ తాటకను తీసికొనివచ్చుచున్నది. ఇఁకమాటల కవకాశములేదు. ఇదిగో పెట్టెతాళముచెవి. ఇది నీవు దానిచేతికియ్యక పదిలముగా నీయొద్దనుంచుకొని యేదో మాయోపాయముచేత దానిని దూరముగా పంపివేసి పెట్టెతీసి యీబాలకుఁడ్యాని నీ మెడిలో వేసికొని తీసికొనిరా."

"త్రోవలో నేదో యుపాయమాలోచించెదను."

అనుచుండఁగానే మరల పాదములచప్పుడు వినఁబడినది. ఇఁక నాకు ప్రాణభయములేదని నాగుండెలు కొంతకుదుటపడినవి. "ఈపెట్టె దీనినెత్తిమీఁదికెత్తు" అను శబ్దము రాఁగానే పెట్టెకదల నారంభించెను. ఆపెట్టెలో నాకప్పుడు కలిగిన యనుభవైకవేద్యమయిన సౌఖ్యము మనదేశమునందలి మోటుబండ్లలో నెక్కి యెత్తు మెఱక పల్లములుగల దారులలో ప్రయాణములుచేసి మోకాళ్ళకును మోచేతులకును శిరస్సులకును దెబ్బలు తగిలించుకొన్నవారికిఁ దక్క మఱియెవ్వరికిని దెలియదు. హృదయైకవేద్యమయిన యాభోగమును గొంత సేపనుభవించిన తరువాత పెట్టె భూమిమీఁద మోపినట్టయి యాకాంతలసంభాషణ మారంభమయ్యెను.

"ఓహిండిబీ! ఈమెలుక నేమిచేయుదము?"

"ఓతాటకా! చేయుటకేమున్నది? ఈపాదలచేరువను విడిచిపెట్టుదము. దీనిని చంపవలదని త్రిజట చెప్పినమాట నీవు వినలేదా?"

"త్రిజటమాటలకేమిలే. మనము దీనినిచంపక విడువరాదు. మొన్న నాయలుకుగుడ్డకన్నములోనికీడ్చుకొనిపోయినదియీమెలుకే."

"మంచిది. ఆలాగుననే చేయుదము. నీవాశ్మశానమువద్దికిఁ బోయి యొకకట్టెతీసికొనిరా. నేను పెట్టెమూఁతతీయఁగానే కట్టెతో నీమెలుకను చావమోఁదుదుగానిలే."

"ఈయాలోచన దివ్యముగా నున్నది. కాలుచున్న కాష్ఠము లోనుండి యొకకట్టెనుగొని యిక్కడనున్నట్టు వచ్చెదను."

ఈమాటలు చెవినిబడఁగానే నేనావఱకును పెట్టుకుపువలనఁ గలిగిన గాయములబాధను మఱచిపోయి ప్రాణభీతిచేత మానసికమైన మరణవేదనను పొంది నారంభించినాను. ఈమనోవేదనముందఱ నాశరీరవేదన పర్వతముతో పరమాణువంతైనను పోలఁచలేదు. ఏమియు పాలుపోక యల్లాడుచుపడుచున్న సమయములో హిడింబి పెట్టెమూఁతతీసి నన్ను పైకితీసినది. ఇంతలో నెవ్వరో దూరమునుండి "హిడింబీ! హిడింబీ!" అని పిలువఁజొచ్చిరి. "అయ్యో! ఈవాలఖిల్యుని నామొడిలోఁ బెట్టుకొని నాబట్ట సవరించుకొనుటకైన నవకాశములేకపోయినది! కానీ! ఇతని నిప్పటి కీపొదలో దాఁచి వారిని సాగనంపి మరలవచ్చి మొడిలోఁ బెట్టుకొనిపోయి నాచెలికి సమర్పించెదను. ఈలోపల తాటకవచ్చి యడిగినయెడల పెట్టెతీయఁగానే యెలుక పాఱిపోయి యేలో కలుఁగులో దూఱినదనిచెప్పెదను." అని తాననుకొనుచు నన్ను చేరువ పొదలోఁ బెట్టి తా నావచ్చెడివారి కెదురుగాఁ బోయెను. నేను దూరముగానున్నను వారిమాటలు నాకు వినఁబడుచునేయుండెను.

ఆవచ్చినపురుషులలో నొకఁడు—ఓహిడింబీ! రాత్రి వాలఖిల్యమహర్షి నెవ్వరో యెత్తుకొనిపోయినారఁట! ఆతనిని వెదకుట కయి మహాకాయుఁడుగారు మమ్మంపినారు. అతనిజాడ నీకేమియు తెలియలేదుగదా?

హిడిం— తెలియలేదుగాని నేనొక్క మాటవిన్నాను. ఎవ్వఁడో యంగుష్ఠమాత్రశరీరుఁడైన పురుషుఁ డొక్కఁడు జ్యోతిశ్శాస్త్ర ప్రతిపక్షులైన నవనాగరికులసభలో నున్నాఁడని విన్నాను.

పురు—ఆసభయెక్కడనో మాకు కొంచెము మానవాలు చెప్పఁగలవా?

హిడిం—ఇక్కడకు నాలుగుయోజనముల దూరములోనున్న తోఁటలోనున్నది. దారిచూపెదను రండి.

అని వారిని తీసికొని హిడింబి ప్రక్కసందునకుతిరిగి యదృశ్యయైనది "మీరనుకొన్న వాలఖిల్యుఁడను నేనే! నాపేరు సత్యరాజాచార్యులు." అని నేనుమహాకాయుని భృత్యులను పేరులుపెట్టిపిలిచి గొంతుపగులునట్టుగా నఱచితినిగాని నామాట వారు వినిపించుకొన్నవారుకారు. పొదనుండివెడలి వారివెంట పరుగెత్తుటకు తాటక కత్తిగొనివచ్చి యెక్కడచావమోఁదునో యన్నభీతిచేత నాకు సాహసము లేకపోయినది.

ఎనిమిదవ ప్రకరణము.

హిడింబి నన్ను పొదలోఁగూరుచుండఁబెట్టి పోయినతరువాత మనస్సులో పరిపరిలాగుల నాలోచనలు కలుగఁజొచ్చినవి. తాటక కత్తిగొనివచ్చి చావఁగొట్టునేమోయన్న భయము మొట్టమొదట పుట్టినది. గాని యారక్షసి పెట్టెలోనున్నది యెలుక యనుకొని యెలుకను చావమోఁదునిమిత్తము కత్తికొఱకు వెళ్ళినదన్నమాట స్మరణకువచ్చిన తరువాత భయనివారణమయినది. ఇంతలో హిడింబివచ్చి నన్ను పట్టుకొని యేమిచేయునో యన్నభయము మఱియొకటివచ్చి నామనస్సును మఱింత బాధింపఁజొచ్చినది. హిడింబి చేతిలో మరలఁ జిక్కుకొన్నపక్షమున నాకు మరణవేదనకన్నను క్రూరతరమయినబాధ సంభవించును. అది నన్నొడిలోఁ బెట్టుకొనిపోయి తనచెలికత్తెయైన త్రిజటకు మరల సమర్పించినపక్షమున, త్రిజట నన్నేమి బాధలఁ బెట్టునో!

మరల నేపెట్టెలోనో పఱుపుక్రిందనో పెట్టి తిరిగి నన్ను దాఁచినపక్షమున నేనీసారి యూపిరివెడలక యజ్ఞపశువువలె చావవలసివచ్చును. అని యాలోచించుకొని హిడింబివచ్చులోపలనే పొదవిడిచి పాఱిపోవలెనని నిశ్చయించుకొని నేను మెల్లగా పయికివెడలివచ్చి యొక చెట్టు చాటునకు నడిచితిని. ఇట్లొక చెట్టుమొదలుచేరి నలుదిక్కులకును చూడ్కి నిగిడించునప్పటికి నొకదిక్కునుండి తాటక చేతకఱ్ఱధరించి మృత్యుదేవతవలె నావంక కేవచ్చుచుండెను. మఱియొకదిక్కునుండి శ్మశానములుదాటి పెద్దవానర మొకటి నావంక కేవచ్చుచుండెను. ఇంకొక దిక్కునుండి యాపురుషులను విడిచి హిడింబియొక్క తెయు నావంక కేపరుగెత్తుకొనివచ్చుచుండెను. త్రేతాగ్నులవలెనామూఁడురూపములును నాకంటఁబడఁగానే నాకప్డుముగ్గురుమృత్యుదేవతలాసన్నమయినంతభయము వేసినది. చెట్టునకెగఁబ్రాఁకుదమన్న దానిప్రకాండము నాకౌఁగిటికొదుగదు. తొఱ్ఱలోదూఱుదమన్న నెందువెదకినను తొఱ్ఱ గానరాలేదు. ఏమిచేయుటకును దోఁచక నేనుదిగ్భ్రమనొంది దిక్కులు చూచుచుండఁగా ముందుగా హిడింబి వచ్చి పొదచేరి నన్నే కాఁబోలును వెదక నారంభించెను. ఇంతలో తాటకవచ్చి పెట్టెచేరి మూఁత తెఱచి యాశ్చర్యపడ నారంభించెను. అప్పుడు తాటక హిడింబిని జూచి నీవాపొదలో నేమివెదకుచున్నావని యడిగెను నీవుకఱ్ఱకొఱకు పోయినతరువాత నెలుక యెంతయున్నదో చూడవలెనన్న చపలత్వముచేత పెట్టెమూఁత యెత్తితీయఁగా నెక్క యెగురెగిరి యీవలబడి యెలుక యీపొదలోదూరినందున దానిని వెదకుచున్నానని హిడింబి యుత్తరముచెప్పెను. నేనామాట లాలకించుచు నేమఱియున్నసమయమునందు మెల్లగా వానరము నావద్దకువచ్చి నన్ను చంకఁబెట్టుకొని చెట్టుమీఁది కెగఁబ్రాఁకెను. నాదుస్స్వప్న ఫలమిప్పుడు నాకు పూర్ణముగా ననుభవమునకు వచ్చినది. నాకు కలలోఁ

గనఁబడిన కోఁతియే యిప్పుడు ప్రత్యక్షమయి నన్ను వృక్షాగ్రమునఁ బెట్టినది. అక్కడనుండి క్రిందికి జారిపడితినా చట్రాతిమీఁదఁబడిన గాజుకాయవలె నాతల వేయివ్రక్కలు కాకమానదు, ఏకొమ్మనైనను గట్టిగా కౌఁగిటఁబట్టుకొనవలెనన్నను పట్టుకొనీయక యీపాడుకోతి యెడమచేతితో భల్లూకపు పట్టుపట్టి నన్నొడిలోఁబెట్టుకొని కదలనియ్యకున్నది. చెట్టుపయిని నేనిట్టియవస్థలోనుండఁగా క్రింద హిడింబియు తాటకయు నన్ను వెదకుచు నేనున్న చెట్టుమొదటికి వచ్చిరి.

తాట—అయ్యో! చేతఁజిక్కిన యెలుకను నిష్కారణముగాఁ బోఁగొట్టితివిగదా!

హిడిం—నీవు కట్టెనిమిత్తమయిపోయి యెంతసేపటికిని రాకపోఁగా నెంతపెద్ద యెలుకో చూడవలెనని మూఁతకొంచెము తీయఁగానే యెలుక పైకుఱికి పాఱిపోయినది.

తాట—మహాకాయునియింట నున్న వాలఖిల్యమహర్షి నెవ్వరో యెత్తుకొనిపోయినారని చెప్పుచుండఁగా వినుచు నిలుచుండుటచేత కట్టెతెచ్చుటకు కొంచెము ఆలస్యమయినది. ఎలుక పైకిరాఁగానే తలుముకొనిపోయి పట్టుకొనలేకపోయినావా?

హిడిం—ఇంతలో మహాకాయునిభృత్యులిద్దఱిక్కడకు వచ్చియుండనియెడల దానిని నేను పోనిత్తునా? వాలఖిల్యమహర్షి రాత్రి యంతర్థానమయినమాట చెప్పుచు వారు నన్ను కొంతదూరము తమ వెంటఁ గొనిపోయినారు.

తాట—ఇక్కడ కలుగులులేవు. ఎలుక యీచెట్టుపైకి పాఱక లేదుగదా?

హిడిం—ఎలుకలు చెట్లెక్కునా?

తాట—చూచితివా చెట్టుమీఁద నెంతపెద్ద వానరమున్నదో?

హిడిం—ఏది? అదా! అవునవును. దానియొడిలో నేమో యున్నట్టున్నది.

తాట—అదృశ్యుఁడయిన వాలఖిల్యునివలెకనఁబడుచున్నాఁడు. అవునవును. అతఁడే. మాకొడిపిల్ల పోయినప్పుడు పరిశ్నయడుగఁగా యిన వాలఖిల్యుఁడితఁడే.

హిడిం—ఈవాలఖిల్యుఁడు మనకుదొరికిన బాగుండును. మన త్రిజట వాలఖిల్యుని జూడవలెనని యెన్నోసారులు నాతోఁ జెప్పినది. మనమితని దీసికొని పోయి యామెచేతికిచ్చి రెండుమూఁడు దినములు మనయింట నుంచుకొందము.

తాట—నీనన్నయాలోచన బాగున్నది. ఈకోఁతిని బెదరించి మన మీవాలఖిల్యుని పట్టుకొంటిమేని వేయిసువర్ణములు సంపాదించి మనము ధనికురాండ్రము కావచ్చును. మహాకాయుఁ డెంత సామ్ర్చియైన సీతనిని వదల్చుకొని పోకమానఁడు.

హిండి—అట్లయిన మన మీవాలఖిల్యుని పట్టుకొందము. నీవు చెట్టెక్కఁగలవా?

తాట—ఎలుకను బట్టుకొనుటకయి గుమికెడుపిల్లివలె నేని చెట్టుమీఁదికెక్క గంతువేసి వాలఖిల్యుని బట్టుకొనెదను. నీవీకజ్జుచేతఁ బట్టుకొని కోఁతి క్రిందకుఱికి పాఱిపోకుండ జాగరూకతతో కాచి చూచుచుండుము.

ఆమాటలు వినినప్పుడు నాబ్రతుకు ముందఱికివచ్చిన గోయి యు వెనుకకుఁబోయిన నూయియు నలెనుండెను. ఈముగ్గురిలో నెవ్వ. రిచేతిలోఁ బడినను నాకు ప్రాణసంశయస్థితియే సంభవించును. ఆము గ్గురను త్రేతాగ్నులనుగా నేనీవఱకే పోల్చియున్నానుగదా! నన్నుఁ గొనిపోయి దక్షిణస్వీకరించి విడువఁదలఁచినందున తాటకను దక్షిణా గ్నియనవచ్చును. నన్నుఁగొనిపోయి తనచెలికత్తె కర్పించి నన్ను గృ హపతినిగాఁజేయఁదలఁచినందున హిడింబిని గార్హపత్యాగ్ని యన వచ్చును. నానోటిలోనేదో కుక్కియో తోఁక నామెడకుఁ జుట్టఁ

బెట్టయో హోమము నిమిత్తమై బ్రాహ్మణులు పశువును బట్టి నట్టుగా నూపిరి వెడలనియ్యక నాప్రాణములు గొనఁదలఁచినందున మర్కటము నాహవనీయాగ్ని యని చెప్పవచ్చును. ఈమూఁడగ్నుల లో నాకప్పుడు దక్షిణాగ్ని మేలుగ దోఁచినందున నాయజమానుఁ డైన మహాకాయునియొద్దఁ జేరి సుఖింపవచ్చునన్న యాశచేత నేను తాటకచేతిలోఁ జిక్కఁదలఁచుకొని వానరముయొక్క యొడిలోనుండి దుమికి యారాక్షసిని కౌఁగిలించుకొనుటకయి చేతులుచాఁచుకొని సంసిద్ధుఁడనయి కూరుచుండియుంటిని. తానొకటి తలఁచిన దైవమొకటి తలఁచునుగదా! తాటక వృక్షమారోహించుట చూచి యాదుష్టవానరము నన్ను విడిచి పాఱిపోక తినఁబోకను నేను మొదట ననుకొన్నట్లుగా నామెడకుఁగాక నాపొట్టకు చుట్టఁబెట్టి నన్ను తనవీపుమీఁద నదిమిపెట్టి యాచెట్టుమీఁదినుండి మఱియొక చెట్టుమీఁదికి దుమికెను. అంతట తాటక చెట్టుదిగివచ్చి హిడింబితో నేమో యాలోచించి వానరమును రాళ్ళతో విసరనారంభించెను. దానికిసహాయురాలయి హిడింబియు మామీఁద శిలలు రువ్వసాగెను. ఆశిలాయుద్ధమునకు తాళఁజాలక వానరరాజు చెట్టుమీఁదినుండి యుఱికి నన్ను వీపుమీఁద వేసికొని పాఱిపోవఁజొచ్చెను. వెనుకనుండి యఱచుచు నారాక్షసాంగన లిరువురును మమ్ము తఱుముకొనివచ్చిరి. ఇట్లు కొంత దూరము పరుగెత్తునప్పటికి వెనుకఁజెప్పిన మహాకాయుని భృత్యులిద్దఱును ప్రక్కదారినివచ్చి వారినిగలిసికొని యేలపరుగెత్తుచున్నారని యడిగిరి. ఆచెడుకోఁతి బాలఖిల్యుని నెత్తుకొని పాఱిపోవుచుండగా విడిపించుటకయి పరుగెత్తుచున్నామని వారుత్తరము చెప్పిరి. ఇట్లు నలుగురును నొక్కచోటఁ జేరునప్పటికి పూర్వము నన్ను మండోదరి యప్పుడప్పుడు తీసికొని వచ్చెడి యుద్యానవనముకడకు మేమువచ్చితిమి. అంతట నలుగురును గలిసి తనవెంటఁబడ మర్కటరాజుమాత్ర

మును భయపడక నన్ను విడువక యక్కడనుండి యొక్కయూఁగవేసి యెగిరి సువేలాద్రిమీఁదికి దుమికెను. ఆ వానరుఁడు గంతు వేసినస్థలమునకు సువేలాద్రి నాలుగు యోజనములదూరములో నున్నదని నేనంతకుముందే మండోదరివలన నెఱిఁగియున్నాను. మర్కటము నన్ను వెన్నునఁ బెట్టుకొని కుప్పించి యుఱుకఁబోవునప్పుడు దైవమాయచేత నాకొక్కయూహపుట్టివచ్చినది. పూర్వాచారపరాయణుఁడ నగుటచేత పెద్దలయాచారము మీఱరాదని నేనప్పుడు కొంతసంతయాపదలో నున్నను నాయూహపుట్టింత పోవువఱకును చిటికలు వేయుచుంటిని. ఆకోఁతితో నేను సువేలాద్రిశిఖరమున వాలునప్పటికి లెక్కవేయఁగా నాచిటికలు సరిగా పదియైనవి. ఆలెక్కనుబట్టి పదిచిటికలకాలములో వానరము నాలుగు యోజనములదూరము దుముకునని నేను తెలిసికొంటిని. అప్పుడు నేను ముందువంకఁ జూచునప్పటికి నాయెదుట లవణసముద్రము మేఘమండలములనంటు తరంగములతోను మేఘనాదములతో వియ్యమందు సంతతధ్వనితోను భయంకరముగాఁగానఁబడెను. వానర మింకముందువంకకు దాటిపోవుట కవకాశము లేనందున నలుగురునువచ్చి చుట్టవేసి నన్ను దక్కించుకొని మహాకాయున కియ్యవచ్చునని నాలో నేను సంతోషపడుచుంటిని. ఇట్లు నేను మనోరథసామ్రాజ్యానందము నొందుచుండఁగానే వానరము కుప్పించి ముందువంక కుఱుకుట కుద్యుక్తమై యున్నట్టు కనఁబడెను. అందుచేతనే నీసారి యెంతదూరము దుముకునో చూడవలె నన్న యుత్సాహముచేత ముందు సముద్రమున్న మాటమఱచిపోయి చిటికలు వేయుటకు మొదలుపెట్టితిని. ఇన్నూటయేఁబదిచిటికలు లెక్కపెట్టునప్పటికి వానరము నన్ను గొని సముద్రమున కావలి యొడ్డుననున్న యొకవిశాలమైన యిసుకతిప్పలో వ్రాలినది. అప్పుడు నేను గణితశాస్త్రప్రకారముగా లెక్కవేసి యిన్నూటయేఁబదింటిని పదింటిచేత

భాగింపఁగా వచ్చినలబ్ధ మిరువదియైదు కాఁగా, పదిచిటికలకాలములో దుముకఁగలదూరము నాలుగుయోజనములగుటచేత నిరువదియైదును నాలుగుచేతగుణించి సముద్రముయొక్క వెడలుపు సరిగా నూఱుయోజనములని తెలిసికొని నేనత్యాశ్చర్యపడితిని. ఆహా! మనపూర్వులసామర్థ్యము నేమనిశ్లాఘింతును! వారునిజముగా సర్వజ్ఞులేసుమీ. అణుమాత్రమయినను హెచ్చుతగ్గులులేక నూఱుయోజనములని రామాయణములోఁ జెప్పినదానికిని నేను కన్నులారా కొలిచి లెక్కవేసినదానికిని సరిగా సరిపోయినది. లంకకును మనదేశమునకును నడుమనున్న సముద్ర మిదియేకదా? నేను సముద్రమును దాఁటునప్పుడు శ్రీరాములవారు కట్టిన వారావధిని స్పష్టముగా జూచినాను. మనుష్యులు లంకకుఁ బోవకుండుటకయి మరలివచ్చునప్పుడు శ్రీరాములవారు కట్టను నడునడుమ తెగఁగొట్టిన సందులును నాకంటికి కరతలామలకములుగాఁ గనఁబడినవి. మనపూర్వులను గుఱించి యాలోచించుచు నేను కొంచెమేమఱియుండఁగా వానరమునన్ను వెన్నుమీఁది నుండి తోఁకతో పైకెత్తి మఱియొక్క దుముకు దుమికినది. ఈసారి నేను వీపుమీఁదనానుకొని దృఢముగానుండక వాలమున వ్రేలుచు భయభ్రాంతుఁడనయి యుండుటచేత చిటికలువేసి దూరమును కనుఁగొనలేకపోయినాను. నేనిట్లు దిగ్భ్రమనొందియుండఁగానే యావానరము నన్ను నట్టడవిలో విడిచి యదృశ్యమయినది. అప్పటికి సూర్యగతినిబట్టి నాలుగయిదు గడియలప్రొద్దెక్కినట్టు తోఁచినది. కన్నులువిచ్చి చూడఁగా నక్కడిచెట్లు మొదలయినవి లంకలోనివానివలె నత్యున్నతములుగాక మనదేశములోని సామాన్యవస్తుజాలమువలెనే యున్నవి. ఆవానరముయొక్క వీపునానుకొని సముద్రమును దాఁటునప్పుడు నాకుతోఁచలేదుగాని నన్నిక్కడకుఁ గొనివచ్చి విడిచిన యామహానుభావుఁడెవ్వఁడా యన్నయాలోచన నామనస్సునకిప్పుడు కలిగినది. అతఁడు వాయు

పుత్రుఁడైన హనుమంతుఁడయినందుకు సందేహము లేదు. అతఁడు హనుమంతుఁడే కాకపోయినచో శతయోజనాయామమయిన సముద్రము నొక్కయంగను దాఁటుటకు మఱియొక్కనికి సాధ్యమగునా? కాదు మనపెద్దలు చెప్పినట్లుగా నతఁడు రావణాసురుని క్షామమారిపోకుండునట్లుగా ప్రతిదినము తాను దంతధావనము చేసికొన్న పుడకలనందు వేయుటకయి పోవుచుండునుగాన నేఁటియుదయమున నన్ను జూచి జాలి దలచి పాదలేపము లేని నేను రాక్షసులదేశమునుండి రాలేనని యిక్కడ తెచ్చి విడిచినాఁడు. నేనీయడవిలోని ఘాతుకమృగముల వాఁతబడక బ్రతికి యిచ్చటివారి యొద్దఁ జేరఁ గలిగినపక్షమున, రెండుమూఁడుమాసములలో వారిభాష నేర్చుకొని తరువాత నాకథను మీకు మహాత్ములచేతఁ బంపెదను.

సంపూర్ణము.